www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
పేజీలు: 14 + 20
సంపుటి: 14
సంచిక: 38
వెల: రూ. 5.00

బుధవారం | 16-8-2017
శ్రీహేవళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, కృష్ణపక్షం; తిథి: నవమి మ. 3.18 తదుపరి దశమి; నక్షత్రం: రోహిణి రా. 12.50 తదుపరి మృగశిర; వర్జ్యం: సా. 5.23-6.52; దుర్ముహూర్తం: ఉ. 11.55-12.45; అమృతఘడియలు: రా. 9.52-11.21; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.02; సూర్యాస్తమయం: 6.37
నిజామాబాద్ సిటీ*
Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tanuku | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai

• నాడు భారత్ ఛోడో.. నేడు భారత్ జోడో

ప్రధాని పంద్రాగస్టు నినాదం

సురాజ్యం మన.. జన్మహక్కు!


ఎర్రకోటపై నుంచి స్వాతంత్ర్య దినోత్సవ సందేశం ఇస్తున్న ప్రధానమంత్రి మోదీ

- ఐదేళ్లలో అభివృద్ధి శిఖరంపైకి
- 'చల్తాహై' వైఖరికి చెల్లు చీటీ
- మతం పేరిట హింస కుదరదు
- తూటాలతో కశ్మీర్ సమస్య తీరదు
- కశ్మీరీల మనసుకు దగ్గర కావాలి
- మూడేళ్లలో 1.25 లక్షల కోట్లు వెలికి
- 1.75 లక్షల డొల్ల కంపెనీలకు తాళాలు
- 800 కోట్ల బినామీ ఆస్తులు స్వాధీనం
- నోట్ల రద్దుతో 3 లక్షల కోట్లు బ్యాంకులకు
- మోకీళ్ల మార్పిడి చికిత్స ఖర్చు తగ్గిస్తాం
- ప్రతి జిల్లాలో డయాలిసిస్ కేంద్రాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): "స్వరాజ్యం నా జన్మహక్కు అని బాలగంగాధర్ తిలక్ నినదించారు! ఇప్పుడు స్వతంత్ర భారతంలో సుపరిపాలన నా జన్మహక్కు అనేదే నినాదం కావాలి. ప్రభుత్వం తన బాధ్యతలు... పౌరులు తమ విధులను నిర్వర్తించాలి. దివ్య, భవ్య భారత నిర్మాణమే మనందరి ధ్యేయం కావాలి' అని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. 'భువిపై వెలిసిన స్వర్గం ఇదే ఇదే' అని కవులు వర్ణించిన కాశ్మీర సీమకు పూర్వ వైభవం తీసుకొస్తామని ప్రకటించారు. "తిడితే కాదు. తూటాలతో పోదు. కశ్మీర్ సమస్యకు ఇవి పరిష్కారం కానే కాదు. కశ్మీరీలకు దగ్గరకావాలి. వారిని మనసులకు హత్తుకోవాలి" అని సరికొత్తగా

మిగతా 14వ పేజీలో...

2017
కొలువుల ఏడాది

84,876 ఉద్యోగాలు

వచ్చే ఏడాది ఖాళీలూ కలిపి ఈ సంవత్సరమే భర్తీ చేస్తాం

లక్ష దాటిన నియామకాలు


గోల్కొండ కోటలో పంద్రాగస్టు వేడుకల సందర్భంగా గౌరవ వందనం స్వీకరిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

- అభివృద్ధి, సంక్షేమం పాలనకు 2 చక్రాలు
- ప్రజల అండదండలే మాకు ఆత్మ బలం
- తెలంగాణ పునర్నిర్మాణం దిశగా పురోగమనం
- అద్భుత విజయాలతో అడుగులు ముందుకు
- 4118 పరిశ్రమలతో లక్ష కోట్ల పెట్టుబడులు
- నవంబర్లో ప్రపంచ పారిశ్రామిక వేత్తల సదస్సు
- ప్రతీప శక్తులు అడ్డుకుంటున్నా విజయ తీరాలకు
- భూముల సర్వేతో మరో చరిత్ర సృష్టిస్తాం
- పంద్రాగస్టు ప్రసంగంలో కేసీఆర్ ఉద్ఘాటన

హైదరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా.. ప్రతిష్ఠాత్మక గోల్కొండ కోట వేదికగా.. నిరుద్యోగులకు ముఖ్యమంత్రి కేసీఆర్ తీపి కబురు చెప్పారు. "ఇప్పటి వరకూ 27,660 నియామకాలు చేశాం. మరో 84,876 ఉద్యోగాల నియామక ప్రక్రియను సత్వరమే చేపట్టబోతున్నాం. వచ్చే ఏడాది ఏర్పడే ఖాళీలకు కూడా ఈ సంవత్సరమే నియామక ప్రక్రియను ప్రారంభించాలని నిర్ణయించాం" అని వెల్లడించారు. మొత్తం అన్నీ కలిపి తెలంగాణలో ఆశించిన దానికంటే మిన్నగా 1,12,536 ఉద్యోగాలను ప్రభుత్వం భర్తీ చేయబోతోందని వివరించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గోల్కొండ కోటలో జాతీయ పతాకాన్ని ఎగురవేసిన ఆయన.. ప్రజలనుద్దేశించి మాట్లాడారు. "శ్రామిక జనుల సౌభాగ్యం, సకల జనుల సంక్షేమం కోసం మొక్కవోని దీక్షతో ముందుకు సాగుతాం. ప్రజల అండదండలే మాకు తిరుగులేని ఆత్మబలాన్ని ఇస్తున్నాయి. మాలో అంకిత భావాన్ని పెంపొందిస్తున్నాయి. అట్టడుగు వర్గాలకు అభివృద్ధి ఫలాలను చేరవేసి.. ప్రజల ముఖాలపై చిరునవ్వులు విరబూసే బంగారు తెలంగాణను సాకారం చేసే మా ప్రయత్నంలో కలిసి వస్తున్న వారందరికీ కృతజ్ఞతలు. మా ప్రయత్నాలకు

మిగతా 11వ పేజీలో...

2345 పోస్టులకు నోటిఫికేషన్

అటవీశాఖలో 2014, వైద్యవిధాన పరిషత్లో 331

21 నుంచి దరఖాస్తుల ప్రక్రియ: ఘంటా చక్రపాణి

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 242 పోస్టులు

బోధన సిబ్బంది భర్తీకి వారంలో నోటిఫికేషన్: వీసీ

12

క్రమబద్ధీకరణ సాధ్యం కాదు!

కాంట్రాక్టు లెక్చరర్లపై తిరుపతిరావు కమిటీ నివేదిక

వేతనం రూ.48 వేలకు పెంపు?

జూన్ 3న సివిల్స్
ప్రిలిమ్స్

ఫిబ్రవరి 7న నోటిఫికేషన్

మార్చి 6 వరకు దరఖాస్తులు

12


పంద్రాగస్టు సందర్భంగా గవర్నర్ ఇచ్చిన ఎట్హోం విందులో కేసీఆర్, చంద్రబాబు, దత్తాత్రేయ, ఉత్తమ్, డీఎస్, పవన్కల్యాణ్ తదితరులు

సీట్లపై కొట్లాడుదాం!

- నియోజకవర్గాల పునర్విభజనపై ఇద్దరు సీఎంల చర్చ
- గవర్నర్ నరసింహన్ సమక్షంలో 2 గంటల సమావేశం
- భూసేకరణ , ఎగువ రాష్ట్రాల నుంచి నీటిపైనా చర్చ
- జీఎస్టీ ప్రభావంపై మథనం.. ఆహ్లాదకరంగా ఎట్ హోం
- తొలిసారిగా పవన్ కల్యాణ్ హాజరు.. కేసీఆర్తో ముచ్చట
- పక్కపక్కనే కేటీఆర్, ఉత్తమ్.. నేరెళ్లపై ఆసక్తికర సంవాదం

హైదరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్రంపై మరోసారి ఒత్తిడి తెస్తే ఎలా ఉంటుందనే అభిప్రాయం రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య వ్యక్తమైనట్లు తెలిసింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లోని పుర ప్రముఖులు, రాజకీయ ప్రతినిధులకు గవర్నర్ నరసింహన్ మంగళవారం ఎట్ హోమ్ విందు ఏర్పాటు చేశారు. దీనికి ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం కేసీఆర్ హాజరయ్యారు. గవర్నర్ సమక్షంలో ఇద్దరూ అంతరంగికంగా సమావేశమయ్యారు. సుమారు గంటా 20 నిమిషాలపాటు చర్చించుకున్నారు. కొద్ది రోజుల

మిగతా 10వ పేజీలో...

సిద్దిపేటలో డయాలసిస్

2 రోజుల్లో కేంద్రం ఏర్పాటు.. పేదలకు ఉచితంగా సేవలు

జిల్లా కేంద్రానికి వచ్చేవారికి రూ. 5కే భోజనం: హరీశ్



సిద్దిపేట, ఆగస్టు 15: సిద్దిపేట జిల్లా కేంద్రంలో రెండు రోజుల్లోగా డయాలసిస్ సెంటర్ను ఏర్పాటు చేస్తామని భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు ప్రకటించారు. ఈ కేంద్రంలో పేదలైన కిడ్నీ రోగులకు డయాలసిస్ సేవలను ఉచితంగా అందిస్తామని ఆయన చెప్పారు. ఇకపై సిద్దిపేట నుంచి హైదరాబాద్ వెళ్లి డయాలసిస్ చేయించుకునే అవసరం రాదన్నారు. మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన మాట్లాడారు. సిద్దిపేట జిల్లా ఆస్పత్రిని 300 పడకలకు ఆధునికీకరిస్తున్నామని, ఎల్లప్పుడూ 25 మంది వైద్యులు అందుబాటులో ఉంటారని చెప్పారు. ఇక, వివిధ పనుల కోసం జిల్లా కార్యాలయాలకు వచ్చే ప్రజలకు రూ.5కే భోజన వసతులు కల్పిస్తామని హరీశ్ రావు తెలిపారు. హరేరామ హరేకృష్ణ ట్రస్టు సహకారంతో భోజన వసతులు సమకూరుస్తామన్నారు. కాగా, అంతగిరి పోచమ్మ సాగర్, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ తదితర రిజర్వాయర్లతో సిద్దిపేట జిల్లా రిజర్వాయర్ల ఖిల్లాగా మారబోతోందని ఆయన అన్నారు. వచ్చే ఏడాదిలోగా జిల్లాకు తప్పనిసరిగా కాళేశ్వరం నీళ్లు అందిస్తామని ఆయన స్పష్టం చేశారు.

ఆస్పత్రుల నిధులు కేసీఆర్ కిట్కు

- మళ్లుతున్న సొమ్ము
- ఆగిన బిల్లుల చెల్లింపు
- నిలిచిన ఇతర పనులు




హైదరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): వైద్య పరికరాలు, ఆస్పత్రుల నిర్మాణాలు, ఇతర సివిల్ పనులకు వెచ్చించాల్సిన నిధులను కేసీఆర్ కిట్ల పథకానికి మళ్లిస్తున్నారు. దీంతో ఆస్పత్రుల అభివృద్ధి కార్యకలాపాలకు ఇబ్బంది తలెత్తుతోంది. రాష్ట్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్సీ) స్థాయి నుంచి జిల్లా ఆస్పత్రులు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల వరకు అనేక మార్పులు తేవాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. పలు కొత్త ఆస్పత్రులను ఏర్పాటు చేయాలని కూడా నిర్ణయించారు. అనేక పీహెచ్సీలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే ఉన్న ఆస్పత్రుల స్థాయిని కూడా పెంచుతున్నారు. వాటికి కొత్త భవనాలు, ఇతర

మిగతా 12వ పేజీలో...

గ్రామస్థులందరికీ
దోమతెరలు

ఒక్కరికి మలేరియా వచ్చినా ఊరు మొత్తం సరఫరా

వచ్చే నెల నుంచి పంపిణీ



హైదరాబాద్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి) : గ్రామంలో ఒక్కరికి మలేరియా వచ్చినా... గ్రామస్థులందరికీ దోమ తెరలు సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు భారీగా దోమ తెరల పంపిణీకి ప్రణాళిక రూపొందించింది. ఇందులో భాగంగా రాష్ట్రానికి 4.89 లక్షల దోమ తెరలు రానున్నాయి. వచ్చే నెల నుంచి ఈ దోమ తెరల సరఫరాను ప్రారంభించనున్నారు. ముఖ్యంగా

మిగతా 10వ పేజీలో...



ఆఫీసులో చిరుత.. బెదిరిపోయిన ఉద్యోగులు

ఎప్పటిలాగే ఉద్యోగులు ఆఫీసుకు వెళ్లారు. ఎవరి సీట్లలో వారు కూర్చునేందుకు వెళుతున్నారు. ఇంతలో ఓ డెస్క్ కింద ముదురు గోధుమ రంగులో ఉన్న చిరుతను చూశారు. ఉద్యోగులను చూసిన చిరుత గాండ్రింపులతో హడలెత్తించింది. దాని గాండ్రింపులకు అదిరిపోయిన ఉద్యోగులు ఫైర్ సర్వీస్‌కు ఫోన్ చేసి సమాచారమిచ్చారు. వారు చిరుతను పట్టుకుని వన్య ప్రాణుల సంరక్షణను చూసే ఓ ఎన్జీవోకు అప్పగించారు. ఫైర్‌ఫైటర్స్ ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో చిరుత ఫొటోలు, వీడియోను పోస్ట్ చేశారు. బ్రెజిల్‌లోని అతిపెద్ద నగరమైన సావో పాలోకు సమీపంలోని ఇటాపెసెరికా ద సెరా అనే చిన్నపట్టణంలో జరిగిందీ ఘటన. అక్కడ తరచూ కార్చిచ్చు రాజుకుంటుండడం వల్లే అడవి నుంచి చిరుత ఇలా ఆఫీసులోకి వచ్చి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

లోకం తీరు



ఇదిగో దీనితో ముందుకు సాగు..



స్టూడియోలో పాట పాడుతున్న కలెక్టర్ చంపాలాల్

భీంపై కైగట్టి.. పాటపాడి

- కళాకారుడిగా కలెక్టర్ చంపాలాల్ ప్రతిభ
- సోషల్ మీడియాలో వీడియో వైరల్
- సీడీ ఆవిష్కరించిన స్వామిగౌడ్


ఆసిఫాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): చంపాలాల్.. ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్‌గా బిజీగా ఉంటూనే తనలోని కళాకారుడిని తట్టిలేపారు! గిరిజన హక్కుల కోసం పోరుసల్పిన యోధుడు కుమరం భీం సహా జిల్లా సంస్కృతి, సంప్రదాయాలపై ఓ గేయానికి ఆయన కై (బాణీలు) కట్టడమే కాదు.. అంతే అద్భుతంగా పాడారు కూడా. ఇప్పుడీ పాట సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. చంపాలాల్ స్వతహాగా కళాకారుడు. ఆసిఫాబాద్ కలెక్టర్‌గా అక్కడి సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంచుకున్న చంపాలాల్.. వాటికిఓ గేయ రూపంలో ప్రచారం కల్పించాలనే ఉద్దేశంతో రచయిత సురేశ్ బాబుకు పాట రాయాలని సూచించారు. 'జయహో నవచేతనమా.. జనచేతన నర్తనమా..' అంటూ సాగే ఈ పాటను ఇటీవల స్వీయ స్వరకల్పనలో చంపాలాల్ ఆలపించారు. కాగా కుమరం భీం జిల్లాపై ఆయన పాడిన పాటతో పాటు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వేడుకలకు సంబంధించి ప్రత్యేకంగా రూపొందించిన వీడియో సీడీని మండలి చైర్మన్ కె.స్వామిగౌడ్ మంగళవారం పంద్రాగస్టు వేడుకల్లో ఆవిష్కరించారు.

'బ్లూవేల్' తొలగించండి

గూగుల్, ఫేస్‌బుక్, మైక్రోసాఫ్ట్‌కు కేంద్రం ఆదేశాలు

- మరో ఇద్దరిని మింగేసిన బ్లూవేల్ గేమ్!

న్యూఢిల్లీ, ఆగస్టు 15: బ్లూవేల్.. చాలెంజ్ తర్వాత చాలెంజ్ ఇస్తూ చివరకు పిల్లలను మింగేస్తున్న భయంకరమైన ఆన్‌లైన్‌గేమ్. మొన్నమొన్నటిదాకా బయటిదేశాలకు మాత్రమే పరిమితమైన ఈ బ్లూవేల్.. ఇప్పుడు భారత్‌లోనూ కోరలు చాస్తోంది. ఇప్పటికే ఈ బ్లూవేల్ చాలెంజ్ తీసుకుని ఇప్పటికే ఇద్దరుముగ్గురు పిల్లలు ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ బ్లూవేల్ మరింత విజృంభించకుండా కేంద్రం చర్యలు చేపట్టింది. ప్రాణాలను మింగేసే ఈ గేమ్‌కు సంబంధించిన అన్ని లింకులను తొలగించాలని ఇంటర్నెట్ దిగ్గజాలైన గూగుల్, ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, మైక్రోసాఫ్ట్, యాహూలను కేంద్రం ఆదేశించింది. ఆగస్టు 11న ఆయా సంస్థలకు ఎలక్ట్రానిక్స్ అండ్ ఐ.టి మంత్రిత్వ శాఖ లేఖ రాసింది. కాగా, ఇప్పటిదాకా ముంబై, కోల్‌కతాల్లో బ్లూవేల్ చాలెంజ్ తీసుకుని ఇద్దరు బాలురు ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే.



మరో ఇద్దరిని మింగేసిన బ్లూవేల్

కేరళ, మణిపూర్‌లోనూ ఇద్దరు బాలురు ఆత్మహత్య చేసుకున్నారు. వారు కూడా బ్లూవేల్ చాలెంజ్‌లో భాగంగానే ప్రాణాలు తీసుకున్నారని అనుమానిస్తున్నారు. కేరళ తిరువనంతపురానికి సమీపంలోని విలాపిలసలకు చెందిన 16 ఏళ్ల బాలుడు గేమ్ ఆడుతూ ఉరేసుకున్నట్టు స్థానిక పోలీసులు చెప్పారు. జూలై 26న జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆ బాలుడు గేమ్ ఆడిన విషయాన్ని అతడి తల్లి వెల్లడించింది. అది విన్న తనకు ఒళ్లు జలదరించిందని, వెంటనే గేమ్ ఆడొద్దని తన కొడుకుకు చెప్పానని ఆమె తెలిపింది. ఓసారి తనను తాను కంపాస్‌తో గాయపరుచుకున్నాడని, మరో సందర్భంలో ఈత రాకపోయినా నదిలోకి దూకేశాడని ఆమె తెలిపింది. ఇక, మణిపూర్‌లో ఓ 19 ఏళ్ల యువకుడు సోమవారం ఓ భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. హౌజ్‌ఖాస్‌లోని మైబార్ గ్రిల్ అనే రెస్టారెంట్ భవనంపై నుంచి దూకి ప్రాణాలు తీసుకున్నాడు. అతడిని సిద్ధార్థ్ సింగ్‌గా పోలీసులు గుర్తించారు. ఆ యువకుడు మణిపూర్ మాజీ మంత్రి కుమారుడిగా పోలీసులు భావిస్తున్నారు. అతడు కూడా బ్లూవేల్ గేమ్ చాలెంజ్ తీసుకునే చనిపోయాడని పోలీసులు అనుమానిస్తున్నారు.

250 కోట్ల పింక్ డైమండ్ డీల్

నలుగురు భారత వ్యాపారులకు ఇంటర్‌పోల్ రెడ్ నోటీసులు

రష్యా వ్యాపారి అక్రమంగా లాగేసుకున్నాడంటున్న వ్యాపారులు

జోహన్నస్‌బర్గ్, ఆగస్టు 15: రూ.250 కోట్ల విలువైన అరుదైన పింక్ వజ్రం అది! మూడు పార్టీల మధ్య ఓ డీల్ కుదిరింది! కానీ, ఆ తర్వాతే కథ మలుపు తిరిగింది! నువ్వంటే నువ్వే దొంగ వంటూ పార్టీల మధ్య తగాదా పెరిగింది! నాలుగుదేశాల్లో అది న్యాయవివాదంగా మారింది! దాదాపు రెండేళ్లుగా సాగుతున్న ఆ న్యాయవివాదంలో నలుగురు భారత సంతతికి చెందిన దక్షిణాఫ్రికా వ్యాపారులకు ఇంటర్‌పోల్ రెడ్ నోటీసులు ఇచ్చే దాకా వెళ్లింది! వారిప్పుడు దక్షిణాఫ్రికాలోని ప్రిటోరియా హైకోర్టులో రెడ్ నోటీసులపై పోరాడుతున్నారు. అసలేమైందంటే.. జునైద్ మోతీ, అతడి తండ్రి అబ్బాస్ అబూ బాకర్ మోతీ, వారి అనుచరులు ఆశ్రుఫ్ కాకా, సలీం బోబట్‌లు పింక్ డైమండ్‌కు సంబంధించి రష్యాకు చెందిన టెలీకమ్యూనికేషన్ టైకూన్ అలిబెక్ ఇసాయెవ్, రష్యాకే చెందిన సిల్లా మౌసా అనే అంతర్జాతీయ డైమండ్ డీలర్‌తో ఓ డీల్ కుదుర్చుకున్నారు. అయితే, ఆ డైమండ్‌ను రష్యాలో అమ్మిస్తానని చెప్పి ఇసాయెవ్ డైమండ్ పేపర్లను అక్రమంగా తీసుకున్నాడని చెబుతున్నారు. అయితే, ఆ నలుగురు భారతీయులు తన దగ్గర నుంచి వజ్రాన్ని కాజేశారని ఆరోపిస్తున్నాడు. ఇక, 2003లో ఆ పింక్ డైమండ్‌ను ఆ నలుగురే తన వద్ద నుంచి దొంగిలించారని డైమండ్ డీలర్ మౌసా అంటున్నాడు. ఈ వ్యవహారం కాస్తా ఫ్రాన్స్, లెబనాన్, జింబాబ్వే, దుబాయ్‌లలో న్యాయవివాదంగా మారింది. ఈ క్రమంలోనే లెబనాన్ ఇంటర్‌పోల్ అధికారులు భారత వ్యాపారులకు రెడ్ నోటీసులు జారీ చేశారు. ఎక్కడున్నా అరెస్ట్ చేయాలని వారెంట్ ఇచ్చారు. ఈ మొత్తం వ్యవహారంలో ఇంకో అదిరిపోయే ట్విస్టేంటంటే... వారికిప్పటిదాకా నోటీసులేవీ అందలేదని దక్షిణాఫ్రికా పోలీసులు, న్యాయాధికారులు చెప్పడం.



ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	21.1	31.4
హైదరాబాద్	22.1	31.9
వరంగల్	23.0	32.0
నిజామాబాద్	23.8	30.0
రామగుండం	24.5	32.0
నల్లగొండ	24.6	34.0

రేపు, ఎల్లుండి భారీ వర్షాలు!

హైదరాబాద్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అక్కడక్కడా గురు, శుక్రవారాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. ఈ మేరకు మంగళవారంనాటి నివేదికలో వెల్లడించింది. ఖమ్మం, భద్రాచలంలలో మంగళవారం సాధారణం కంటే 3.4 డిగ్రీలు, 3.9 డిగ్రీలు, హైదరాబాద్ నగరంలోనూ సాధారణం కంటే 1.9 డిగ్రీలు అధికంగా పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

జెండా వందనానికి వెళుతున్న బాలికపై అత్యాచారం

ఛండీగఢ్, ఆగస్టు 15: మహిళలు, బాలికలకు ఏదీ స్వాతంత్ర్యం? పట్టపగలు వీధుల్లో స్వేచ్ఛగా తిరగలేని దైన్యం!! పంద్రాగస్టు వేడుకల్లో పాల్గొనేందుకు వెళుతున్న ఓ బాలిక దారుణంగా అత్యాచారానికి గురైంది. ఛండీగఢ్‌లో మంగళవారం ఓ 12 ఏళ్ల బాలిక తన పాఠశాలలో జరిగే స్వాతంత్ర్యదిన వేడుకల్లో పాల్గొనేందుకు బయలు దేరింది. షార్ట్‌కట్‌లో వెళ్లాలనే ఆత్రంలో ఛండీగఢ్ సెక్టార్ 23లో చిల్డ్రన్స్ పార్కులోకి వెనుక గేటు గుండా ప్రవేశించింది. ఆ సమయంలో ఓ వ్యక్తి ఆమెను చాకుతో బెదిరించి పొదల్లోకి తీసుకెళ్లి అత్యాచారానికి ఒడిగట్టాడు. జరిగిన ఘోరాన్ని బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలికను మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి వాంగ్మూలం తీసుకున్నారు. వైద్యపరీక్షల కోసం ఆస్పత్రికి తరలించారు.

గ్వామ్‌లో మోగిన ప్రమాద ఘంటికలు!

- భయంతో పోలీసులకు ఫోన్లు చేసిన ద్వీపవాసులు
- అవి పొరబాటు హెచ్చరికలేనని తర్వాత వెల్లడి
- ఇప్పుడే దాడులు చేయబోనన్న కిమ్

హగట్నా (గ్వామ్), ఆగస్టు 15: అది.. అసలే ఉత్తరకొరియా అణుక్షిపణులకు అందేంత దూరంలో ఉన్న గ్వామ్ ద్వీపం. అమెరికా నౌకా, వైమానిక దళ స్థావరాలున్న ఆ ద్వీపం మీద 'ఇహనో ఇప్పుడో ఆ ద్వీపం మీద మేం బాంబులు వేసేస్తాం' అంటూ ఉత్తరకొరియా పదేపదే హెచ్చరికలు జారీ చేస్తోంది. ఇలాంటి తరుణంలో.. సోమవారం అర్ధరాత్రి దాటాక 12.25 సమయంలో.. రెండు రేడియో స్టేషన్లు ఎమర్జెన్సీ హెచ్చరికలు జారీ చేశాయి. అంతే! గ్వామ్‌వాసుల గుండెలు అదిరిపోయాయి. దీంతో.. వారు పోలీసులకు ఫోన్ చేసి రక్షించమని కోరారు. కానీ.. ఆ హెచ్చరికలు పొరబాటున వచ్చినవేనని అధికార వర్గాలు పేర్కొనడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ దీవి సమీపంలో క్షిపణిదాడులకు సంబంధించి ఉత్తరకొరియా సైనిక కమాండర్లు ఆ దేశాధిపతి కిమ్‌జాంగ్‌కు నివేదించినట్టు వస్తున్న వార్తలు.. వారిని నిద్ర పోనివ్వడ లేదు. ఇప్పుడే దాడులు చేయబోమని కిమ్ చెప్పినట్టు వార్తలు వస్తున్నా వారి భయాందోళనలు తగ్గట్లేదు.



ఎడప్పాడీ పదవి వదిలేయ్

"రాష్ట్రంలో నేరాలు ఘోరాలు విచ్చలవిడిగా జరుగుతున్నా ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని ఒక్కపార్టీ కూడా డిమాండ్ చేయకపోవడం శోచనీయం. డీఎంకే, అన్నాడీఎంకే వంటి పార్టీలు పరికరాలు... అవి పదును కోల్పోతే కొత్త పరికరాలను వెతుకుతాం.


\- ట్విట్టర్‌లో కమల్‌హాసన్



రాష్ట్ర అసెంబ్లీకి ఏ సమయంలోనైనా ఎన్నికలు జరిగే అవకాశముంది. కార్యకర్తలు సిద్ధంగా ఉండాలి. జయ మరణం తర్వాత అన్నాడీఎంకే మూడుగా విడిపోయింది. దినకరన్ వద్ద 22 మంది ఎమ్మెల్యేలు ఉన్నట్లు తేలడంతో ఎడప్పాడీ ప్రభుత్వం కూలిపోవడం ఖాయమైంది. ఇప్పటికప్పుడు స్థానిక సంస్థలు, అసెంబ్లీకి ఒకేసారి ఎన్నికలు జరిగితే డీఎంకే విజయం ఖాయం.

\- స్టాలిన్, డీఎంకే కార్యాచరణ అధ్యక్షుడు

- వ్యాధులను గుర్తించే 3డీ ప్రింటెడ్ చిప్



వాషింగ్టన్, ఆగస్టు 15: రక్త నమూనాలతో వ్యాధులను గుర్తించే అతి చవకైన, 3డీ ప్రింటెడ్ చిప్‌ను శాస్త్రవేత్తలు తొలిసారిగా రూపొందించారు. 18 మైక్రోమీటర్ల పొడవు, 20 మైక్రోమీటర్ల వెడల్పు ఉండే ఈ సూక్ష్మద్రావక పరికరం రక్తంలోని బయోమార్కర్లను, కణాలను, తదితర చిన్న నిర్మాణాలను విడగొడతాయట. చవకగా చిప్‌ను రూపొందించడానికి డిజిటల్ లైట్ ప్రాసెసింగ్ స్టీరియోలిథోగ్రఫీ(డీఎల్పీ-ఎస్ఎల్ఏ) విధానాన్ని ఉపయోగించినట్లు శాస్త్రవేత్తలు వెల్లడించారు.

- వైరస్ దాడిని చూపే 3డీ వీడియో

వాషింగ్టన్, ఆగస్టు 15: ఆరోగ్యమైన కణంపై వైరస్ ఎలా దాడి చేస్తుంది? దాడి చేసేందుకు ఎలా, ఎప్పుడు సన్నద్ధమవుతుంది? కణంపై ఏ ప్రదేశంలో ప్రభావం చూపుతుంది? అని తెలిసేలా శాస్త్రవేత్తలు తొలిసారి ఒక 3డీ చిత్రాన్ని రూపొందించారు. వైరస్ ధోరణిని, స్థితులను తీసిన లక్షలాది ఛాయాచిత్రాలతో ఎక్స్‌రే ఫ్రీ ఎలక్ట్రాన్ లేజర్(ఎక్స్ఎఫ్ఈఎల్)ను ఉపయోగించి చిత్రాన్ని తయారు చేశారు. మెషీన్ లర్నింగ్, అవకలన జ్యామితి, గ్రాఫ్ సిద్ధాంతం, వివర్తన భౌతిక శాస్త్రం భావనల్ని ఉపయోగించి ఛాయాచిత్రాలను వరుసగా పేర్చి వీడియోగా మార్చారు.

- యూఎస్‌బీ డివైస్‌లతో సమాచారం లీక్!

మెల్‌బోర్న్, ఆగస్టు 15: కంప్యూటర్‌లో ఉన్న ఏదేని సమాచారాన్ని ఒక చోటు నుంచి మరోచోటుకు చేరవేయాలన్నా.. వేరేవాళ్లకు ఇవ్వాలన్నా.. యూఎస్‌బీ పోర్టులున్న పరికరాలను వాడుతుంటాం. అయితే, ఒక్కసారి ఆగండి. ఎందుకంటే వాటి ద్వారా సమాచారం లీకయ్యే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఒక పోర్టులో మనం పెన్‌డ్రైవ్ ఉంచి సమాచారం పంపిస్తుండగా, అదే పరికరానికి ఉన్న మరో పోర్టులో వేరే వాళ్లు మరో పెన్‌డ్రైవ్ కనెక్ట్ చేసి సమాచారాన్ని దోచేస్తారని ఆస్ట్రేలియాలోని యూనివర్సిటీ ఆఫ్ అడిలైడ్ పరిశోధకులు అంటున్నారు.

- గుండెను బాగు చేసే టిష్యూ బ్యాండేజీ

టొరంటో, ఆగస్టు 15: దెబ్బతిన్న గుండె కణజాలాన్ని బాగు చేసే ఇంజెక్టిబుల్ టిష్యూ బ్యాండేజీని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. గుండెపోటు సంభవిస్తే కణజాలం దెబ్బతిన్నపుడు ఓపెన్‌హార్ట్ సర్జరీ చేయాల్సి ఉంటుంది. అయితే, పోస్టల్ స్టాంప్ కంటే చిన్నగా ఉండే ఈ టిష్యూను గుండెలోకి చొప్పించి గుండెపోటు ద్వారా దెబ్బతిన్న భాగాన్ని రిపేర్ చేయొచ్చట. దీన్ని కెనడాలోని యూనివర్సిటీ ఆఫ్ టొరంటో శాస్త్రవేత్తలు తయారుచేశారు.

- మూలకణ చికిత్సతో జుట్టు పెరుగుదల!



లాస్‌ఏంజెలిస్, ఆగస్టు 15: బట్టతలను నివారించడానికి ఇప్పటి దాకా ఉపశమనచర్యలు మాత్రమే ఉన్నాయి. కానీ, తాజాగా అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా పరిశోధకులు తలపై ఉన్న మూలకణాలను ఉత్తేజపరిచి జుట్టు పెరుగుదలకు దోహదం చేసే సరికొత్త విధానాన్ని కనుగొన్నారు. జుట్టులో జీవాణువులు చాలా కాలం బతికే ఉంటాయని, వాటిని ప్రేరేపిస్తే జుట్టు పెరగడానికి అవకాశం ఉందని తెలిపారు.

ఏడాది పాటు బియ్యం ఫ్రీ

గ్రామ సర్పంచ్ ఔదార్యం.. చెక్కు అందజేత



రేషన్ డీలర్‌కు డీడీని అందజేస్తున్న సర్పంచ్ గుండమ్మ

జహీరాబాద్, ఆగస్టు 15: ఊరికి ఉపకారం చేస్తే ఏమొస్తుంది.. అనే ఈ రోజుల్లో ఓట్లు వేసి గెలిపించిన సొంత ఊరి ప్రజలందరికీ కడుపునిండా బుక్కెడు బువ్వ పెట్టాలనుకున్నారు ఓ గ్రామ సర్పంచ్. ఒక్క రోజు.. రెండు రోజులు కాదు.. ఏకంగా ఏడాది పాటు గ్రామంలోని ప్రజలందరికీ ఉచితంగా రేషన్ బియ్యం అందజేయాలని సంకల్పించారు. ఆమె ఆలోచనలకు అంకురార్పణ దేశ స్వాతంత్ర్య దినోత్సవమే శుభముహూర్తమైంది. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం కొత్తూర్(బీ) గ్రామ సర్పంచ్ ఎన్. గుండమ్మ మంగళవారం ఆ ఊరి రేషన్ డీలర్‌కు రూ.లక్ష డీడీని అందజేసి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. ఊరికి సరిపడా రేషన్ బియ్యానికి రూ.1,48,800 ఖర్చు అవుతుంది. మిగతా మొత్తాన్ని త్వరలోనే అందజేస్తామని ఆమె తెలిపారు. ఆ ఊరిలో 600 రేషన్ కార్డులున్నాయి. ప్రభుత్వం ప్రతి నెలా 124 క్వింటాళ్ల బియ్యం రూపాయికి కిలో చొప్పున(నెలకు రూ.12,400) అందజేస్తోంది. కాగా, గ్రామంలో ఆడపడుచుల వివాహానికి క్వింటాలు సన్నబియ్యం ఉచితంగా అందజేస్తున్నామని గుండమ్మ తెలిపారు.

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.72.07	పాత ధర 62.25
కొత్త ధర రూ.72.14	కొత్త ధర 62.31
పెరుగుదల 7 పైసలు	పెరుగుదల 6 పైసలు

పోర్న్‌సైట్‌లో మహిళా కానిస్టేబుల్ నంబరు

- ఫోన్‌చేసి నిత్యం వేధింపులు.. యువకుడి అరెస్టు



నిందితుడు నిఖిల్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఏకంగా షీ టీమ్స్ మహిళా కానిస్టేబుల్‌కే ఫోన్ చేసి అసభ్యపదజాలంతో వేధించాడా ప్రబుద్ధుడు. పైగా తనపై అధికారులకు ఫిర్యాదు చేసిందనే కక్షతో ఆమె నంబరును ఓ పోర్న్ వెబ్‌సైట్‌లో పోస్ట్ చేశాడు. నిత్యం వందలకొద్దీ ఫోన్లు వస్తుడటంతో మహిళా కానిస్టేబుల్... పోలీసులకు ఫిర్యాదు చేయడడంతో ఎట్టకేలకు ఆ పోకిరిని అరెస్టు చేశారు. రాచకొండ షీటీమ్స్ ఏసీపీ స్నేహిత వివరాల ప్రకారం.. వరంగల్ రూరల్ జిల్లా, పరకాల మండలం, సాగరవిడి గ్రామానికి చెందిన బీరం నిఖిల్ కుమార్.. ఇబ్రహీంపట్నంలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. నిరుడు మంచాలలోని ఒక కళాశాలలో డిగ్రీ చదువుతున్న ఓ విద్యార్థిని మొబైల్ నంబర్‌కు అసభ్యకర సందేశాలు పంపాడు. ఫోన్ చేసి ఇబ్బందులకు గురిచేశాడు. అతడి వేధింపులకు విసిగిపోయిన బాధితురాలు నిరుడు అక్టోబరు 14న రాచకొండ పోలీసులకు వాట్సప్ ద్వారా ఫిర్యాదు చేసింది. బాధితురాలి నుంచి ఇబ్రహీంపట్నం షీ టీమ్స్ ఏఎస్సై నర్సింహరెడ్డి ప్రాథమిక సాక్ష్యాలకు సేకరించారు. అయితే, రాత పూర్వకంగా ఫిర్యాదు చేసేందుకు బాధితురాలు ముందుకురాలేదు. అంతకముందు విచారణలో భాగంగా నిఖిల్ కుమార్‌కు షీటీమ్‌కు చెందిన ఓ మహిళా కానిస్టేబుల్ ఫోన్ చేశారు. వివరాలు అడుగుతున్న సమయంలో అతడు పరుష పదజాలంతో మాట్లాడాడు. కొన్ని రోజుల తర్వాత ఆమె ఫోన్ నంబరుకూ అసభ్యకర సందేశాలు పంపాడు. పలుమార్లు ఆమె హెచ్చరించినా విన్లేదు. అతడి ఆగడాలు మితిమీరడంతో ఆమె జనవరి 23న ఇబ్రహీంపట్నం ఠాణాలో ఫిర్యాదు చేశారు. తన మీద కేసు పెట్టడంతో మరింత కోపం పెంచుకున్న నిఖిల్.. సదరు మహిళా కానిస్టేబుల్ ఫోన్ నంబరును ఒక పోర్న్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశాడు. కొన్నాళ్లుగా ఆమెకు అజ్ఞాత వ్యక్తుల నుంచి వందల కొద్ది ఫోన్లు వచ్చాయి. వారంతా అసభ్యకరంగా మాట్లాడుతుండటంతో మనస్తాపానికి గురైన కానిస్టేబుల్.. పోలీసులకు విషయం చెప్పింది. కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న షీటీమ్స్, పోలీసులు బీరం నిఖిల్ కుమార్‌ను వరంగల్‌లో మంగళవారం అరెస్ట్ చేశారు. ఆకతాయిలు వేధిస్తే మహిళలు నిర్భయంగా వాట్సప్ నంబరు 9490617111కు సందేశం రూపంలో ఫిర్యాదు చేయాలని రాచకొండ సీపీ మహేశ్ భగవత్ సూచించారు.



భారతీయ సంప్రదాయ వస్త్రం.. ఎర్రని కాంజీవరం చీరను ధరించి దేశ స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న అమెరికా దౌత్యవేత్త మేరీ కే కార్ల్‌సన్

అవగాహన లేమి వల్లే రొమ్ము కేన్సర్!

- భారత్‌లో విజృంభిస్తోందని పరిశోధనలో వెల్లడి



లండన్ ఆగస్టు, 15: అవగాహనారాహిత్యం వల్లే భారత్‌లో రొమ్ము కేన్సర్ విజృంభిస్తోందని తాజా పరిశోధనలో బయటపడింది. రొమ్ము కేన్సర్ లక్షణాలను ప్రారంభ దశలోనే గుర్తించగలిగితే సమస్య చాలావరకు పరిష్కారమవుతుందని, ఈ విషయంలో స్త్రీలతోపాటు పురుషులకు కూడా అవగాహన కలిగించాలని ఇంగ్లండ్‌లోని పోర్ట్స్‌మౌత్ యూనివర్సిటీ పరిశోధకులు అభిప్రాయపడ్డారు. సంస్కృతి, సాంప్రదాయాలను ఎక్కువగా గౌరవించే భారత స్త్రీలు మగ డాక్టర్ల వద్దకు వెళ్లి పరీక్ష చేయించుకునేందుకు వెనుకాడుతున్నారని వారు వెల్లడించారు. అలాగే ఆర్థికంగా పురుషుడి మీద ఆధారపడుతున్న మహిళలు రొమ్ము కేన్సర్ విషయంలో నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఇక, చదువుకుని ఉద్యోగం చేస్తున్న స్త్రీలు సైతం తమ శారీరక అంగాల గురించి భర్తలతో, సోదరులతో, తండ్రులతో చర్చించేందుకు సిద్ధపడరని పేర్కొన్నారు. ఈ సమస్య పరిష్కారానికి కమ్యూనిటీ హెల్త్ నర్సు (ఏఎన్ఎమ్)ల ద్వారా అవగాహన కల్పిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని పరిశోధకులు అభిప్రాయపడ్డారు.

మహనీయుల ఆశయాలే ఆదర్శం



స్వాతంత్ర్య వేడుకల్లో మాట్లాడుతున్న స్పీకర్ మధుసూదనాచారి, డిప్యూటీ సీఎం కడియం, మంత్రులు తుమ్మల, ఇంద్రకరణ్ రెడ్డి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, జోగు రామన్న, లక్ష్మారెడ్డి, తలసాని శ్రీనివాస్, జూపల్లి కృష్ణారావు

- వారి స్ఫూర్తితోనే అభివృద్ధి వైపు అడుగులు
- స్వాతంత్ర్య దినోత్సవంలో స్పీకర్ మధుసూదనాచారి
- అభివృద్ధిని అడ్డుకుంటున్న ప్రతిపక్షాలు: కడియం
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన మంత్రులు

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ : మహనీయుల ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ప్రజల అవసరాలకు అనుగుణంగా రాష్ట్రం అభివృద్ధి వైపు అడుగులు వేస్తోందని తెలంగాణ శాసనసభాపతి సిరికొండ మధుసూదనాచారి పేర్కొన్నారు. మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన 71వ స్వాతంత్ర్య దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న స్పీకర్ జాతీయ జెండాను ఎగురవేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలు, జీవితాలను త్యాగం చేసిన అమరులకు ఈ సందర్భంగా జోహార్లు అర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ కొందరు కోర్టులను ఆశ్రయించడం ద్వారా అడ్డుపడుతున్నారనీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి ప్రతిపక్షాలపై పరోక్షంగా ధ్వజమెత్తారు. ఎవరు ఎన్ని విధాల అడ్డుకున్నా, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. హన్మకొండలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో కడియం జాతీయ జెండాను ఎగుర వేసి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. 'ఎందరో త్యాగాల ఫలితంగానే స్వాతంత్ర్యం వచ్చింది. అన్ని వర్గాలకు ఆ ఫలాలు అందుతున్నాయి. దశాబ్ద కాలం జరిగిన ఉద్యమం వల్లనే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడింది. బంగారు తెలంగాణలో భాగంగా పథకాలను అమలు చేస్తున్నాం' అని మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి జాతీయ పతాకాన్ని ఎగరవేశారు. నిర్మల్ జిల్లా సర్వతోముఖాభివృద్ధికి ప్రజలు, అధికారులు పునరంకితమైతే అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధ్యమని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్మల్‌లోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి ప్రసంగించారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని మంత్రి పద్మారావు పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలోని ప్రగతి మైదానంలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో తుమ్మల జాతీయ జెండాను ఎగురవేశారు. మహబూబ్‌నగర్‌లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో మంత్రి లక్ష్మారెడ్డి జెండావిష్కరణ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం నవభారత నిర్మాణానికి పునరంకితమయ్యే రోజని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రధాని మోదీ ప్రశంసిస్తున్నారని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో ఆయన జెండా ఎగురవేశారు. నాగర్‌కర్నూల్‌లోని పోలీసు పరేడ్‌గ్రౌండ్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సమష్టి కృషితో జిల్లాను అభివృద్ధి పథం వైపు తీసుకెళ్తామని చెప్పారు. ఆదిలాబాద్‌లోని పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి జోగురామన్న జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మూడేళ్ల పాలనలో జిల్లా సమగ్రాభివృద్ధి సాధించిందన్నారు. సూర్యాపేట జిల్లాలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మంత్రి జగదీశ్‌రెడ్డి పతాకావిష్కరణ చేశారు. సీఎం కేసీఆర్ ముందుచూపు తో రాష్ట్ర ఆదాయం వృద్ధి 18 శాతం పెరిగి దేశంలోనే అగ్రగామిగా నిలిచిందన్నారు. 'దేశంలోనే అతిపెద్ద మెగా టెక్స్‌టైల్ పార్క్ వరంగల్ రూరల్ జిల్లాలో ఏర్పాటు కానుంది. 1190ఎకరాల్లో రూ.1153 కోట్లతో ఏర్పాటు కానున్న పార్క్‌తో సుమారు లక్ష మందికిపైగా ప్రత్యక్ష, పరోక్ష, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి' అని శాసన మండలివిప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. వరంగల్ అర్బన్ జిల్లా కేంద్రంలోని హన్మకొండ జేఎన్ స్టేడియంలో ఆయన జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

వేములఘాట్‌కు స్వాతంత్ర్యం రాలేదు: తమ్మినేని

- ఇసుక మాఫియాలో టీఆర్ఎస్ దొరలు: వంటేరు



తొగుట: ప్రాజెక్టుల పేరుతో బలవంతంగా రైతుల నుంచి భూసేకరణ చేస్తున్న సీఎం కేసీఆర్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సిద్దిపేట జిల్లా తొగుట మండలం వేములఘాట్ గ్రామంలో మల్లన్నసాగర్‌కు వ్యతిరేకంగా గ్రామస్తులు చేపట్టిన రిలే దీక్షకు మంగళవారం తమ్మినేని, వంటేరు ప్రతాప్‌రెడ్డి సంఘీభావం ప్రకటించారు. భూసేకరణలో ప్రభుత్వం చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా.. వేములఘాట్ ప్రజలకు రాలేదన్నారు. రాష్ట్రంలో ఇసుక మాఫియాను నడిపిస్తున్నది టీఆర్ఎస్ దొరలేనని తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు వంటేరు ఆరోపించారు. ప్రాజెక్ట్‌ల రీ డిజైన్ పేరుతో కమీషన్లు దండుకోవడం కోసం రూ.2లక్షల కోట్లు ఖర్చు చేస్తూ ప్రజాధనాన్ని దోచుకుంటున్నాడని విమర్శించారు. ప్రాజెక్టుల పేరుతో 2019లో మళ్లీ అధికారంలోకి రావాలని కేసీఆర్ కొత్త డ్రామాలకు తెరలేపుతున్నాడని ఆరోపించారు.

ధార్మిక విజ్ఞాన పరీక్షల్లో విజేతలకు బహుమతులు

తిరుపతి: టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన సనాతన ధార్మిక విజ్ఞాన పరీక్షల్లో విజేతలకు ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ మంగళవారం బహుమతులను అందజేశారు. ధర్మపరిచయలో అనంతపురం జిల్లా కదిరిలోని సెయింట్ థామస్ ఆంగ్ల మాధ్యమ పాఠశాల ఏడో తరగతి విద్యార్థిని ఆర్.వర్షిత జాబిల్లి ప్రథమ బహుమతి అందుకోగా, కృష్ణా జిల్లా విజయవాడ ది బ్రిలియంట్ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న ఎల్.సోనియా ద్వితీయ బహుమతి, తెలంగాణ రాష్ట్రం ఆదిలాబాదు జిల్లా నిర్మల్‌లోని టీఎస్ఆర్ బాలికోన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న ఎ.గౌతమి తృతీయ బహుమతి అందుకున్నారు. ధర్మప్రవేశికలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను విశాఖ మద్దిపాలెంలోని హెర్మన్ పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థిని కె.మౌనిక, తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా హన్మకొండలోని సెయింట్ పీటర్ పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని సి.రోషిణి, చిత్తూరు జిల్లా సోమల మండలం కందూరులోని శ్రీవిద్యానికేతన్ పాఠశాల పదో తరగతి విద్యార్థిని పి.కవిత అందుకున్నారు. టీటీడీ పరిపాలనా భవనం పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన స్వాతంత్ర్య దిన వేడుకల్లో ఈ బహుమతులు అందజేశారు.

బోరుబావిలో బాలుడు

- గుంటూరు జిల్లాలో ఘటన
- రంగంలోకి ఎన్డీఆర్ఎఫ్, పోలీసులు



చంద్రశేఖర్, బోరుబావి

వినుకొండ: మరో పసి ప్రాణం బోరు బావిలో చిక్కుకుంది. పొలంలో ఆడుకుంటున్న రెండేళ్ల చిన్నారి నోరు తెరిచి ఉన్న బోరు బావిలో పడిపోయాడు. గుంటూరు జిల్లా వినుకొండ మండలంలోని ఉమ్మడివరంలో మంగళవారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన అనూష తన రెండేళ్ల కుమారుడు చంద్రశేఖర్‌తో పశువుల కొట్టం వద్దకు వెళ్లింది. చిన్నారిని కొట్టంలో ఉంచి, పశువులకు మేత కోసేందుకు పొలంలోకి వెళ్లింది. ఇంతలో చంద్రశేఖర్ ఆడుకుంటూ వెళ్లి, అక్కడ తెరిచి ఉన్న బోరులోకి పడిపోయాడు. పిల్లాడు గట్టిగా కేకలు వేయడంతో తల్లి గమనించింది. అయితే అప్పటికే చంద్రశేఖర్ బోరుబావిలోకి జారిపోయాడు. సమాచారాన్ని భర్తకు తెలిపింది. ఆ తర్వాత పోలీసులు, రెవెన్యూ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది కూడా రంగంలోకి దిగారు. లోపల ఉన్న బాలుడికి నిరంతరం ఆక్సిజన్ అందిస్తున్నారు. 13 అడుగుల లోతున బాలుడు ఉన్నట్లు గుర్తించారు. ఎక్స్‌కవేటర్ సహాయంతో బోరు బావికి సమాంతరంగా గొయ్యి తవ్వుతున్నారు. మధ్యలో సున్నపురాయి పడటంతో సహాయక చర్యల్లో కొంత ఆలస్యం జరిగింది. మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్యే ఆంజనేయులు సహాయ చర్యలను పర్యవేక్షిస్తున్నారు. ఈ ఘటనపై సీఎం చంద్రబాబు మంత్రి ప్రత్తిపాటి, కలెక్టర్‌తో మాట్లాడారు.



నిత్య కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

క్షేత్రపాలకుడికి ఆకుపూజ

యాదాద్రి టౌన్: యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ క్షేత్రపాలకుడైన ఆంజనేయ స్వామికి మంగళవారం ఆకుపూజ, స్వామికి నిత్య పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కొండపైన పుష్కరిణి వద్దనున్న ఆంజనేయ స్వామిని వేద మంత్రాలతో పంచామృతాలతో అభిషేకించారు. అదేవిధంగా ప్రధానాలయంలోని స్వయంభూ మూర్తులను, బాలాలయ కవచమూర్తులను ఆరాధించారు.అనుబంధ శివాలయంలో ముక్కంటిని స్మార్త పద్ధతిలో ఆరాధించారు. పవిత్ర శ్రావణమాసం, వరుస సెలవులు రావడంతో యాదాద్రిక్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది. స్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు.

స్వాతంత్ర్య దినోత్సవంలో అపశ్రుతులు

- రోడ్డు ప్రమాదంలో మెదక్ జిల్లాలో విద్యార్థిని దుర్మరణం
- తొర్రూరులో అపశృతి... డ్రైవర్ మృతి
- పరిగిలో శిలువ బిగించిన స్థంభానికి జాతీయ జెండా.. కేసు నమోదు

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్: స్వాతంత్ర్య దినోత్సవంలో రాష్ట్రంలో కొన్ని అపశ్రుతులు జరిగాయి. ఆనందోత్సవాలతో స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొని ఇంటికి వెళ్తుండగా రోడ్డుప్రమాదంలో విద్యార్థిని మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ గ్రామంలో జరిగింది. ముస్లాపూర్ గ్రామానికి చెందిన ఇప్ప సుమలత(10) ప్రాథమికోన్నత పాఠశాలలో ఐదవ తరగతి చదువుతుంది. గ్రామంలో పలు ప్రాంతాలలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవంలో తోటి విద్యార్థులతో పాల్గొని పాఠశాల సమీపంలో ఉన్న 161వ జాతీయ రహదారిని దాటుతుండగా జోగిపేట నుంచి అల్లాదుర్గం వైపు వస్తున్న కారు ఢీ కొట్టడంతో ఈమెకు తీవ్రగాయాలు కావటంతో జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా మృతి చెందింది. మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో స్వాతంత్ర్య వేడుకలకు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులను తీసుకువచ్చేందుకు ప్రైవేట్ బస్సు వెళ్తుండగా ఎదురుగా వాహనం రావడంతో స్కూల్ బస్సు వెనక్కి తీసుకునే సమయంలో విద్యుత్ హైటెన్షన్ వైరు తగిలి బస్సులో మరో డ్రైవర్ మొగులగాని రమేష్ విద్యుత్‌షాక్‌కు గురై అపస్మారక స్థితికి చేరుకున్నారు. ఆయను మెరుగైన వైద్యం కోసం వరంగల్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. వికారాబాద్ జిల్లా పరిగిలో ఏసు స్నేహ నిలయంలో పైభాగంలో శిలువ ఏర్పాటు చేసిన స్థంభానికి జాతీయ జెండా ఎగురవేయడం స్థానికంగా పెద్ద దుమారం చెలరేగేలా చేసింది. శిలువ ఉన్న స్థంభానికి జాతీయ జెండా ఎగరవేయడాన్ని పలువురు తప్పుపడుతున్నారు. బీజేపీ నాయకుల ఫిర్యాదు మేరకు స్నేహ నిలయం బాధ్యులు ప్రభుదాస్, తదితరులపై పోలీసులు కేసు నమోదు చేశారు.



వీఆర్వో అతి ప్రవర్తన

ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెం గ్రామపంచాయతీలో జాతీయ జెండా సర్పంచ్ దేవళ్ల జ్యోతి వేగురవేయాల్సి ఉండగా గ్రామ వీఆర్వో సత్యనారాయణ ఎగురవేయడం వివాదమైంది. మహిళా సర్పంచ్, అందులోను గిరిజన సర్పంచ్ అయిన నన్ను వీఆర్వో అవమానించారని జాతీయ జెండా ఎగురవేయకుండా చేశారని తిరుమలాయపాలెం పోలీసులకు, తహసీల్దార్‌కు ఫిర్యాదుచేశారు. పోలీసులు కేసు నమోదుచేసుకుని విచారణ సాగిస్తున్నారు.

బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి నంబర్‌వన్

- వచ్చే ఐదేళ్లల్లో 25 కొత్తగనుల ప్రారంభం
- స్వాతంత్ర్య వేడుకల్లో సింగరేణి సీఎండీ శ్రీధర్



కొత్తగూడెం: బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి జాతీయ స్థాయిలో నంబర్‌వన్‌గా నిలిచిందని సింగరేణి సంస్థ చైర్మన్‌అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. శ్రీధర్ తెలిపారు. మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలోని సింగరేణి ప్రకాశం గ్రౌండ్‌లో 71వ స్వాతంత్ర్య వేడుకల్లో ఆయన మాట్లాడారు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో మణుగూరు, మందమర్రి, కాశీపేట, కొత్తగూడెం, భూపాలపల్లిలో కొత్తగనులు ప్రారంభిస్తామన్నారు. వచ్చే ఐదేళ్లల్లో 25 కొత్తగనులకు శ్రీకారం చుట్టబోతున్నామన్నారు. మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం రాష్ట్ర కరెంట్ అవసరాలు తీరుస్తోందన్నారు. పర్యావరణ సహిత చర్యలోభాగంగా సంస్థ ఆధ్వర్యంలో కొన్ని ఏరియాల్లో 100 మెగావాట్ల సామర్థ్యం గల సోలార్ విద్యుత్ ప్యానెళ్లను ఏర్పాటు చేస్తామన్నారు. సింగరేణి సంస్థలో గిరిజనుల కోసం 665 బదిలీ వర్కర్ ఉద్యోగాలకు ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్ (పా) పవిత్రన్‌కుమార్, సింగరేణి డైరెక్టర్లు, టీబీజీకేఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుడికి అరుదైన గౌరవం



పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న పారిశుధ్య కార్మికుడు కొమురయ్య

తిమ్మాపూర్, ఆగస్టు 15: కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెం గ్రామానికి చెందిన ఓ పారిశుధ్య కార్మికుడికి అరుదైన గౌరవందక్కింది. మొగిలిపాలెంలో 23 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని సర్పంచ్ ఎల్కపెల్లి సంపత్ గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికుడు మొలుగూరి కొమురయ్యతో ప్రారంభింపజేశారు.మొగిలిపాలెం గ్రామ సర్పంచ్, గ్రామ ప్రజల సమక్షంలో కొమురయ్య నూతన గ్రామ పంచాయతీని మంగళవారం ప్రారంభించారు. గ్రామానికి ఎంతో సేవ చేసే పారిశుధ్య కార్మికుడు కొమురయ్య ద్వారా గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని మొగిలిపాలెం సర్పంచ్ సంపత్ అన్నారు.

మూడో అర్చకుడిపై విచారణకు రంగం

- బాసర విగ్రహ వివాదంపై దేవరకొండలో చర్చ

దేవరకొండ, ఆగస్టు 15: దేవరకొండలో జరిగిన అక్షరాభ్యాసంలో పాల్గొన్న బాసర సరస్వతీ ఆలయానికి చెందిన మూడో అర్చకుడిపై విచారణకు రంగం సిద్ధమైంది. జూలై 28న దేవరకొండలోని ప్రైవేట్ పాఠశాలలో జరిగిన అక్షరాభ్యాస కార్యక్రమానికి బాసర దేవాలయానికి చెందిన ముగ్గురు పండితులు హాజరయ్యారని ఆంధ్రజ్యోతి మంగళవారం వెలుగులోకి తెచ్చింది. దీంతో పోలీసు, దేవాదాయశాఖ అధికారులు ఆ కోణంలో దేవరకొండకు వచ్చి ప్రైవేట్ పాఠశాలలో విచారణ నిర్వహించేందుకు సన్నాహాలు జరుపుతున్నట్లు సమాచారం. సరస్వతీ అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఆగమశాస్త్రానికి విరుద్ధంగా ప్రధాన అర్చకులు తీసుకువచ్చారన్న విషయం వెలుగులోకి రావడంతో దేవదాయశాఖ అధికారులు ఇప్పటికే ప్రధాన అర్చకుడు సంజీవ్‌కుమార్, ప్రణవ్‌శర్మలను సస్పెండ్‌చేశారు. కాగా మూడో అర్చకుడు కూడా అక్షరాభ్యాస కార్యక్రమానికి హాజరయ్యారనే విషయం వెలుగులోకి తేవడంతో ఆయనపైనా చర్యలు తీసుకోనున్నట్లు తెలిసింది. దేవరకొండ అక్షరాభ్యాస కార్యక్రమానికి ఎంతమంది పూజారులు హాజరయ్యారు, అందుకు గల కారణాలను పూర్తి స్థాయిలో విచారించేందుకు అధికారులు సన్నద్ధం అవుతున్నారు.

మద్యం ముద్దు.. జెండా వద్దు..?

- మద్యం మత్తులో జెండావిష్కరణ మరిచాడు
- జెండా ఎగరేయకపోవడం పెద్ద నేరం కాదు
- అచ్యుతాపురం అటవీ అధికారి ఘనకార్యం



మద్యం తాగుతున్న అటవీ పరిశోధన కేంద్రం రేంజ్ అధికారి సదానందచారి

అశ్వారావుపేట/అశ్వారావుపేట టౌన్, ఆగస్టు 15: ఆయన నిరక్షరాస్యుడు కాదు.. ఏదో చిరుద్యోగి అసలే కాదు.. ఉన్నత విద్యనభ్యసించిన ఉన్నతోద్యోగి. కానీ.. జాతీయ పండుగనే మరిచాడు. 'మద్యమే ముద్దు.. జెండా వద్దు..' అన్నాడు. మద్యం మత్తులో జెండా ఎగురవేయడాన్నే పట్టించుకోలేదు. అంతేకాదు.. 'మందు తాగడం తప్పు కాదు. జెండా ఎగురవేయక పోవడం పెద్ద నేరం కాదు. దీనికెందుకు ఇంత రాద్ధాంతం. మీరు సహకరించాలి. చూసీచూడనట్టు పోవాలంటూ' నీతులు కూడా బోధిస్తూ, బహిరంగంగా మద్యం తాగుతూ అడ్డంగా బుక్కయ్యాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం అచుతాపురం అటవీ పరిశోధనా కేంద్రం రేంజ్ అధికారి సదానంద చారి నిర్లక్ష్యానికి పరాకాష్ట ఇది. వివరాల్లోకి వెళ్తే.. జాతీయ జెండా ఆవిష్కరణను మరిచిన అచుతాపురం అటవీ పరిశోధన కేంద్రం రేంజ్ అధికారి సదానంద చారి నారంవారి గూడెంలోని ఓ బెల్ట్ షాపులో మద్యం సేవిస్తూ విలేకరులకు అడ్డంగా దొరికిపోయాడు. జాతీయ జెండాను ఆవిష్కరించకుండా ఇదేం పని. ఈ రోజు స్వాతంత్ర్య దినోత్సవం కదా.. అని విలేకరులు ప్రశ్నించగా 'జెండా ఎగుర వేయకపోవడం పెద్ద నేరమా ఏమన్నా? స్వాతంత్ర్య దినోత్సవం అయితే బీరు కూడా తాగకూడదా' అంటూ ఎదురు ప్రశ్నించారు. విలేకరులు ఫొటోలు తీస్తున్నా పట్టించుకోకుండా మద్యం తాగి, తాపీగా కారులో కార్యాలయానికి వెళ్లారు. ఆయనను వెంబడించి కార్యాలయం వరకు వెళ్లిన విలేకరులను ఉద్దేశించి.. 'జెండా ఉదయమే ఎగురవేశాను కదా. జెండా కర్ర విరిగిపోతుందని తీసి లోపల పెట్టాం. దీనికే ఎందుకీ రాద్ధాంతం. అయినా వీటన్నింటినీ పట్టించుకోకూడదు భాయ్. మీరంతా సహకరించాలి. ఇదంతా మామూలే' అనడంతో ఆశ్చర్యపోవడం విలేకరుల వంతైంది. ఆయన మద్యం మత్తులో జాతీయ జెండా ఎగురవేయకుండానే కారులో ఎంచక్కా ఇంటికెళ్లిపోయాడు. అక్కడే ఉన్న బీట్ అధికారి లక్ష్మణరావును ప్రశ్నించగా 'నేను వచ్చే వరకు జెండాను ఎవరూ ముట్టుకోవద్దని, ఇప్పుడే వస్తానంటూ సారు బైటకు వెళ్లారు. అంతా సిద్ధం చేసి ఆయన కోసం ఎదురు చూశాం' అన్నారు.



అచ్యుతాపురం అటవీ పరిశోధన కేంద్రంలో ఖాళీగా జెండా దిమ్మె

'కోట'లో అశ్వశాలను నిర్మించొద్దు

- వరంగల్ ప్రజల నుంచి వ్యతిరేకత

హన్మకొండ: చారిత్రక ఓరుగల్లు కోటలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో అశ్వశాల నిర్మాణాన్ని చేపట్టడంపై స్థానికుల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. పోలీసులే చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తుండడం, అందుకు రెవెన్యూ అధికారులు వంతపాడుతుండడం దారుణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సరైన రక్షణ లేక కాకతీయుల వారసత్వ సంపద ఇప్పటికే దెబ్బతింటోందనీ, ఇప్పుడు కోట ప్రాంతంలో అశ్వశాల నిర్మాణం జరిగితే మరింత ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అశ్వశాల నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని, లేకపోతే కాకతీయుల వారసత్వ సంపదను కాపాడుకునేందుకు పెద్ద ఎత్తున ఆందోళనలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

పురావస్తు శాఖ తీరు బాలేదు

నిషేధిత ప్రాంతంలో నిర్మాణాలు ఎలా జరుగుతాయి. పురావస్తు శాఖ పట్టించుకోకపోవడం అభ్యంతరకరం. వ్యక్తులు, శాఖలు, సంస్థలకు అనుగుణంగా నిబంధనలు ఉండవు. అశ్వశాల నిర్మాణాన్ని ఆపాల్సిందే.

- గండ్ర వెంకటరమణారెడ్డి, మాజీ చీఫ్ విప్

వారసత్వ సంపదను ధ్వంసం చేస్తే ఊరుకోం

గతంలో స్థానిక ప్రజలకు తాగునీటి కోసం కోటలోని గుట్టపై వాటర్ ట్యాంక్ నిర్మించడానికి పురావస్తుశాఖ నుంచి అనుమతి పొందడానికి పోరాటమే చేయాల్సి వచ్చింది. మరిప్పుడు కోట కట్టను ఆనుకొని భారీ భవనాన్నే నిర్మిస్తుంటే ఆ శాఖ అధికారు లు నిమ్మకు నీరెత్తినట్టు ఎందుకు వ్య వహరిస్తున్నారో అర్థం కావడం లేదు.

- ఈగ మల్లేశం, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

నిబంధనలు పాటించాలి

ఖిలా వరంగల్ రక్షిత ప్రదేశంలో నిర్మాణాలు చేయాలంటే పురావస్తుశాఖ అనుమతి తప్పనిసరి. చట్ట విరుద్ధమైన నిర్మాణాలు చేపడితే ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించాలి. చారిత్రక కట్టడంగా గుర్తించిన ఖిలా వరంగల్ కోటలో నిబంధనలకు లోబడి నిర్మాణాలు చేపట్టాలి.

- రావు పద్మ, వరంగల్ అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షురాలు

డిండిపై హరగోపాల్ వ్యాఖ్యలు అనుచితం: ఎంపీ నర్సయ్యగౌడ్

హైదరాబాద్: డిండి ప్రాజెక్టుపై ప్రొ. హరగోపాల్ అనుచిత వ్యాఖ్యలు చేయటం సరికాదని, ఆయన వ్యాఖ్యలు రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవటంతోపాటు ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేవిగా ఉన్నాయని టీఆర్ఎస్ ఎంపీ బూరనర్సయ్యగౌడ్ అన్నారు. హరగోపాల్ వ్యక్తిగత అజెండాతో రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయమై ఆయన మంగళవారం ఒక ప్రకటన చేశారు. డిండి ఎత్తి పోతల పథకం చాలాకాలం నాటిదన్నారు. కృష్ణాజలాలతో దక్షిణ తెలంగాణలో మహబూబ్ నగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లా ప్రజల తాగు, సాగునీటి అవసరాలు తీర్చడానికి ఉద్దేశించిన ప్రాజెక్టు అని చెప్పారు. హరగోపాల్ అభివృద్ధికి అడ్డుపడుతూ విద్వేషాలు రెచ్చ గొట్టవద్దన్నారు.

వివాదంలో పబ్లిక్ క్లబ్

సూర్యాపేటలో ఉద్రిక్తత.. కాంగ్రెస్ నేతల అరెస్ట్
మాజీ మంత్రి దామోదర్ రెడ్డికి తీవ్ర అస్వస్థత



రాంరెడ్డి దామోదర్‌రెడ్డిని పోలీసు వ్యానులోకి తరలిస్తున్న పోలీసులు

సూర్యాపేట, ఆగస్టు 15: సూర్యాపేట పబ్లిక్ క్లబ్ వివాదం కాంగ్రెస్ నాయకుల అరెస్టుకు దారితీసింది. దీంతో సూర్యాపేటలో మంగళవారం ఉదయం ఉద్రిక్తత నెలకొంది. సూర్యాపేటలోని పబ్లిక్ క్లబ్‌పై ఆధిపత్యం కోసం కొన్ని నెలలుగా టీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య వివాదం జరుగుతోంది. పబ్లిక్ క్లబ్ కార్యదర్శులుగా కట్కూరి గన్నారెడ్డి, కొప్పుల వేణారెడ్డి ఎవరికివారే ప్రకటించుకున్నారు. దీంతో మంగళవారం పబ్లిక్ క్లబ్‌లో జాతీయ జెండాను ఎవరు ఆవిష్కరిస్తారోనని ఉత్కంఠ నెలకొంది. ఉదయం మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి నివాసంలో జాతీయజెండాను ఆవిష్కరించిన అనంతరం కాంగ్రెస్ నాయకులు వివిధ ప్రాంతాల్లో జాతీయ జెండా ఎగురవేయడానికి బయలుదేరారు. పబ్లిక్ క్లబ్ వివాదంలో ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు పబ్లిక్ క్లబ్ వద్ద జెండాను ఎగురవేస్తే ఉద్రిక్త పరిస్థితి నెలకొంటుందని పోలీసులు వారిని అరెస్టు చేశారు. విషయం తెలుసుకున్న దామోదర్‌రెడ్డి సూర్యాపేటలోని గాంధీ విగ్రహంవద్ద కార్యకర్తలతో నిరసన దీక్ష చేపట్టారు. అనంతరం రోడ్డుపై బైటాయించి రాస్తారోకో చేశారు. పోలీసులు అరెస్టు చేయబోగా, అరగంటసేపు నేతలకు పోలీసులకు మధ్య తీవ్ర తోపులాట జరిగింది. పోలీసులు ఆర్డీఆర్‌ను సుమోలో ఎక్కించుకోగానే సొమ్మసిల్లి పడిపోయారు. తలకు సుమో పైకప్పు తగలడంవల్ల నోట మాట ఆగిపోయింది. ఏరియా ఆసుపత్రిలో చికిత్స అనంతరం సూర్యాపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో సీటీ స్కాన్ తీశారు. మెరుగైన చికిత్స కోసం ఆర్డీఆర్‌ను హైదారాబాద్‌కు తరలించారు. కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి ఘటనా స్థలానికి చేరుకుని దీక్షకు మద్దతిస్తూ ప్రభుత్వ నిరంకుశ వైఖరిపై మండిపడ్డారు. తెలంగాణ తల్లి విగ్రహం వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంత్రి జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు.



కాంగ్రెస్ కార్యకర్తలను చెదరగొడుతున్న పోలీసులు

విజన్ 2022

ఎర్రకోటపై నుంచి నాలుగోసారి జాతినుద్దేశించి ప్రసంగించిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ తన ప్రభుత్వ ప్రాధాన్యాలను, సమస్యల పరిష్కారమార్గాలను, రానున్న ఐదేళ్ల కాలంలో ఆశిస్తున్న పురోగమనాన్ని ఉద్వేగభరితంగా పూసగుచ్చారు. పౌరాణిక ఉదాహరణలను ఉటంకిస్తూ, లోకమాన్య తిలక్, గాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి వంటి జాతినాయకులను ప్రస్తావిస్తూ భారత సమాజంలోని వివిధ వర్గాలను ప్రత్యేకంగా పరామర్శిస్తూ ప్రసంగించారు. దేశప్రజానీకాన్ని మొత్తంగా ఉద్దేశించినప్పుడు అనునయంగా మాట్లాడారు. శాంతిభద్రతల సమస్యలను సాహసంతో ఎదుర్కొంటున్నందుకు భద్రతాదళాలను ప్రస్తుతించారు. రాష్ట్రాలతో సహకార ఫెడరలిజమ్ అనుసరిస్తున్నామని చెప్పారు. కశ్మీర్ విషయంలో ప్రజలకు ప్రేమను, గుప్పెడు మంది వేర్పాటువాదులకు కాఠిన్యాన్ని ప్రకటించారు. గోరక్షక తీవ్రవాదులకు కూడా నర్మగర్భంగా హితవు చెప్పారు. ఆర్థిక నేరస్థులకు మున్ముందు గడ్డుకాలమున్నదని సూచించారు. అందరికీ కనీస సదుపాయాలు, యువతకు ఉపాధి నైపుణ్యాలు వాగ్దానం చేశారు.

కొత్త నినాదాల కల్పనలో ప్రతిభాశాలి అయిన ప్రధాని 'భారత్ జోడో' అని జాతికి పిలుపునిచ్చారు. 75 సంవత్సరాల కిందట క్విట్ ఇండియా ఉద్యమం వలసపాలకుల నుద్దేశించి 'భారత్ ఛోడో' అని నినదించింది. ఇప్పుడు మనం భారత్‌ను ఏకత్రితం చేయాలని మోదీ ఉద్ఘాటించారు. 1942 నుంచి ఐదేళ్ల పాటు భారతజాతి ఒక్కటిగా కదలి 1947లో స్వరాజ్యాన్ని సాధించిందని, అట్లాగే, రానున్న ఐదేళ్ల కాలంలో భారత్ 'సురాజ్యాన్ని' సాధించుకోవాలని మోదీ పిలుపునిచ్చారు.

2022 సంవత్సరాన్ని భారత్‌కు మరొక కీలకమజిలీగా మోదీ పరిగణిస్తున్నారు. ఆ సంవత్సరానికి భారత స్వాతంత్ర్యానికి 75 సంవత్సరాలు పూర్తికావడమొక్కటే విశేషమా, కొన్ని జాతీయపత్రికలు కొద్దిరోజులుగా ఊహాగానాలు చేస్తున్నట్టు, అతి త్వరలో ఎన్నికలు వచ్చి, కొత్త ప్రభుత్వ పదవీకాలం ముగిసే సంవత్సరంగా 2022ను భావించాలా– అన్న సందేహం రావడం సహజం. క్విట్ ఇండియా– స్వాతంత్ర్యం మధ్య ఉన్న ఐదేళ్ల కాలంతో పోలిక కోసమే మోదీ అట్లా అని ఉండవచ్చు.

'అనుసంధానం' అన్నది భారతీయ జనతా పార్టీకి అభిమాన ఆదర్శం. తొలి ఎన్‌డీఏ ప్రభుత్వం కూడా దేశం మొత్తాన్ని స్వర్ణచతుర్భుజి ద్వారా అనుసంధానం చేసింది. నదుల అనుసంధానం కూడా అప్పటి ప్రభుత్వం పదే పదే చెప్పుకున్న లక్ష్యం. మోదీ– షా నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం కాంగ్రెస్‌నే కాదు, ప్రాంతీయ పార్టీలు కూడా లేని ఏకశిలా సదృశ రాజకీయ వ్యవస్థ కోసం వ్యూహరచన చేస్తున్నారు. కాంగ్రెస్ హయాంలోనే ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ, జీఎస్‌టీ కూడా ఎన్‌డీఏ దృష్టిలో భారత్‌ను ఏకం చేసే విధానమే. బిహార్, తమిళనాడు, బెంగాల్ మొదలైన రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలను కలవరపరచడానికి బీజేపీ పట్టుదలగా పనిచేస్తున్నది. రాజకీయ అవసరాల కోసం అధికార పార్టీ అటువంటి పద్ధతులు అనుసరించడం నైతికమైనా కాకపోయినా, వ్యూహరీత్యా సబబైనవే కావచ్చును. విశ్వాసం పేరుతో హింసకు పాల్పడే వారు– అని మోదీ ప్రసంగంలో పేర్కొన్న గుంపుల చర్యలు కానీ, విద్యా సాంస్కృతిక రంగాలతో సహా అనేక రంగాలలో తీసుకువస్తున్న మార్పులు కానీ దేశాన్ని జోడించడానికి పనికివస్తున్నాయా– అన్నది సమీక్షించుకోవాలి. జీఎస్‌టీకి ఏ ప్రతిఘటనా లేకుండా అంగీకరించిన రాష్ట్రాలు కూడా ఇప్పుడు తమకు జరిగే అన్యాయం గురించి మాట్లాడుతున్నాయి. ఆదాయం కోసం కేంద్రం మీద అతిగా ఆధారపడవలసి వచ్చే వ్యవస్థ సహకార ఫెడరలిజమ్ ఎట్లా అవుతుంది? హిందీ భాషను దక్షిణాదిరాష్ట్రాలపై అతిగా రుద్దడానికి చేసే ప్రయత్నాలు ప్రజలను జోడించేవేనా?

ఆర్థిక రంగంలో తమ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు ఎంతటి సత్ఫలితాలనిచ్చాయో మోదీ ఘనంగా చెప్పుకున్నారు. నోట్ల రద్దు పర్యవసానాలను దేశం ఇంకా అనుభవిస్తూనే ఉన్నది. అర్థవార్షిక ఆర్థిక సర్వే కూడా మన ఆర్థిక స్థితిగతులపై నిర్మొహమాటమైన వాస్తవాలను చెప్పింది. జీఎస్‌టీ సఫల ప్రయోగంగా మిగులుతుందా లేదా అన్నది ఇంకా తేలవలసి ఉన్నది. ఆర్థిక నేరాలపై, నల్లధనంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉన్నదని ప్రజలలో ఒక నమ్మకం అయితే ఉన్నది. నల్లధనంపై చర్యలు నిజంగా నల్లకుబేరులను దెబ్బతీశాయా లేక, ప్రత్యర్థి రాజకీయపక్షాల నిధులకు మాత్రమే గురిపెట్టాయా అన్న ప్రశ్న వినిపిస్తూనే ఉన్నది. రాబోయే సంవత్సరాలలో సాధించబోయే లక్ష్యాలను ప్రముఖంగా చెప్పిన ప్రధాని, మూడేళ్ల కాలంలో సాధారణ జనజీవనంలో తీసుకువచ్చిన మెరుగుదల గురించి పెద్దగా చెప్పుకోలేదు. రైతాంగ సంక్షోభానికి ఉపశమనం కానీ, ధరల నియంత్రణ కానీ, భారీ ఎత్తున ఉపాధి కల్పన గానీ జరగలేదని మోదీ కూడా గ్రహించే ఉంటారు.

భారత్‌ను ఏకం చేయాలన్న నినాదం గొప్పది. అది కేవలం ఉద్వేగప్రాయం కాకూడదు. అందరికీ సమభాగస్వామ్యం, అభివృద్ధిలో సమానావకాశాలు, గౌరవప్రదమైన మనుగడ, సాంస్కృతిక సామరస్యం, సహనభావం అన్నీ ఉన్నప్పుడే ఐక్యత వాస్తవంగా అనుభవంలోకి వస్తుంది. సమష్టి పురోగమనానికి అవసరమైతే ఎంతటి త్యాగానికి కూడా భారతీయులు సిద్ధంగా ఉంటారు. ప్రజలను విడదీయడమే లక్ష్యంగా పనిచేసేవారు రాజకీయవాదులలోనే ఉంటారు. ప్రజలు ఏకం కావాలని నేతలే చిత్తశుద్ధితో కోరుకుంటే సహకరించకుండా ఎవరుంటారు?

సింధీ ప్రవాసులు

బ్రిటిష్ వలస పాలకులు పోతూ పోతూ భారత్‌ను చీల్చి పోయారు. ఏడు దశాబ్దాల క్రితం, ఢాకా నుంచి పెషావర్ వరకు ఒక్కటిగా ఉన్న భారతదేశం బ్రిటిష్‌వారి విభజించి పాలించు రాజకీయంతో ముక్కలైంది. ఈ దేశ వాస్తవ పరిస్థితులు ఏమాత్రం తెలియని బ్రిటిష్ న్యాయకోవిదుడు ఒకరు స్వాతంత్ర్య సిద్ధికి కేవలం నలభై ఐదు రోజుల ముందు ప్రప్రథమంగా భారత్ వచ్చి దేశ రేఖా పటాన్ని పునర్లిఖించాడు. ఆయన గీసిన సరిహద్దు రేఖ లక్షలాది కుటుంబాల జీవితాలను అతలాకుతలం చేసింది. దేశ విభజన గాయం గాఢంగా ఇంకా మిగిలి ఉన్నది.

ఇప్పటి వరకు ప్రపంచ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో జరిగిన భారతదేశ విభజన లక్షలాది అమాయకుల జీవితాలను నాశనం చేసింది. ఉన్నపాటున అన్నీ వదులుకొని కట్టుబట్టలతో లక్షలాది కుటుంబాలవారు తమకు తెలియని ప్రాంతాలకు శరణార్థులుగా వెళ్ళిపోయారు. వాఘా సరిహద్దుకు ఇరు వైపులా ఎంతో మంది మహిళలు ఆగంతకుల అఘాయిత్యాలకు బలై, అదృశ్యమయ్యారు. దేశ విభజన ఈ రకంగా లక్షలాది సింధీలు, సిక్కులు, పంజాబీ ముస్లింల జీవితాలను ఛిద్రం చేసింది.

ఈ బాధిత వర్గాలలో ఇతరుల కంటే ముందుగా బాధల కడలి నుంచి గట్టెక్కిన వారు సింధీలేనని చెప్పవచ్చు. తమ నూతన దేశమైన ఇండియాలో కొత్త జీవితాలను ప్రారంభించిన సింధీలు అచిర కాలంలోనే ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. హైదరాబాద్ నగరానికి కూడా 25 మంది సింధీలు శరణార్థులుగా వచ్చి ప్రభుత్వం నుంచి భారీ ఎత్తున ప్రయోజనాలు పొందారు. ఆ కాలంలోనే పలువురు సింధీలు ఓడలెక్కి అరబ్, ఆఫ్రికా దేశాలకు వలసపోయారు. వ్యాపారాలు ప్రారంభించి సంపన్నులుగా వర్ధిల్లారు.

దేశ విభజన బాధిత వర్గాలలో ఇతరుల కంటే ముందుగా బాధల కడలి నుంచి గట్టెక్కిన వారు సింధీలేనని చెప్పవచ్చు. తమ నూతన దేశమైన ఇండియాలో కొత్త జీవితాలను ప్రారంభించిన సింధీలు అచిరకాలంలోనే ఆర్థికంగా నిలదొక్కుకున్నారు.

పాకిస్థాన్ న్యాయస్థానాలలో న్యాయవాదిగా జీవితాన్ని ప్రారంభించిన రాంజెత్మలానీ ఇప్పుడు మన దేశంలో అగ్రశ్రేణి న్యాయవాదిగా ఉన్నారు. అలాగే హైదరాబాద్‌లో ప్రఖ్యాత కరాచీ బేకరీ యాజమాని ఖన్ చంద్ రాంనానీ, ప్రభుత్వ ఉద్యోగుల స్థానికతపై తన నిష్పాక్షిక నివేదికతో తెలంగాణ వాదానికి బలం చేకూర్చిన జె.యం.గిర్గ్లానీ, దుబాయిలోని ప్రముఖ వ్యాపారవేత్త రాం బుక్సానీ మొదలైన వారు దేశ విభజన సందర్భంలో మన దేశానికి వచ్చి స్థిరపడిన సింధీలు. మరో ప్రముఖుని గురించి మనం తప్పకుండా ప్రస్తావించుకోవలసి వున్నది. ఆయన, భారతీయ జనతా పార్టీ కురువృద్ధ నాయకుడు లాల్ కృష్ణ అడ్వాణీ. ఇలా అనేక మంది సింధీలు బ్రిటిష్ పాలకుల కుతంత్రం ఫలితంగా తమ స్వస్థలాలకు దూరమయ్యారు. అయితే తమ జీవిత తొలి దశ మధుర అనుభవాలను వారు ఇప్పటికీ తరచూ గుర్తుచేసుకోవడం కద్దు. తమ జన్మస్థలం పట్ల ఇప్పటికీ ప్రత్యేక అభిమానం ప్రదర్శిస్తారు. అందుకే తమ జన్మస్థలాల పేర హైదరాబాద్‌లో కరాచీ బేకరీ, కరీంనగర్‌లో హైదరాబాద్ సింధ్ క్లాత్ స్టోర్స్ వ్యాపారాలను నిర్వహిస్తున్నారు.

పాకిస్థాన్ పర్యటనలో తమ పాత గృహం స్థానంలో నూతన భవనం నిర్మాణమైనా అందులో ఇంకా ఉన్న తమ తండ్రి కాలం నాటి అల్మారా, మంచాన్ని గుర్తుపట్టిన లాల్ కృష్ణ అడ్వాణీ ఉద్వేగ భరితమయ్యారు. నాటి నుంచి నేటి వరకు అనేక సంచలనాల కేసులను వాదిస్తున్న రాంజెత్మలానీ తాను మొదటిసారిగా వాదించిన పాకిస్థాన్‌లోని న్యాయస్థానంలో వీలయితే ఒకసారి వాదిస్తానని ముచ్చటపడ్డారంటే మనిషికి తన జన్మస్థలంపై ఉన్న మమకారం ఏమిటో తెలుస్తోంది. పాకిస్థాన్‌లో తన చిన్ననాటి మిత్రుడు, సహచర న్యాయవాది, భాగస్వామి అయిన అల్లాహ్ బక్ష్ బోహ్రీ మరణించేవరకు, ఆయన మరణించిన తర్వాత ఆయన కుటుంబం సభ్యులతో కూడా జెత్మలానీ అనుబంధం కొనసాగింది.

దేశ విభజన సమయంలో తండ్రిని కోల్పోయి, చిన్నతనంలోనే పాకిస్థాన్ సింధ్ రాష్ట్రం నుంచి భారతదేశానికి వలస పోయిన రాం బుక్సానీ ఆర్థిక ఇబ్బందుల కారణాన కొద్దికాలం తర్వాత దుబాయికి వచ్చారు. చమురు ఆర్థిక వ్యవస్థలేని ఆ కాలంలో చేతిలో చిల్లి గవ్వ లేకుండా దుబాయికి చేరిన రాం బుక్సానీ నేడు ఆ గల్ఫ్ రాజ్యంలో ప్రముఖ భారతీయ వ్యాపారి. ఆయన ఇప్పటికీ పాకిస్థాన్‌లోని తమ సింధీల చరిత్ర గూర్చి సగర్వంగా చెప్పుకుంటారు. జెత్మలానీ నుంచి గిర్గ్లానీ వరకు ఈ ప్రవాసులందరూ తమ సింధీ సంస్కృతీ సంప్రదాయాల గురించి గర్వపడతారు. పురాతన సింధూ నాగరికతకు తాము వారసులమని చెప్పుకుంటారు. ప్రజలు తమ తమ సంస్కృతీ నాగరికతలు, ఆచార వ్యవహారాల పై గర్వపడాలి కూడా.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి

గోరఖ్‌పూర్ పసివాళ్లు మిగిల్చి వెళ్లిన ప్రశ్న

ఉత్తరప్రదేశ్, గోరఖ్‌పూర్ ఆసుపత్రిలో డెబ్బై మందికి పైగా పసిపిల్లలు '....యీ ధూర్త లోకానికి సెలవంటూ వెళ్ళిపోయారు'. యూపీ అధినేత యోగి ఆదిత్యనాథ్ పసివాళ్ల మరణాలకు మెదడు వాపు వ్యాధి, పరిసరాల అపరిశుభ్రత, నీటి గొట్టాల్లో మురికి నీరు... అంటూ ఆనవాయితీ సమర్థనలేవో చెప్పి, ముఖ్యమంత్రిగా తమ విధి నెరవేర్చారు. యేం జరిగిందనేది స్పష్టం. అత్యవసరంగా అందించాల్సిన ఆక్సిజన్ అనే సరుకు ఆసుపత్రిలో లేకపోవడం వల్ల అంతమంది చిన్నారులు ప్రాణాలొదిలారు. తీసుకోవలసిన జాగ్రత్తలు తీసుకుని వుంటే పిల్లలు మరణించేవారు కాదు. సాధారణంగా అరకొర సౌకర్యాల ఆసుపత్రుల్లో చేరేది, ఆక్సిజన్ వంటి ప్రాథమిక సౌకర్యాలు లేక చనిపోయేది పేద పిల్లలే.

ఆ పసివాళ్లు పొరపాటున కాసేపు మన లోకానికి వచ్చి వెళ్లారు. వాళ్లెలాగూ యిక తిరిగి రారు. యికముందు రానున్న పసివాళ్లకైనా కనీస భద్రత వుందా? యెవరి లాభాలను వాళ్లం, యెవరి కీర్తి పతాకాలను వాళ్లం కాపాడుకోవడం మినహా యేమీ చేయలేమా? మనం చేయాల్సింది యేదో వుంది. ముఖ్యమైనదే యేదోవుంది. అదిచేయడం మానేసి, యింకేమేమో చేస్తున్నాం. యేమీ చేయకుండా యేదో చేస్తున్నట్లు కనిపిస్తున్నాం. యీ నిష్క్రియకు గోరఖ్‌పూర్ పసివాళ్లు బలయ్యారు. మరెన్నోచోట్ల మరెందరో పసివాళ్లు, నిస్సహాయులు బలయ్యారు, అవుతున్నారు. యిది చాలా క్రియాశీలంగా వున్నట్లు కనిపించే నిష్క్రియ.

యిటీవలి రాజకీయార్థిక పరిణామాల మీద గోరఖ్‌పూర్ పసికందుల మరణాలొక తీవ్ర వ్యాఖ్య. యీ ఆసుపత్రిలో పసిపిల్లల మరణాలు చాలా యెక్కువగా జరిగాయని గతం లెక్కలు. అయినా, ఆసుపత్రికి, కాలేజీకి ఆర్థిక ప్రోత్సాహకాలు దొరుకుతూనే వున్నాయి. ఆసుపత్రి నిర్వహణలో లోపాల్ని సరిదిద్దడానికి ప్రయత్నాలు జరిగినట్లు లేదు. దానికి మొన్న పసివాళ్ల వుసురుపోసుకున్న నిర్లక్ష్యమే రుజువు. యిది కేవలం గోరఖ్‌పూర్ ఆసుపత్రికి పరిమితమైన జబ్బేనా? కాదు.

అనగనగా వొకప్పుడు మనకు ప్రభుత్వరంగమని వొకటి వుండేది. (యిప్పటికీ వుంది గాని, యిప్పుడది నామ మాత్రం. దాని చివరి వూపిరి తీసే పనిలో వున్నాం మనం. నిజానికి, యీ విధంగా మన వూపిరి మనమే తీసేసుకుంటున్నాం. యిదొక రకం ఆత్మహత్య. జాగ్రత్తపడాల్సిన అవసరం వుంది. సమీప గతం మీద యీ సంక్షిప్త సమీక్ష దానికి వుపయోగపడుతుందని ఆశ.) అప్పుడు.... ప్రభుత్వ రంగంలో కొన్ని భారీ పరిశ్రమలు వుండేవి. అవి బాగా నడిచేవి. న్యాయంగా కూడా నడిచేవి. 'కొద్ది కొద్దిగా సోషలిజం' ('గ్రాజువలిజం') సాధ్యమని కొన్ని కలలు కూడా వుండేవి. ఆ కలల మీద యెదిగొచ్చిన రాజకీయ నాయకులు, ట్రేడ్ యూనియన్ నేతలు తరువాత్తరువాత ఆ పరిశ్రమల్లో వుత్పత్తి, నిర్వహణల సంగతి గాలికొదిలేశారు. తమ తక్షణావసరాలు చూసుకోడం మొదలెట్టారు. మరో వైపున... పబ్లిక్ రంగం వ్యక్తిగత చౌరవకు, దేశాభివృద్ధికి అడ్డంకి అని ప్రైవేటు పారిశ్రామికుల గగ్గోలు తీవ్రమయ్యింది. వాళ్లు దానికి తగిన సిద్ధాంతాల్ని వండి వార్చారు. మొత్తం మీద పబ్లిక్ పారిశ్రామిక రంగం 'గ్రాజువల్'గా కనుమరుగవుతోంది. నాటి 'సోషలిజం' కల క్రమంగా కరుగుతోంది.

అప్పుడా పారిశ్రామిక విధానాన్ని 'లైసెన్సు రాజ్' అని నిరసించారు. ప్రభుత్వ జోక్యం తప్పు తప్పని 'స్వేచ్ఛా'జీవులు గొంతులుచించుకున్నారు. యిప్పుడు 'లైసెన్సు రాజ్యం' పోయింది. ప్రభుత్వ జోక్యం పోలేదు. యింకా పెరిగింది. యెంత పెరిగిందంటే, యిప్పుడిక పారిశ్రామికుడు ప్రభుత్వుడిని పెరటివైపు కాకుండా, తల వాకిలి వద్దనే కలుస్తాడు. ప్రభుత్వం చేయాల్సిందేమిటో నేరుగానే చెబుతాడు. ప్రభుత్వం అనే దానిలో ప్రజలు తల దాచుకోడానికి పనికొచ్చే నీడలు (గ్యాప్స్) కూడా లేవు. 'పరిశ్రమలు' కాకుండా యింకో రకం 'పబ్లిక్' రంగం వుంది. విద్య, వైద్యం, ఆహార సరఫరా, యింకొన్ని జీవనరంగాలకు సంబంధించినది. దాని మీద ఫిర్యాదులు, నిరసన యెలా వుండేవో పాటలు పాటలుగా చెప్పొచ్చు. 'నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు' అంటూ వీధులు, సినిమా హాళ్లు దద్దరిల్లేవి. ప్రభుత్వ బడులలో టీచర్లు పని చేయరని విమర్శలుండేవి. వృత్తి పుణ్యానికి జీతాలు పట్టుకుపోతారని, ప్రభుత్వ వుద్యోగమంటే అల్లుడికి అత్తారింటి వంటిదని అపప్రథలుండేవి. యిప్పుడూ కొన్ని సర్కారు బడులున్నాయి. చాలా వరకు అదృశ్యమవుతున్నాయి. యిప్పటికీ ప్రభుత్వ ఆసుపత్రులున్నాయి. గోరఖ్‌పూర్ తరహా ఘోరాలేవో జరిగితే తప్ప, యే స్కూలు



ప్రభుత్వ బడులకు, ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లే వాళ్లు 'ప్రైవేటు విద్యా, వైద్యాల'ను అందుకోలేని 'అభాగ్యు'లు. సమాజం నిచ్చెన మెట్ల మీద మరీ దిగువన వుండిపోయిన వాళ్లు. వాళ్లకు చదువొస్తేనేం రాకుంటేనేం. వాళ్ల ఆరోగ్యాలు యెలా వుంటేనేం, యెవడిక్కావాలి, మరీ 'ఘోరక్'పూర్‌లు వార్తలకెక్కినప్పుడు కాసేపు కాలక్షేపం కబుర్లే గాని!

బిల్డింగో మరీ పాతబడి యిక వుండలేక కూలిపోతే తప్ప... యిలాంటివి వున్నట్టు యెవరికీ గుర్తు రాదు. ప్రభుత్వ బడులకు, ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లే వాళ్లు 'ప్రైవేటు విద్యా, వైద్యాల'ను అందుకోలేని 'అభాగ్యు'లు. సమాజం నిచ్చెన మెట్ల మీద మరీ దిగువన వుండిపోయిన వాళ్లు. వాళ్లకు చదువొస్తేనేం రాకుంటేనేం. వాళ్ల ఆరోగ్యాలు యెలా వుంటేనేం, యెవడిక్కావాలి, మరీ 'ఘోరక్'పూర్‌లు వార్తలకెక్కినప్పుడు కాసేపు కాలక్షేపం కబుర్లే గాని!

ప్రభుత్వం లేదా రాజ్యం అనే 'తప్పనిసరి దయ్యా'న్ని ఆవాహన చేయక తప్పదు. మానవ స్వేచ్ఛ కోసం రాజ్యాన్ని యెదిరిస్తూనే, దానితో పని చేయించుకోకతప్పదు. ప్రజల పన్నుల పునాది మీద లేచిన భవనం రాజ్యం (స్టేట్). 'రాజ్యం' నుంచి స్వేచ్ఛ కోసమే బతుకంతా ప్రజల పోరాటం. జీవితంలో యింతకన్న విరోధాభాస (ప్యారాడాక్స్) యింకేదీ వుండదు. యీ విరోధాభాస యిటీవలి కాలంలో బాగా అనుభవానికి వస్తున్నది. యిక ముందు రాజకీయ చర్చలు దీని చుట్టూరానే తిరగొచ్చు. మరి చాలా కాలం వరకు రాజ్యం వొక 'నెసెసెరీ యీవిల్' అని అనుకోక తప్పదు. యీ రాజ్యం బాగోలేకపోతే, దీన్నీ బాగుచేసుకునే క్రమంలోనే మెరుగైన రాజ్యం సాధ్యం. వొక దాన్ని తీసేసి యింకోదాన్ని వుంచుకోడానికి రాజ్యం వేర్వేరు వస్తువులు కావు. వొకటి మరొకటిగా మారే వొకే వస్తువు. రాజ్యం ప్రజల స్వేచ్ఛను హరించడానికి చెప్పే వొకే వొక బలమైన కారణం భద్రత. భద్రత అంటే దొంగల నుంచి ఆస్తి పాస్తుల రక్షణ కాదు. దానికి వీధి గూండాలు చాలు. భద్రత అంటే... ఆహార భద్రత, ఆరోగ్య భద్రత, జ్ఞానార్జనావకాశాల భద్రత, హుందాగా జీవించే భద్రత. యీ భద్రత(ల) హామీ నెరవేర్చాలని ప్రగతిశీలురు 'రాజ్యా'న్ని నిలదీయాలి. యిది సోషలిస్టు రాజ్యం కాదు, సోషలిజం కావాలని దీన్ని అడగలేం. యిది 'ప్రజాస్వామిక రాజ్యం'. దీన్నుంచి ప్రజాస్వామ్యం అడగాలి, ఆసుపత్రులలో జరిగే నిర్లక్ష్యాలు, ఘోరాలకు ప్రభుత్వం బాధ్యత వహించాలి. దానికి బాధ్యత వహించే ప్రభుత్వ యంత్రాంగం యెంత అవసరమో, అది బాధ్యత వహించేలా నిలదీసే ప్రజా యంత్రాంగం కూడా అంత అవసరం? అలాంటి యంత్రాంగం యిపుడున్నదా? యివాళ మన పనులు, మన మాటలు, మన పాటలు అలాంటి యంత్రాంగం యేర్పడడానికి వుపయోగపడుతున్నాయా లేక ఆ యంత్రాంగం యేర్పడకుండా వుంటానికి వుపయోగపడుతున్నాయా?

రాజ్యమా! నీ పనులు చెయ్యి అని, దాని కాలరు పట్టుకుని నిలదీయడానికి, మెడలు వంచి పని చేయించుకోడానికి ప్రగతి శీలురు, సమరశీలురు నడుం కట్టాలి. యిదే ముందు. మిగిలిన పనులన్నీ తరువాతే. యిటీవలి రాజకీయ వైపరీత్యాల వల్ల ప్రాథమిక పాఠాల పునశ్చరణ అవసరమవుతున్నది. బలవంతుల నుంచి బలహీనులను, 'తెలివిమంతుల' నుంచి అమాయకులను, మగదురహంకారుల నుంచి స్త్రీలను, కలిగినోళ్ల నుంచి లేనివాళ్లను కాపాడడం 'రాజ్యం'పని అని యే హైస్కూలు స్థాయిలోనో చదువుకుంటాం. సాధారణ జనం రాజ్యానికి అలాంటి తటస్థతా (న్యూట్రల్) గౌరవం యిస్తున్నారు. కనుకనే... ప్రజలు పనిమాలా పోలింగు బూతులకు వెళ్లి... రాజ్యంలోని పాత్రధారులకు వోట్లు వేసి యెన్నుకుంటున్నారు. యివాళ రాజ్యం ఆ పనిచేస్తున్నదా? చేయడం లేదనడానికి తాజా వుదాహరణ గోరఖ్‌పూర్ విషాదం. వొకటికాదు, యెన్ని గోరఖ్ పురాలో?!

రాజ్యం వొక కొయ్యగుర్రం. అది వొకసారి పికాసో 'గుయేర్నికా'లో మాదిరిగా జనం నెత్తినెక్కి తొక్కే కొయ్య గుర్రం, మరో సారి నగ్నముని తన కావ్యంలో ప్రకటించినట్లు వూరక సకిలించడమే గాని యే ఘోరకలి నుంచీ ప్రజల్ని తీరం చేర్చలేని కొయ్య గుర్రం. నిజమే. యిది ప్రజల్ని యెక్కడికో తీసుకెళ్తానని అంటుంది. తీసుకెళ్తున్నట్టు యమ సకిలిస్తుంది. అబద్ధం. అది యెవరినీ యెక్కడికీ తీసుకెళ్లదు. విజ్ఞాన శాస్త్రం ముందంజ వేసి, టెక్నాలజీ జమగూడి తిండిగింజల వుత్పత్తి వంటి సమస్యలు పరిష్కారమవుతాయి. భూమిలేని పేదలు ప్రాణాలకు తెగించి తిరగబడడం వల్ల భూస్వామ్యం వంటి తిరోగామి సంబంధాలు అంతరిస్తాయి. గణన యంత్రాలు కంప్యూటర్లవుతాయి. 'సైబర్ టెక్నాలజీ' అభివృద్ధి చెందుతుంది. నాగరికత ముందుకు దూకుతుంది. ఆ దూకుళ్లన్నీ తమ వల్లనే జరిగాయంటారు ప్రధాన మంత్రులు, ముఖ్య మంత్రులు. అబద్ధం. యీ కొయ్యగుర్రం సకిలింతలను సరకు చేయనక్కర్లేదు. రాజ్యానికి కాళ్లు కడిగి, బొట్టు పెట్టి పూజలు చేయనక్కర్లేదు. రాజ్యం ప్రజల సర్వెంటు. బడులు, ఆసుపత్రులు సజావుగా పని చేసేలా చేయడం దాని పని. దానితో పని చేయించుకోవాలి. పని చేయకపోతే మార్చాలి.

సర్కారు దవాఖానాలు వద్దని అనొద్దు. మరిన్ని కావాలి. వున్నవి సరిగ్గా పని చేయాలని పాటలతో, మాటలతో, వూరేగింపుల ములుగర్రలతో పొడిచి, అదిలించాలి. బాగా పని చేస్తే అందుకు అభినందించాలి. 'ప్రజల రాజ్యం' వస్తే దానితో పని చేయించుకోమా? అందుకు విమర్శ ప్రశంసల పనిముట్లు వాడుకోమా?

■ హెచ్చార్కె

విప్లవం వ్యాపకం కాదు!

యాభై ఏండ్ల నక్సల్బరీ సందర్భంగా విభిన్న దృక్పథాలను వరుసగా ప్రచురించడం అభినందనీయం. కాకపోతే విప్లవోద్యమం మీద 'దుమ్మెత్తిపోసే' గొంతులే ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఈ దేశ రాజకీయార్థిక, సామాజికపరివర్తనలో నిబద్ధత కల్గిన విప్లవ రాజకీయాల పాత్ర ఏమిటి? వాటి ప్రభావం ఎంత వుంది, వాటి లోటుపాట్లు ఏమిటి అనేది పునాదిగా చర్చ జరిగితే ప్రజా ఉద్యమాలకు, సమాజానికి మరింత మేలు జరుగుతుంది. 'యాభై ఏండ్లుగ ఏమి సాధించారు?' అని ప్రశ్నించే వాళ్ళు యాభై ఏండ్లుగా విప్లవోద్యమం ఇంకా ఎందుకు కొనసాగుతుందో ప్రశ్నించుకోవాలి. నక్సల్బరీ ఒక లగ్జరీకాదు. విప్లవం వ్యాపకం అంతకన్నా కాదు. విప్లవకారులకు త్యాగాలు భుజకీర్తులు తెచ్చిపెట్టవు. కేవలం ఉద్యమకారులే కాదు, వాళ్ళను కాపాడుకోవడానికి ప్రజలూ ఎన్నో త్యాగాలు చేస్తున్నారు. ఆ త్యాగాలు ఎందుకు కొనసాగుతున్నాయి? మనిషిని, ప్రకృతిని, సామాజిక విలువలను ధ్వంసం చేసే నయా ఉదారవాద రాజకీయ ప్రక్రియ కొనసాగుతుంటే, దానికి ఎదురు నిలబడి పోరాడుతున్న ప్రజలను, పార్టీలను బుద్ధిజీవులు అనుకునేవాళ్ళు– "మీ 'మరో ప్రపంచం' ఎక్కడ?" అని వెటకారం చేయడం సరికాదు. నిజాయితీగా మరో ప్రపంచాన్ని కోరుకునే వాళ్ళు ఎవరయినా ఆ ప్రజల పోరాటాలకు మద్దతుగా నిలబడటం కనీస కర్తవ్యం. ఈ విధ్వంస యుగంలో అదే నిజమైన దేశభక్తి.

■ అశోక్ కుంబము

నక్సలైట్లకు సెల్యూట్!

'మరో ప్రపంచం ఎక్కడ?' (జూలై 26) శీర్షికన డాక్టర్ దుగ్గరాజు శ్రీనివాసరావు వ్యాసం చదివి ఈ సమాధానం రాస్తున్నాను. 1985లో ప్రాంతాల్లో మా నెల్లూరులో విమల్ (వారణాసి సుబ్రహ్మణ్యం) కలుసుకున్న వారిలో నేనూ ఉన్నాను. అప్పటికి నేను కె.వి.ఆర్. రచన 'ఆధునిక యుగంలో కవిలోకం' ప్రచురించి ఉన్నాను. ఆ పుస్తకం విమల్‌కు ఎలాగో లభించింది. నాతో ఆనాటి సాహిత్యరీతులు వంటి విషయాలు మాట్లాడాడు. అంత విప్లవ సాహిత్య ఉష్ణోగ్రతలోనూ, ఆ తరువాత నాకూ అతనిగురించి తెలియలేదు. ఆశ్చర్యకరంగా శ్రీనివాసరావు వ్యాసం నేటిసామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక శక్తుల పోకడలను అర్థం చేసుకోలేక సాధారణ వార్తాపత్రికల పాఠకులయిన మహిళలు, ఉపాధ్యాయులు వంటి వారి మనస్తత్వాన్ని ప్రతిబింబించింది. నాటి నక్సలైట్ ఉద్యమంలో ఒంటెత్తు పోకడలు, దుందుడుకుతనాన్ని ప్రశ్నించొచ్చు. కానీ నేడు మొత్తం సమాజం పాలకవర్గానికి లోబడి బతుకుతున్నదే! సమరశీలత పోయింది. సాహిత్యం కంఠం బీలగా జీరబోయింది. రకరకాల ధోరణులతో ప్రస్ఫుటమైన వ్యక్తిత్వ ప్రత్యేకతలు నశించో, శక్తి తగ్గో స్ఫూర్తిని, ప్రభావాన్ని పోగొట్టుకుని మిణుకుతోంది.

అవినీతిమయమైన సమాజం ప్రజల మీద చేస్తున్న అప్రకటిత యుద్ధం కాదా? పైకి గాయాలు తేలితేనే హింసా? సాంకేతిక రంగాలతో పాటు అనేక ఇతర రంగాలలో ఉద్యోగిత, ఉపాధి కోల్పోయి, కోల్పోతున్న వర్గాలైతేనేమి, దారిద్ర్యరేఖకు అటూ ఇటూ ఉన్న ప్రజానీకపు జీవన స్థితిగతుల మీదనైతేనేమి కొనసాగుతున్నదంతా హింసకిందకే వస్తుంది. కుడి, ఎడమల వ్యవస్థల నిరంకుశత్వాల కంటే ప్రజాస్వామ్య దేశాల వ్యవస్థల పేరుతో జరిగిన, జరుగుతున్న బూటకం ఏమీ తక్కువదికాదని 'రీ కనస్ట్రక్షన్ ఆఫ్ హ్యూమానిటీ' రచన తెలియజేస్తుంది. వేయవలసిన ఒక్కప్రశ్న కూడా శ్రీనివాసరావు వేయలేదు. ఆయన అడిగిన ప్రశ్నలు అప్పుడూఉన్నాయి. ప్రధానంగా పాలకవర్గాలు ఎటు వెళ్లామని చెప్పాయి? ఎటు వెళ్తున్నాయి? ఎందుకు? అలాంటి సందర్భాలలో ప్రజలు చెయ్యవలసినది ఏమిటి? దేనితో సమాజం సంఘర్షించాలో ఆ శక్తిగానే సమాజం ఎందుకు మారిపోతున్నది? నక్సలైట్ల సాహసికతకు, మనో నిబ్బరానికి, త్యాగశీలతకూ శాల్యూట్ చేసే కదా తర్వాత మాట్లడవలసింది?

■ హెచ్.ఎస్.వి.కె.రంగారావు, నెల్లూరు

మరో ప్రపంచాన్ని రేపు చూస్తాం!

"మీ మరో ప్రపంచం ఎక్కడ?" అంటూ, దుగ్గరాజు శ్రీనివాసరావు గారు రాసిన వ్యాసం (ఆంధ్రజ్యోతి, జూలై 26) కొన్ని ప్రశ్నలు అడిగింది. ఆ ప్రశ్నలు, నక్సల్బరీ ఉద్యమకారుల్ని అడిగినవే అయినప్పటికీ, అవి ప్రధానంగా "మార్క్సిజం" గురించి అడిగిన ప్రశ్నలే అవుతాయి.

"మరో ప్రపంచం" అంటే, దోపిడీ సంబంధాలు లేని, ఆధిపత్యాలు లేని, ఉత్తమ మానవ సంబంధాల ప్రపంచం.

అటువంటి మంచి ప్రపంచం ఏర్పడితే, అది "మాదే" కాదు; "మీదే" కాదు; మొత్తం మానవులందరిదీ అవుతుంది. ఈ నాడు, స్వంత శ్రమలు లేకుండా ఇతరుల శ్రమల్ని దోస్తూ జీవించే దోపిడీదారులు వున్నారే, ఆ మంచి ప్రపంచం, వాళ్ళందర్నీ మార్చి, వాళ్ళందరిదీ కూడా అవుతుంది.

ఈ నాటి మానవ సమాజంలో ఏవేవో సమస్యలు వున్నాయని ఎంతో కొంత గ్రహించిన మానవులు, ఈ సమాజం మారాలని, ఎవరి విధానాలు వారు చెప్పి వుండవచ్చు. కానీ, "మార్క్సిజం" తప్ప, ఇతర విధానాలేవీ, సమాజంలో వున్న అసలు దుష్టత్వం గురించి చెప్పలేదు. మార్క్సిజం మాత్రమే "శ్రమ దోపిడీ వేల సంవత్సరాలుగా సాగుతూనే వుంది; సమస్త సమస్యలకూ మూలం అదే!" అని గ్రహించిన, ఏకైక సిద్ధాంతం.

మార్క్సిజం మాత్రమే మానవ సమాజంలో వున్న "మౌలిక దోషాన్ని" గ్రహించింది కాబట్టి, దాన్ని తీసి వేసే మార్గం కూడా చెప్పగలిగింది.

"మంచి ప్రపంచానికి మార్గం మార్క్సిజమే" అని గ్రహించిన ఏ మానవులైనా, సమాజం గురించి రేకెత్తే ఏ ప్రశ్నలకైనా జవాబు ఇవ్వగలరు. "మీ మరో ప్రపంచం ఎక్కడ?" అని అడిగిన వ్యాసకర్త ప్రశ్నలకు నా జవాబులు ఇవి:

(1) ప్రశ్న: మరో ప్రపంచానికి నమూనా ఏదైనా వుందా?

జవాబు: నమూనా ఇంకా ఇప్పటికి లేదు. నమూనా కోసం, శ్రామిక వర్గ ప్రణాళిక ఏ నాడో సిద్ధమై వుంది. అదే 'కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక'. రష్యా–చైనాలు, నమూనాల కోసం ప్రారంభ ప్రయత్నాలు చేశాయి గానీ, "శ్రమ దోపిడీ" పట్లా, "శత్రు వర్గాల" పట్లా, వాటి గ్రహింపులు గాఢమైనవిగా లేక, ఆ దేశాలు మంచి ప్రపంచానికి నమూనాలు కాలేకపోయాయి. అయితే, అక్కడి అపజయాలకు కారణాలేమిటో కాల క్రమంలో అక్కడా గ్రహిస్తారు, ఇక్కడా గ్రహిస్తారు, ప్రపంచం అంతటా గ్రహిస్తారు. ఆ గ్రహింపులు జరుగుతూనే వున్నాయి. "మంచి" కోసం జరిగే ప్రయత్నాల్లో అపజయాలు అదే విధంగా ఆగిపోవు. నమూనాలు కాల క్రమంలో ఏర్పడక పోవు.

(2) మరో ప్రపంచంలో కూడా ఏదో ఒక ప్రభుత్వం ఉండాల్సిందే కదా?

జవాబు: "మరో ప్రపంచం" అంటే, దాని అర్థం వేరు. "ప్రభుత్వం" ప్రసక్తి, మరో ప్రపంచానిది కాదు. ఈ నాటి దోపిడీ ప్రపంచం, మరో ప్రపంచంగా స్థిరపడే వరకూ సాగే పరివర్తనా దశలో, దానికి తగిన ప్రభుత్వం (స్టేట్) అనేది, దాని కోర్టులూ, జైళ్ళూ, చిత్రహింసలూ, మరణ శిక్షలూ, వంటి వాటితో సహా, బానిసత్వం ప్రారంభమైన కాలంలో, యజమానుల వర్గ రక్షణ కోసమే, బానిస వర్గ అణిచివేత కోసమే, కొత్తగా ఏర్పడిందని మొదట తెలిస్తే; వర్గాలే పోయినప్పుడు, ప్రభుత్వం కూడా పోతుందని తెలుస్తుంది. శత్రు వర్గాలు లేని ప్రపంచానికి ప్రభుత్వాలతో అవసరం వుండదు. సమాజానికి, సమాజ నిర్వహణ చాలు! ఈ నాటి శ్రామిక వర్గానికి ఈ నిజాలు తెలిస్తే, ప్రభుత్వంతో అవసరం లేని మంచి సమాజ నిర్మాణం ఒక ప్రశ్నా?

(3) మీ మరో ప్రపంచంలో కూడా పెత్తనం కొందరి చేతుల్లోనే వుంటుంది కదా?

జవాబు: "పెత్తనం" అన్నారంటే, దోపిడీ సంబంధాలనే ఊహిస్తున్నారని అర్థం. దోపిడీ సంబంధాల్ని మార్చే ప్రయత్నాలు, "పెత్తనాలు" కావు, "స్వంత శ్రమ లేకుండా జీవించే హక్కు ఎవ్వరికీ లేదు. అందరూ శ్రమలు చెయ్యాలి" అని ఒక నిబంధన పెడితే, అది "పెత్తనం" కాదు. అది, శ్రామిక వర్గం, దోపిడీ నించి విముక్తి చెందే ఆత్మ రక్షణ మార్గం. "పురుషులు కూడా స్త్రీలతో పాటు ఇంటి పనులూ, పిల్లల పెంపకాలూ, వృద్ధుల సంరక్షణలూ చెయ్యాలి" అని నిబంధనలు పెడితే, అవి "పెత్తనాలు" కావు. అవి, స్త్రీలకు పురుషుల పెత్తనాల నించి విముక్తి. దోపిడీ వర్గాల పాలనలో వుండే రకపు పెత్తనాలే, శ్రామిక వర్గ పాలనలో కూడా వుంటే, అది వర్గాల రాహిత్యం అవదు. మంచి ప్రపంచం కోసం, దోపిడీ సంబంధాల్ని వ్యతిరేకించే కొత్త విద్యా, కొత్త కళలూ, కొత్త సంస్కృతీ, పెత్తనం లేని సంబంధాలూ, ఏర్పడతాయి. వాటిని కోరుకుంటేనే, ఏర్పర్చుకుంటేనే, అది మరో ప్రపంచం!

(4) నేటి పోలీసు వ్యవస్థ వంటిదే మరో పేరుతో వుండి తీరుతుందా లేదా?

జవాబు: నేటి పోలీసు వ్యవస్థ, దోపిడీ వర్గ రక్షకురాలు. రేపు, దోపిడీ వర్గం, తన స్వంత శ్రమతో తను బ్రతకాలని గ్రహిస్తే, అలా గ్రహించే వరకూ, అనేక కొత్త నిబంధనలతో పాటు పోలీసు కూడా అవసరమే. యుద్ధాలే లేకపోతే, సైన్యం ఎందుకు? దోపిడీయే లేకపోతే పోలీసు ఎందుకు? అందరికీ శ్రమలు చేసే అవకాశాలూ, కడుపునిండా తిండీ, బట్టా, ఇల్లూ, వైద్యం, విశ్రాంతీ, సంసారాల్లో శాంతీ – అన్నీ వుంటే, పోలీసు ఎందుకు? కొంత కాలం వరకూ పోలీసు వుంటే, వాళ్ళు కూడా ఉత్పాదక శ్రమలు చేసే వాళ్ళుగానే వుంటారు. అందరూ శ్రమలు చేసే మరో ప్రపంచానికి పోలీసు అక్కరలేదు.

మార్క్సిజాన్ని ఇష్టపడే వాళ్ళకి కూడా కొన్ని సందేహాలు వుంటాయి. "అసలు, ప్రపంచంలో వున్న డబ్బు అంతా ఎవరిది?" అని అడిగితే, కొందరైనా, "శ్రామికులది" అంటారు. "ఏ శ్రామికులది" అంటే, చెప్పలేరు. ఏ సందేహం కోసం అయినా, మార్క్స్ "కాపిటల్" పుస్తకం తెరవ వలిసిందే! అదే సమాజ శాస్త్రం మరి!

(5) పోలీసు వ్యవస్థ లేని రాజ్యం ఎక్కడైనా వుంటుందా?

జవాబు: బానిసత్వం గురించి తెలిసి వుంటే, ఈ ప్రశ్న రాదు. యజమానీ బానిస సంబంధాలు ప్రారంభం కాని కాలంలో, "రాజ్యం" అనేది లేదు. దానితో అవసరం ఇంకా కలగలేదు. రాజ్యం లేకుండానే అనేక వేల, లక్షల సంవత్సరాల కాలం గడిచింది. "రాజ్యం" ఎందుకు పుట్టిందో తెలిస్తే, అది ఎందుకు పోతుందో తెలుస్తుంది. దోపిడీ అదృశ్యమే, రాజ్యం అదృశ్యం!

(6) మరో ప్రపంచంలో, శాంతి భద్రతల సమస్యలే తలెత్తవా? లాఠీ చార్జీలూ, కాల్పులూ, ఉండవా?

జవాబు: దోపిడీ సంబంధాలు సాగుతూనే వుంటే, ఆ లాఠీలూ, తూటాలూ అన్నీ వుంటాయి. దోపిడీ సంబంధాలే వుంటే 'శాంతి' ఎవరికి కావాలి? భద్రత ఎవరికి కావాలి? కార్మికులు ఎప్పుడైనా సమ్మె చేస్తే అక్కడికి పోలీసులు తుపాకులతో దిగుతారు. అప్పుడు శాంతి భద్రతలు యజమానికి దొరుకుతాయి. కార్మికులకు కాదు. డబ్బూ, ఉత్పత్తులూ అన్నీ, ఒక వర్గం వేపు చీలిపోయి, అవన్నీ తయారుచేసిన వర్గం ఖాళీ చేతుల్తో వుంటే, వాళ్ళు డబ్బుని వెతుక్కుంటూ, అది ఎక్కడ వుందో అక్కడికి వస్తారు మరి. అందుకే, సిరి సంపదల వాళ్ళకి భద్రత కావాలి. శాంతి కావాలి. వాళ్ళ కోసం, వాళ్ళ భవనాల ముందు వాచ్‌మేన్లూ, పోలీసులూ, వుండాలి. ఒక చోటుకి చేరే ధన రాసులే లేకపోతే, శాంతి భద్రతల మాటేమిటి? నిరుపేద గుడిసె ముందు వాచ్‌మేన్ వుంటాడా?

(7) మీ పాలన నచ్చని వారుంటారు. వారి అసమ్మతి వుంటుంది. వారి పోరాటం మీద మీరు ఎలా ప్రవర్తిస్తారు?

జవాబు: "అసమ్మతీ; పోరాటమూ", మాటల్ని ఈ వ్యాసకర్త ఎంత అర్థరహితంగా వాడేశారు! దోపిడీకి గురి అయ్యే వాళ్ళ అసమ్మతినీ, దోపిడీ చేసే వాళ్ళ అసమ్మతినీ ఒకే గాటిన కట్టారు. "అందరూ శ్రమలు చెయ్యాలి. ఇతరుల శ్రమల్ని దోస్తూ బ్రతకకూడదు" అని శ్రామిక వర్గం అంటే, దానికి ఎవరైనా అసమ్మతి చూపితే, వాళ్ళ అర్థం ఏమిటి? వాళ్ళు, "మేము శ్రమలు చెయ్యం. వడ్డీలూ – లాభాలూ – కౌళ్ళూ తింటూ బ్రతికే హక్కులు మాకు కావాలి" అంటున్నారన్నమాట! వాళ్ళు, ఆ దృష్టితో, "దోపిడీ సమాజమే కావాలి" అంటే, దాన్ని, న్యాయమైన "అసమ్మతి"గానూ, న్యాయమైన పోరాటంగానూ భావించారు ఈ వ్యాస కర్త. "మీ పాలనలో అసమ్మతిదారులు వుండరా? వాళ్ళ మీద లాఠీలూ, కాల్పులూ వుండవా?" అంటున్నారు. "దోపిడీ చేస్తాం! మమ్మల్ని చెయ్యనివ్వండి! మాకు అడ్డు రాకండి!" అనడాన్ని గొప్ప పోరాటంగా ఎంచి!

"మేము శ్రమలు చెయ్యం. ఇతరుల శ్రమలే లాగుతాం" అనే వాళ్ళు దోషులే. వాళ్ళని జైళ్ళల్లో పడేసి అక్కడే పనులు చేయించవచ్చు. కానీ, అదంతా చెత్త! భూమిని జైళ్ళ కోసం ఉపయోగించడమా? అక్కడ కాపలా మనుషులు ఉండడమా? అది చాలా చెత్త! "శ్రమలు చెయ్యం" అని చెప్పే వాళ్ళని అడవుల్లోకి పొమ్మనాలి. "మీరు శ్రమలు చెయ్యం అంటున్నారు. అలాంటప్పుడు, అడుగడుగునా శ్రమలతో తయారైన ఊళ్ళల్లో వుండే హక్కు వుండదు మీకు. రోడ్డు మీద నడిచే హక్కు కూడా వుండదు. తిండీ, బట్టా, ఇల్లూ, మందులూ, పుస్తకాలూ, రవాణాలూ, అన్నీ శ్రమలవే. మీ ఒంటి మీద బట్టలు కూడా కింద పడేసి అడవుల్లోకి వెళ్ళిపోవాలి. అడవులు మా శ్రమలు కావు. మీరు అక్కడ వుంటే మాకు అభ్యంతరం లేదు. కానీ, మీరు అక్కడైనా ఏదో ఒక పని చేసుకోవాలి. పాకలు కట్టుకోవాలి, నేలలో వెతికి దుంపల్ని తవ్వి వాటిని కాల్చుకోవాలి. క్షవరాలు చేసుకోవాలంటే, మొదట కత్తెర్లు కావాలి. ఒంటి మీద బట్టలు కావాలంటే మొదట రాట్నాలూ, మగ్గాలూ, కావాలి. ఇక మీ ఇష్టం! ఊళ్ళల్లో వుంటారో, అడవుల్లోకి పోతారో! తేల్చుకోండి తొందరగా. ఊళ్ళల్లో వుండాలంటే, వెంటనే లారీ డ్రైవర్లుగా పనుల్లోకి దిగండి!" అని చెప్తే చాలు! వాళ్ళ కోసం లాఠీలూ, తూటాలూ, ఎందుకు? వృధా!

వ్యాసకర్త ఇంకా అనేక ప్రశ్నలు అడగలేదు గానీ, ఇంకా చాలా వుంటాయి. మార్క్సిజాన్ని ఇష్టపడే వాళ్ళకి కూడా కొన్ని సందేహాలు వుంటాయి.

"అసలు, ప్రపంచంలో వున్న డబ్బు అంతా ఎవరిది?" అని అడిగితే, కొందరైనా, "శ్రామికులది" అంటారు. "ఏ శ్రామికులది" అంటే, చెప్పలేరు.

"డబ్బు" అనేది, ఉత్పాదక శ్రామికుల "శ్రమ విలువ" మాత్రమే. అనుత్పాదక శ్రామికులు కూడా శ్రమ దోపిడీకి గురి అయినా, వారి శ్రమలు, డబ్బుగా మారవు. అలాగే, కుటుంబ శ్రమలు, డబ్బుగా మారవు.

"మార్క్సిజం" మీద ఇంకో సందేహం. "మార్క్సిజం మాత్రం, సమానత్వాన్ని ఎలా ఇవ్వగలదు? ఒక వ్యక్తి శారీరక శ్రమ చేస్తాడు; ఇంకో వ్యక్తి మేధా శ్రమ చేస్తాడు. ఆ శ్రమల విలువలు సమానంగా వుండవు. ఆ వ్యక్తుల ఆదాయాలు తేడాగా వుంటాయి. మరి, వాళ్ళు "సమానులు" ఎలా అవగలరు?" – ఇదీ సందేహం!

ఏ సందేహం కోసం అయినా, మార్క్స్ "కాపిటల్" పుస్తకం తెరవ వలిసిందే! అదే సమాజ శాస్త్రం మరి!

■ రంగనాయకమ్మ

స్ఫూర్తి


జయమ్మ

భావి తరాలు బాగుండాలంటే.. ప్రధానంగా అందించాల్సినవి విద్య, వైద్యం! ఆ సంగతి ఈ అమ్మలిద్దరికీ బాగా తెలుసు. కాన్పుకొచ్చిన ఆడబిడ్డను పండంటి పసిపాపతో భద్రంగా ఇంటికి చేర్చే ఆయమ్మ.. ఎం. జయమ్మ ఒకరు! ఏడు పదులు దాటినా బడిపిల్లలకు సామాజిక సేవా విద్యను నవ్వుతూ అందించడం ఆపని నిత్య బాల్య లక్ష్మి.. టి. వెంకట లక్ష్మి ఇంకొకరు! మహబూబ్‌నగర్‌కు చెందిన ఆ హెడ్ నర్స్, ఈ స్కౌట్ అండ్ గైడ్స్ టీచర్- ఇద్దరూ ఎందరికో స్ఫూర్తి దాతలు. స్వాతంత్ర్య దినోత్సవ వేళ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అవార్డులతో సత్కరించిన ఈ ఇద్దరమ్మల కథ ఇదీ..

1300 కాన్పుల ఆయమ్మ

ఆమే స్ఫూర్తి..

నేను ఓ నిరుపేద కుటుంబంలో పుట్టాను. అమ్మపేరు సీతమ్మ, నాన్న పేరు వెంకయ్య. మేం ఐదుగురు సంతానం. ఇంట్లో ఒకే ఒక్క ఆడపిల్లను నేను. అల్లారుముద్దుగా పెంచారు. పదోతరగతి తర్వాత నర్సుగా చేరతానంటే అన్నయ్యలు ప్రోత్సహించారు. నర్సు శిక్షణ పూర్తయ్యాక 2006 సంవత్సరంలో ఉద్యోగం వచ్చింది. మూడు సంవత్సరాలు వికారాబాద్ జిల్లా యాలాల్ మండలంలో పని చేశాను. ఆ తర్వాత మహ్మదాబాద్‌కు బదిలీపై వచ్చాను. ఎక్కడో పడమర దేశాల్లో పుట్టి పెరిగిన మదర్ థెరిస్సా కలకత్తాలోని మురికివాడలకు వచ్చి సేవ చేసింది కదా. ఆమె గురించి తెల్సుకున్నపుడు చాలా గొప్పగా ఫీలయ్యాను.

> 2007లో నా వివాహమైంది. మా ఆయన పేరు లక్ష్మణ్. స్థానిక పెట్రోల్ బంక్‌లో క్యాషియర్‌గా పని చేస్తారు. నాకిద్దరు పిల్లలు. కొడుకు ఐదోతరగతి చదువుతున్నాడు. కూతురు మూడోతరగతి. వారిని బాగా చదివించాలి. రిటైర్ అయ్యేవరకూ నా వృత్తిలో బాగా సేవ చేయాలి. అవే నా లక్ష్యాలు.

మాధవసేవే..

ప్రస్తుతం నేను మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం మహ్మదాబాద్ 'పీహెచ్‌సీ' లో స్టాఫ్ నర్సుగా పని చేస్తున్నా. ఆసుపత్రిలో చాలా వరకు నర్సులు ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ పనిచేస్తారు. మా ఆసుపత్రిలో నేనొక్కదాన్నే నర్సు కావటంతో మూడు షిఫ్టులు చేస్తాను. రాత్రి పూట నొప్పులతో గర్భిణులు ఆసుపత్రికి వస్తుంటారు. అర్ధ రాత్రి దాటాక, తెల్లారుజామున కూడా వస్తుంటారు. నా బాధ్యత నేను నిర్వహిస్తానంతే. కొందరైతే నీకు విసుగు రాదా.. అంటుంటారు. అసలు నాకెందుకు విసుగొస్తుంది. చిన్నప్పటి నుంచి నర్సు కావాలనే ఆశతో కెరీర్ ఎంచుకున్నా. ఇష్టమున్న కొలువులో కష్టమేముంటుంది?


రోగులకు మందులు పంపిణీ చేస్తున్న జయమ్మ

నా మూలాలు మర్చిపోలేదు..

పేదకుటుంబంలో పుట్టిపెరిగిన నాకు పేదల కష్టాలు తెలుసు. అందుకే పేదవాళ్లకు సేవ చేయటానికి ముందుంటాను. వేళకాని వేళలో డెలివరీకి రావటం సహజం. నా పని కాదనీ, నా షిఫ్టు కాదనీ ఊరుకుంటే ఎలా? ఇంటికెళ్లి కూర్చోగానే ఫోన్ వస్తుంది డెలివరీ ఉందని. అర్ధరాత్రి తర్వాత తలుపుల చప్పుడో, ఫోన్ రింగో వస్తుంది. డెలివరీ ఉందని తెలిస్తే క్షణం కూడా ఆగలేను. నెలలో కనీసం 25 నుంచి 40 లోపు కాన్పులు చేస్తుంటా. ఎక్కువశాతం సహజమైన కాన్పులే. అలా ఈ మూడేళ్లలో 1300 పైగా కాన్పులు చేశాను. ఇది వరకే జిల్లా స్థాయిలో నాలుగుసార్లు ఉత్తమ నర్సు అవార్డు అందుకున్నా. ఇప్పుడు తొలిసారి రాష్ట్రస్థాయి అవార్డు వచ్చింది. అవార్డుల గురించి నేనెన్నడూ పట్టించుకోలేదు. నాకెలాంటి ఆశల్లేవు. అమ్మకడుపులో ఉండే బిడ్డ నా దగ్గరికి వచ్చాక బయటి ప్రపంచాన్ని చూస్తుంది. కెవ్వు మంటూ ఒక్క అరుపుతో కుటుంబాన్నంతా ఆనందంతో ముంచెత్తుతుంది. మా ఆసుపత్రి నుంచి అమ్మతో పాటు ఇంటికెళ్లే ఆ పిల్లల బోసినవ్వులు చాలు. అవి నాకు మరింత ఓర్పును, వృత్తిపట్ల ప్రేమను, బలాన్ని ఇస్తాయి. అంతకంటే ఏం కావాలి?

● **కె.ఆంజనేయులు**, గండీడ్
ఫొటోలు- **రవికుమార్**


వెంకటలక్ష్మి

72 ఏళ్ళ యంగ్‌టీచర్

పిల్లలతో గడపటం ఓ అద్భుతమైన అనుభూతి. నిత్యమూ అందమైన బాల్యానికి టచ్‌లో ఉండటం నాకు దేవుడు ఇచ్చిన అదృష్టం. ఉపాధ్యాయురాలిగా పదవీ విరమణ చేసినా.. 'స్కౌట్స్ అండ్ గైడ్స్' లో ఆర్గనైజర్‌గా పని చేస్తున్నా. పిల్లలను గొప్ప పౌరుల్లాగా తీర్చిదిద్దే సామాజిక సేవను తెలంగాణ ప్రభుత్వం గుర్తించింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అవార్డుతో సత్కరించింది.

పెళ్లయ్యాక.. చదువు, ఉద్యోగం.

మాది ఖమ్మం జిల్లా తక్కెళ్లపాడు. నాలుగో తరగతి వరకూ చదివానంతే. 1960లో వివాహమైంది. పెళ్లయ్యాక మా ఆయన నన్ను చదివించారు. ప్రైవేట్‌గా ఈఎస్ఎల్‌సీ(ఎనిమిదో తరగతి), హెచ్ఎస్‌సీ (పదోతరగతి) పరీక్షలు రాసి పాసయ్యా. ఆ తర్వాత సెకండరీ గ్రేడ్ ట్రైనింగ్ తీసుకుని ఉపాధ్యాయ శిక్షణ పొందాను. 1975లో ఎస్‌జీటీ టీచర్‌గా మహబూబ్‌నగర్ జిల్లా మదీనామజీద్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా ఉద్యోగంలో చేరాను.

> నాకిప్పుడు డెబ్భై రెండేళ్లు. మా ఆయనకి ఎనభై ఏళ్లు. ఇద్దరం టీచర్లం కావటంతో మా మాటలు శిష్యులు, పిల్లలు చుట్టూ తిరుగుతుంటాయి. భక్తి కంటే ఏదో పని చేయటం నాకిష్టం. నా ఈ సుదీర్ఘ ప్రయాణంలో నా భర్త ప్రోత్సాహం మరువలేనిది. నాకు ఇద్దరు అబ్బాయిలు, ఒకమ్మాయి. ముగ్గురూ సర్కారుబడిలోనే చదివారు. నా చివరి శ్వాస ఆగేవరకూ పిల్లలకు సేవ చేయాలి.

ఆ ఆనందం వెలకట్టలేనిది..

మా ఆయన కూడా టీచర్. నేను పాఠశాలకు నాలుగున్నర కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లేదాన్ని. మహబూబ్‌నగర్ జిల్లా ప్రాంతంలో పిల్లలు డ్రాపవుట్స్ ఎక్కువగా ఉండేవారు. ఎక్కువగా గొర్లు, బర్రెలు కాసేవారు. వారిని బడికి రప్పించటం కోసం మా బడిలోని పిల్లలను ట్రాక్టర్‌లో ఎక్కించుకుని డప్పు కొట్టి మరీ స్కూలుకు రమ్మని పిలుపు ఇప్పించేదాన్ని. దీంతో చాలామంది బడిబాట పట్టారు. ఉదయాన్నే తొమ్మిదిలోపల పశువులు మేపి బడికి వచ్చేవారు. మూడు గంటల తర్వాత మళ్లీ పశువులను మేపటానికి పరిగెత్తేవారు. ఒక్కోసారి రాత్రి పూట చదువు చెప్పే ఊరిలోనే ఉండిపోయేదాన్ని. అక్కడ నా సహోధ్యాపకురాలితో కలిసి మహిళలకు రాత్రిబడి చెప్పేదాన్ని. 2000 సంవత్సరానికి ముందే మహబూబ్‌నగర్‌లోని వెంకటాపూర్ అనే గ్రామాన్ని దత్తత తీసుకుని మెడికల్ క్యాంపులు నిర్వహించాను.

అలా జీవితం మలుపు..

ఉపాధ్యాయ వృత్తిలో మమేకం కావటంతో పాటు 'స్కౌట్స్ అండ్ గైడ్స్'లో 1980లో చేరాను. శిక్షణ ఇచ్చి రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో నిర్వహించే క్యాంపులకు పిల్లలను తీసుకెళ్లేదాన్ని. 2003లో రిటైర్ అయ్యాను. అయినప్పటికీ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో శిక్షకురాలిగా పని చేస్తున్నా. ప్రస్తుతం అత్యున్నతమైన హిమాలయ హుడ్ హోదాలో పని చేస్తున్నా.

అబ్దుల్ కలాం ఆదర్శం

ఇరవై తొమ్మిది సంవత్సరాల ఉద్యోగ జీవితంలో పిల్లలతో ఎన్నో మధురానుభూతులు. అలాంటి ప్రపంచంలో ఉండే అవకాశం రావటం నిజంగా అదృష్టమే. 2000 సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు అందుకున్నా. ఆ తర్వాత మూడేళ్లకు అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాంగారి చేతుల మీదుగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు అందుకోవటం మర్చిపోలేను. 'స్కౌట్ అండ్ గైడ్స్' వాళ్లిచ్చే అంతర్జాతీయ అవార్డు కూడా దక్కింది. ఈ అవార్డుల గురించి ఏనాడూ ఆలోచించలేదు. పిల్లలు బావుంటేనే నేను బావుంటాను! ఈ ఏడు పదుల వయసులోనూ పిల్లలతో కలిసి ఉంటూ.. నా బాల్యాన్ని లైవ్‌లో ఉంచుకోవటం నాకు దొరికిన వరం. నేను రిటైర్ అయ్యే సమయంలో కావాలనే జడ్చర్ల దగ్గరలోని ఈర్లపల్లి గ్రామంలో ఎమ్.పి.యు.పి. స్కూల్‌లో పనిచేశాను. ఆ సమయంలో పిల్లలు గోడలపై రాసిన గీతలు, బండలమీద చాక్ పీస్‌లతో వేసిన మ్యాపుల మధ్య ఉద్యోగానికి ఘనమైన వీడ్కోలు తీసుకున్నా. నాకు అబ్దుల్ కలాం ఆదర్శం. చివరి శ్వాస మిగిలేవరకూ పిల్లలకోసమే నా జీవితం.



అబ్దుల్‌కలాం నుంచి అవార్డు స్వీకరిస్తున్న వెంకటలక్ష్మి

● **చల్లా సాంబశివారెడ్డి**, మహబూబ్‌నగర్
ఫొటో:**రవికుమార్**



అనాథలకు అమ్మ
అనాథపిల్లలకు పాఠాలు చెబుతున్న కలెక్టర్ యోగిత

మానవత యోగి

బంగారు తెలంగాణ సాధనలో పనిచేసే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారామె. అంతేనా...కలెక్టర్‌గా పలు పథకాలు అమలు చేసిన పేరుంది కూడా ఆమెకు. తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా చేపట్టిన 'హరితహారం'లోనూ అవార్డును కైవసం చేసుకున్నారు. అనాథ పిల్లల కోసం 'మానవతా సదన్'ను అభివృద్ధి చేసి తాజాగా ప్రభుత్వ ఎక్సెలెన్స్ అవార్డును అందుకున్నారు. ఆమె ఎవరో కాదు నిజామాబాద్ కలెక్టర్ డాక్టర్ యోగితా రాణా. ఈ సందర్భంగా 'మానవతా సదన్' సక్సెస్ విశేషాలను 'నవ్య' ప్రతినిధితో యోగిత పంచుకున్నారు.

"నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని మానవత సదన్‌ను గుర్తిస్తూ ప్రభుత్వం అవార్డు ప్రకటించడం నాకు ఎంతో ఆనందాన్నిచ్చింది. కలెక్టర్‌గా నిజామాబాద్ జిల్లాకు ఎన్ని మంచి పనులు చేసినా...అనాథపిల్లల కోసం మానవతా సదన్‌ను అభివృద్ధిచేయడాన్ని మాత్రం గొప్ప అదృష్టంగా భావిస్తా. దీని ద్వారా ఎందరో అనాథ పిల్లలకు అమ్మను కాగలిగాను.

సమిష్టి కృషితోనే సాధ్యమైంది...

మానవతా సదన్ ఆలోచన ఎలా వచ్చిందని నన్ను చాలామంది అడుగుతుంటారు. వారికి నేను చెప్పే సమాధానం ఒక్కటే.. నా సర్వీసులో చూసిన అనుభవాలతో ఈ సదన్ నిర్వహణకు పూనుకోవాలనే ఆలోచన నాలో మెదిలింది. జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత అన్ని మండలాల్లోనూ తిరిగాను. అందులో భాగంగానే డిచ్‌పల్లిలోని మానవతా సదన్‌కు కూడా వచ్చాను. అప్పుడు 'ఆర్‌బీసి'గా ఈ సదన్ నడుస్తోంది. అక్కడ పిల్లలున్న పరిస్థితులు చూసిన నాకు దీన్ని బాగా అభివృద్ధి చేస్తే బాగుంటుందనిపించింది. వెంటనే అధికారులతో సమావేశమై 'సర్వశిక్ష అభియాన్' కింద ఈ సదన్‌ను తీర్చిదిద్దాలని నిర్ణయం తీసుకున్నా. తర్వాత ఆర్‌బీసి పేరును కాస్తా 'మానవతా సదన్'గా మార్చాం. పాత పోలీసు స్టేషన్ భవనంలో ఖాళీగా ఉన్న గదులను మరమ్మతులు చేసి అందులో ఈ సదన్‌ను ఏర్పాటుచేశాం. ఇందులో మెల్లగా అనాథ పిల్లలు చేరడం ప్రారంభించారు. ఇందులో చేరుతున్న వారి సంఖ్య మెల్లగా పెరిగింది. సమిష్టి కృషితోనే ఈ సదన్ అభివృద్ధి సాధ్యమైంది. అనాథ పిల్లలకు సౌకర్యాలు కల్పించేందుకు ప్రజలు సైతం ముందుకొచ్చారు. అంతే కాదు స్థానిక మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు సైతం తమ సహాయసహకారాల్ని అందించారు. స్వచ్ఛంద సంస్థలతోపాటు ఇతరుల సహాయం కూడా మాకు అందింది. ప్రభుత్వం తరపున 50 లక్షల రూపాయలతో మౌలిక వసతులతో కూడిన పూర్తిస్థాయి నూతన భవన నిర్మాణం మొదలెట్టాం. రెండేళ్లల్లో మానవతా సదన్‌ను బాగా తీర్చిదిద్ద గలిగాం. ప్రస్తుతం ఇందులో 110 మంది పిల్లలు ఆశ్రయం పొందుతున్నారు. వీరందరికీ కార్పొరేట్ పాఠశాలల్లో విద్యను అందిస్తున్నాం. ఈ పిల్లల్లో 40 మంది ఎయిడ్స్ వ్యాధిగ్రస్థుల పిల్లలు కూడా ఉన్నారు. వారిని కంటికి రెప్పలా చూసుకుంటున్నాం. ఈ సదన్‌కు రాష్ట్ర ప్రభుత్వ అవార్డు రావడంతో దీనికోసం మరింత ఎక్కువగా పనిచేసే అవకాశం మాకు లభించింది. అంతేకాదు ఈ దిశగా మేమందిస్తున్న సేవలు రాష్ట్రస్థాయిలో ఎందరికో తెలిసాయి కూడా.


కలెక్టర్ యోగిత

అందరికీ అమ్మను...

నాకు ఎంతో ఆనందం కలిగించే మరో విషయం ఏమిటంటే 'మానవతా సదన్' ద్వారా ప్రజలలో నాకెంతో గుర్తింపు వచ్చింది. విద్యార్థుల కోసం సదన్‌లో అన్ని మౌలిక సదుపాయాలనూ ఏర్పాటు చేశాం. ప్రతి వారం అక్కడికి వెళ్లి కాసేపు పిల్లలతో గడుపుతాను. 'మానవతా సదన్'కు బాగా ప్రచారం రావడంతో స్థానిక స్వచ్ఛంద సంస్థలు, వివిధ శాఖల అధికారులు సైతం సదన్‌కు వెళ్లి అందులోని పిల్లలకు కావాల్సిన వస్తువులు ఇచ్చి వాళ్లతో కాసేపు గడిపి వెడుతున్నారు. సదన్‌లోని పిల్లల పుట్టిన రోజులు కూడా చేస్తాం. అలా చిన్నారులకు మేమున్నామనే భరోసాను కలుగజేస్తున్నాం. మీడియాలో, పత్రికల్లో మానవతాసదన్‌పై వచ్చిన కథనాల వల్ల కూడా మాకు బయట నుంచి ఆర్థిక విరాళాలు బాగా అందాయి. అప్పుడనిపించింది నాకు సమాజంలో ఇంకా మానవత్వం ఉందని! నాకు కుటుంబ అండదండలు కూడా పుష్కలంగా ఉన్నాయి. సంగారెడ్డి కలెక్టరుగా పనిచేస్తున్న నా భర్త మానిక్‌రాజ్ ఎలాంటి పరిస్థితుల్లోనైనా నేనున్నానంటూ నాకు అండగా నిలబడతారు. అనాథలకు మంచి భవిష్యత్తు అందించాలన్నదే 'మానవతా సదన్' స్థాపన ముఖ్య ఉద్దేశం. నేను బదిలీ అయినా ఇక్కడి పిల్లలకు సేవల పరంగా ఎలాంటి లోటూ రాని రీతిలో చర్యలు తీసుకుంటున్నాను. నేనంటే ఈ సదన్‌లోని పిల్లలకు ఎంతో ప్రాణం. ఈ అనాథపిల్లలు నాలో అమ్మను చూసుకుంటున్నారు. అక్కడి పిల్లలంతా నన్ను 'అమ్మ' అని పిలుస్తారు. వారితో కలిసి సెలవుదినాలు గడిపితే ఆ చిన్నారులకు ఎంత ఆనందమో. అప్పుడప్పుడు నా పిల్లలు కూడా వారితో కలిసి ఆడుకుంటుంటారు. ఎప్పుడు కావలిస్తే అప్పుడు సదన్‌లోని పిల్లలకు నేను అందుబాటులో ఉంటాను. వారి సమస్యలేమైనా ఉంటే వెంటనే పరిష్కరిస్తాను. ఆ పిల్లలతో కలిసి నెలలో ఎప్పుడైనా సినిమాలు చూస్తుంటాను. ఇవన్నీ...ఆ పిల్లల్లో నాపై అపారమైన


అనాథ పిల్లలతో కలెక్టర్ యోగిత

నమ్మకం, విశ్వాసం కలిగించాయి. నన్ను 'అమ్మా' అని పిలిచేలా చేశాయి. ఇది నాకెంతో తృప్తినిస్తోంది. ఈ పిల్లల్లో కొంతమందిని బోధన్, నిజామాబాద్‌లలోని పాఠశాలల్లో చేర్పించాను. వారి దగ్గరకు నేను ఎప్పుడు వెళ్లినా వాళ్లు నన్ను చూడగానే 'అమ్మా' అంటూ దగ్గరికి పరిగెట్టుకుంటూ వచ్చేస్తారు. ఆ క్షణాలను మాత్రం నేనెన్నటికీ మరువలేను. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఎయిడ్స్, అనాథ పిల్లల కోసం ఇలాంటి భవనాలను ఏర్పాటు చేస్తే బాగుంటుంది. అందుకే రాష్ట్రస్థాయిలో మరిన్ని 'మానవతా సదన్'లు ఏర్పడితే మరెందరో అనాథపిల్లలను ఆదుకున్నవారమవుతాం"

● **పి.సంపత్‌రావు**, నిజామాబాద్
ఫొటో:రతన్‌కుమార్

యంగ్

టెక్నైజ్



ఆరు వేలకే... అదిరే ఫోన్స్

స్మార్ట్‌ఫోన్ కొనాలంటే పదివేలు కావాలా? ఏం అక్కర్లేదు! బేసిక్ ఫోన్ ధరలోనే మంచి ఫీచర్లున్న స్మార్ట్‌ఫోన్‌ను కొనుగోలు చేయవచ్చు. ఆరు వేలకు అటూ ఇటూగా ధర ఉన్న అలాంటి స్మార్ట్‌ఫోన్లు, వాటి ఫీచర్ల విశేషాలు మీకోసం...

ఇంటెక్స్ ఆక్వాఫిష్




సెయిల్‌ఫిష్ 2.0 ఆపరేటింగ్ సిస్టమ్‌తో పనిచేస్తుంది. ఆకట్టుకునే డిజైన్ దీని సొంతం. 5 అంగుళాల టచ్ డిస్‌ప్లే పనితీరు బాగుంటుంది. 1.3 జిగా హెడ్జ్ ప్రాసెసర్, 2జిబి ర్యామ్, 16జిబి స్టోరేజ్ ఉంటుంది. ఎస్‌డీకార్డుతో 32 జిబి వరకు పెంచుకోవచ్చు. నాన్‌రిమూవబుల్ బ్యాటరీ(2500ఎంఎహెచ్) ఉంటుంది. డ్యుయల్ సిమ్‌లు వేసుకోవచ్చు. 4జి, 3జిలను సపోర్టు చేస్తుంది. 8 మెగాపిక్సెల్ రియర్ కెమెరా విత్ ఫ్లాష్, 2 మెగాపిక్సెల్ ఫ్రంట్ కెమెరా వంటి ఫీచర్లున్నాయి.

కూల్‌ప్యాడ్ డాజెన్ 1




ఆరువేల లోపు లభించే మరో అద్భుతమైన ఫోన్ ఇది. 5 అంగుళాల తాకే తెర, 2జిబి ర్యామ్, 8 జిబి స్టోరేజ్ సామర్థ్యం వంటి ఫీచర్లున్నాయి. ఎస్‌డీకార్డుతో 32 జిబి వరకు స్టోరేజ్ పెంచుకోవచ్చు. 8 మెగా పిక్సెల్ రియర్ కెమెరా, 5 మెగాపిక్సెల్ ఫ్రంట్ కెమెరాలతో నాణ్యమైన ఫొటోలు దిగొచ్చు. ఆండ్రాయిడ్ 4.4 వెర్షన్‌పై పనిచేసే ఈ మొబైల్‌లో 2500ఎంఎహెచ్ రిమూవబుల్ బ్యాటరీ ఉంటుంది. డ్యుయల్ సిమ్ 4జి, 3జిలను సపోర్టు చేస్తుంది. ప్రాగ్జిమిటీ సెన్సర్, యాంబియెంట్ లైట్ సెన్సర్, యాక్సిలరోమీటర్ సెన్సర్లున్నాయి.

కార్బన్ టైటానియం మ్యాక్ ఫైవ్



ఆరు వేలలోపు మంచి స్మార్ట్‌ఫోన్ కావాలనుకునే వారు ఎంచుకోదగిన ఫోన్ ఇది. 2జిబి ర్యామ్, 16జిబి స్టోరేజ్ ఉంటుంది. 32 జిబి వరకు పెంచుకోవచ్చు. 5 అంగుళాల డిస్‌ప్లే, ఆకర్షణీయమైన డిజైన్‌తో ఆకట్టుకుంటుంది. బ్యాటరీ సామర్థ్యం ఒక్కటే ఇందులో తక్కువగా ఉంటుంది. 2200 ఎంఎహెచ్ బ్యాటరీ ఉంటుంది. డ్యుయల్ సిమ్ సౌలభ్యం ఉంది. 3జి సపోర్టు చేస్తుంది. వైఫై, జీపీఎస్, ఎఫ్ఎమ్, సెన్సర్లు వంటి ఫీచర్లు ఉంటాయి. 8 మెగాపిక్సెల్ రియర్ కెమెరా, 5 మెగాపిక్సెల్ ఫ్రంట్ కెమెరా ఉన్నాయి.

మైక్రోమ్యాక్స్ కాన్వాస్ జ్యూస్ 2




ఆండ్రాయిడ్ 5.0 లాలీపాప్ ఓఎస్‌పై పనిచేస్తుంది. 5 అంగుళాల డిస్‌ప్లే ఆకట్టుకుంటుంది. 3000 ఎంఎహెచ్ నాన్ రిమూవబుల్ బ్యాటరీ ఉంటుంది. డ్యుయల్ సిమ్ వేసుకోవచ్చు. 3జిని సపోర్టు చేస్తుంది. వై ఫై, బ్లూటూత్, ఎఫ్ఎమ్, జీపీఎస్ ఫీచర్లున్నాయి. 2 జిబి ర్యామ్, 8 జిబి ఇన్‌బిల్ట్ స్టోరేజ్ సామర్థ్యం ఉంటుంది. కావాలంటే 32 జిబి వరకు పెంచుకోవచ్చు. 8 మెగాపిక్సెల్ రియర్ కెమెరా, 2 మెగాపిక్సెల్ ఫ్రంట్ కెమెరా సెల్ఫీలకు ఉపయోగపడుతుంది.

స్వైప్ ఎలైట్



ఆకర్షణీయమైన డిజైన్, నాణ్యమైన 5 అంగుళాల డిస్‌ప్లే ఇందులో ప్రత్యేకతలు. 2జిబి ర్యామ్, 16జిబి స్టోరేజ్, ఎస్‌డీకార్డుతో 32జిబి వరకు పెంచుకునే వెసులుబాటు ఉంటుంది. ఆండ్రాయిడ్ 5.1 వెర్షన్‌పై రన్ అయ్యే ఈ మొబైల్‌లో 2500 ఎంఎహెచ్ రిమూవబుల్ బ్యాటరీ ఉంటుంది. డ్యుయల్ సిమ్‌లు జిఎస్ఎమ్ నెట్‌వర్క్‌ను సపోర్టు చేస్తాయి. వై ఫై, జీపీఎస్, ఎఫ్ఎమ్, 3జి, బ్లూటూత్, సెన్సర్లు వంటి ఫీచర్లున్నాయి.

ఇంటెక్స్ క్లౌడ్ జువెల్



2జిబి ర్యామ్, 5 అంగుళాల డిస్‌ప్లే వంటి ముఖ్యమైన ఫీచర్లున్నాయి. 16 జిబి స్టోరేజ్, ఎస్‌డికార్డు సహాయంతో 32 జిబి వరకు పెంచుకోవచ్చు. 8 మెగాపిక్సెల్ రియర్ కెమెరా, 2 మెగాపిక్సెల్ ఫ్రంట్ కెమెరా వంటి ఫీచర్లున్నాయి. రిమూవబుల్ బ్యాటరీ(2500 ఎంఎహెచ్) ఉంటుంది. ఆండ్రాయిడ్ 5.1 కిట్‌క్యాట్ వెర్షన్‌పై రన్ అవుతుంది.

తస్మాత్ జాగ్రత్త!

కొన్నా.. అమ్మినా.. అది మార్చండి!

ఇటీవలి కాలంలో కొత్త బైక్/కారు కొనుగోలు చేసే కన్నా కొన్నాళ్లు సెకండ్ హ్యాండ్ బైక్/కారు వాడిన తరువాత చూద్దామనుకునే వారు ఎక్కువవుతున్నారు. ఆలోచన మంచిదే కానీ, కొద్ది పాటి జాగ్రత్తలు తీసుకోకపోతే అటు వాహనాలను అమ్మిన వారితో పాటుగా కొన్నవారు కూడా ఇబ్బందులు పడే అవకాశాలున్నాయి.

- అమ్మిన వారికి సమస్య ఏమిటంటే.. ఈ-చలాన్లు వచ్చిన తరువాత వాహనం ఎవరి పేరున ఉంటే వారే వాహన యజమానులు! కాబట్టి ఏమైనా నిబంధనలు అతిక్రమిస్తూ పట్టుబడితే జరిమానా/జైలు శిక్ష పడే అవకాశాలున్నాయి. అందుకే యాజమాన్య హక్కులు వెంటనే మార్చుకోవాలని సూచిస్తున్నారు పోలీసులు.



యాజమాన్య హక్కులు మార్చుకోవాలంటే..

- మీరు ఓ వాహనం కొన్నారంటే మీ పేరు మీద వాహనం రిజిస్టర్ కావడమనేది చట్టపరంగా ముఖ్యం. దీనికోసం దగ్గరలోని ఆర్‌టీఓ (రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ) కార్యాలయానికి వెళ్లి సరైన డాక్యుమెంట్లను సమర్పించాల్సి ఉంటుంది.
- యాజమాన్య హక్కులను మారుస్తామంటూ ఆర్‌టీఓ ఆఫీసుల దగ్గర మధ్యవర్తులు కూడా కనిపిస్తుంటారు కానీ మీరు స్వయంగా వెళ్తే ఖర్చు తక్కువవుతుంది.
- యాజమాన్య హక్కులను మార్చుకోవడానికి అవసరమైన పత్రాలలో ఒరిజినల్ ఆర్‌సీ, వాహన బీమా డాక్యుమెంట్, పొల్యూషన్ సర్టిఫికెట్, వాహనం అమ్మిన వ్యక్తి ఐడీ ప్రూఫ్, ఫార్మ్ 29, ఫార్మ్ 30 (రెండు కాపీలు- అమ్మకందారునితో పాటుగా కొనుగోలుదారుడు కూడా సంతకం చేసి ఉండాలి), కనీసం 10 రూపాయల బాండ్ పేపర్‌పై అమ్మిన వ్యక్తి, కొన్న వ్యక్తి చేసుకున్న ఒప్పందంతో అఫిడవిట్, కొనుగోలుదారుని ఐడీ ప్రూఫ్, చిరునామా, పాన్‌కార్డు (4 వీలర్ అయితే) ఉంటాయి. వీటిని అప్లికేషన్‌తో పాటుగా నిర్దేశిత ఫీజుతో కలిపి ఆర్‌టీఓ ఆఫీస్‌లో అందజేస్తే, పరిశీలించి యాజమాన్య హక్కులు మారుస్తారు.

వినూత్నం

సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు చేయాలన్న ఆ ఇంజనీరింగ్ విద్యార్థి ప్రయత్నాలు ఒక్కొక్కటి ఫలితాలనిస్తున్నాయి. ఇంధనం లేకుండా పనిచేసే జనరేటర్, అతి తక్కువ విద్యుత్‌తో నడిచే ఏసీ, బ్యాటరీతో నడిచే టూ వీలర్...అన్నీ ఆయన ఆవిష్కరణలే. అతని పేరు డింగు ప్రదీప్‌కుమార్‌రెడ్డి. పదోతరగతి నుంచే ప్రయోగాల బాట పట్టిన అతనితో ఆ ప్రయోగాల ప్రయాణం గురించి 'నవ్య' ముచ్చటించింది.

యువ ప్రయోగ శీలి



అక్క కోసం ఓ వాహనం కొనాలని ఇంట్లో అనుకున్నప్పుడు పెట్రోలు ఖర్చులేని బ్యాటరీ బండి తీసుకుంటే పర్యావరణానికి మేలు కదా అన్నాను. దానివల్ల పెద్దగా ఉపయోగం వుండదని, ఒకసారి చార్జింగ్ చేసుకుని సిటీలోకి వెళ్లిరాలేమని ఆమె నిరాకరించింది. అప్పుడు పదో తరగతి చదువుతున్నాను. ఆ సమస్యకు పరిష్కారం కనుగొనాలనే ఆలోచన ఆ క్షణంలోనే మొదలైంది.

ఆరో తరగతి నుంచే..

ఆరో తరగతి నుంచి స్కూల్ స్థాయిలో నిర్వహించే వైజ్ఞానిక ప్రదర్శనల్లో ఉత్సాహంగా పాల్గొనేవాడిని. ప్రతి ప్రదర్శనలోనూ వచ్చే బహుమతులు నాలో ఆసక్తిని మరింత పెంచేవి. అలా కొత్త ప్రాజెక్టులపై మక్కువ పెంచుకుంటూ వచ్చాను. ఇంట్లో ఎన్నో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ పరికరాలు రిపేర్ చేసేవాడిని. ఈ క్రమంలో కొన్ని ప్రయోగాలు సక్సెస్ అయితే మరికొన్ని ఎందుకూ పనికి రాని చెత్తగా మిగిలిపోయేవి.

నిరంతరాయంగా ఛార్జింగ్!

బ్యాటరీ వాహనాలు సక్సెస్ కాకపోవడానికి ఛార్జింగ్ ప్రధాన సమస్య. వేగం తక్కువ వుండడంతో పాటు యాభై కిలోమీటర్లు ప్రయాణించాలంటే కష్టం. నగరాల్లో పనుల నిమిత్తం వెళ్లి వచ్చేవారు అంతకంటే ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వస్తుంది. దీంతో ఆ వాహనాలు తీసుకునేందుకు ఆసక్తి చూపరు. ఈ సమస్యకు పరిష్కారం చూపితే పర్యావరణ వాహనాలు విస్తృతం అవుతాయనే సంకల్పంతో రెండేళ్ల పాటు ప్రయోగాలు చేసి ఒక సర్క్యూట్‌ను తయారు చేశాను. ఇందులో ఒక బ్యాటరీలో మిగులు విద్యుత్ సర్క్యూట్ ద్వారా ప్రయాణించి మరో బ్యాటరీని చార్జ్ చేస్తుంది. రెండు బ్యాటరీలు ఛార్జ్ అవుతుండడం వల్ల వాహనం ఏకధాటిగా ప్రయాణించేందుకు వీలుంటుంది. ఇందుకోసం రూ.ఐదు వేలు అదనంగా ఖర్చవుతుంది. ఈ 'బ్యాక్ ఈఎంఎఫ్' కాన్సెప్ట్‌లో ఎనభై శాతం విద్యుత్ ఖర్చయితే...నలభై శాతం మళ్లీ రీఛార్జ్ అవుతుంది. ఈ ప్రాజెక్టులోనూ కొన్ని లోపాలు ఉన్నాయి. వాటిని అధిగమించేందుకు యత్నిస్తున్నాను. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పేటెంట్ కోసం ఇప్పటికే దరఖాస్తు చేశాను.

ఇంధన రహిత జనరేటర్...

అలాగే విద్యుత్ విషయంలో మరో కొత్త ప్రయోగం చేశాను. ఫ్లై వీల్ ఎనర్జీ కాన్సెప్ట్‌తో ఇంధనరహిత జనరేటర్ తయారుచేశాను. దీనిని ఇన్వర్టర్‌గా పేర్కొనవచ్చు. విశాఖను అతలాకుతలం చేసిన హుద్‌హుద్ తుపాను సమయంలో విద్యుత్‌పరంగా ఎదుర్కొన్న సమస్యే అటువైపుగా నడిపించింది. అప్పుడు నగరంలో ఉన్న ఇన్వర్టర్లు రెండు, మూడు గంటల్లోనే ఛార్జింగ్ అయిపోవడంతో వృథాగా మిగిలాయి. అందుకే నిరంతరాయంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేసే పరికరాన్ని రూపొందించాను. ఒక కేవీఏ విద్యుత్‌ను ఉత్పత్తి చేసే ఈ ఇన్వర్టర్ కోసం ఎన్నో ప్రయోగాలు చేయాల్సి వచ్చింది. వన్ హెచ్‌పీ మోటారు రొటేట్ అయ్యేందుకు 12 వోల్టుల బ్యాటరీని వినియోగించాను. ఫ్లైవీల్‌కు మోటారును అనుసంధానం చేశాను. బెల్ట్ ద్వారా ఫ్లైవీల్‌ను రన్ చేసి ఆల్టనేటర్‌కు (జనరేటర్) కలిపాను. మోటారు రొటేట్ కావడం వల్ల మెకానికల్ ఎనర్జీ నుంచి ఎలక్ట్రికల్ ఎనర్జీ తయారవుతుంది. దానిని మరో బ్యాటరీకి కలపడం వల్ల అది ఛార్జ్ అవుతుంది. అక్కడి నుంచి తొలి బ్యాటరీకి కనెక్షన్ ఇవ్వడం వల్ల ఛార్జింగ్ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుంది. ఒకసారి పూర్తిగా ఛార్జ్ అవడానికి 45 నిమిషాల సమయం పడుతుంది. దానివల్ల వచ్చే విద్యుత్‌తో నాలుగు ఫ్యాన్లు, నాలుగు ట్యూబ్‌లు వెలిగించుకోవచ్చు. ఇందుకయ్యే ఖర్చు సుమారు రూ.పదిహేను వేలు. దీని పేటెంట్ కోసం కూడా దరఖాస్తు చేస్తున్నాను.

సగం ఖర్చుకే ఏసీ...

నేను చేసిన మరో ప్రయోగం ఏసీ గురించి! ఇటీవల కాలంలో ఏసీ వినియోగం సర్వసాధారణమైపోయింది. ఒకప్పుడు ఉన్నత వర్గాలకే పరిమితం అనుకున్న ఏసీలు ఇప్పుడు మధ్యతరగతి ఇళ్లలోనూ దర్శనం ఇస్తున్నాయి. ఈ కారణంగా విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతోంది. అందుకే తక్కువ విద్యుత్‌తో ఏసీ పనిచేసేలా యూనిట్‌ను డిజైన్ చేశాను. సాధారణ ఏసీల కన్నా..ఇది యాభై శాతం తక్కువ విద్యుత్‌ను తీసుకుంటుంది. సాధారణంగా ఏసీల్లో గంటకు రెండు యూనిట్లు ఖర్చు అవుతుంది. నేను డిజైన్ చేసిన కంప్రెషర్ ద్వారా గంటకు ఒక యూనిట్ మాత్రమే ఖర్చయ్యేలా రూపొందించాను. ఇందుకోసం ఎనిమిది నెలల నుంచి కసరత్తు చేసి సొంత కంప్రెషర్‌ను రూపొందించాను. ఇంకా మెరుగైన పనితీరు కోసం ప్రయత్నాలు చేస్తున్నాను. అవి కూడా పూర్తి చేసి పేటెంట్‌కు దరఖాస్తు చేయాలనుకుంటున్నాను.

ఎన్నో నిద్రలేని రాత్రులు!

ఈ ప్రయోగాల వల్ల ఎన్ని నిద్రలేని రాత్రులు గడిపానో నాకే.. తెలియదు. ప్రస్తుతం గొన్నా ఇంజనీరింగ్ కళాశాలలో 'ఈఈఈ' చదువుతున్నాను. నాన్న సుదర్శన రెడ్డి స్టీల్‌ప్లాంట్‌లో ఫోర్‌మెన్. నన్ను ఒక శాస్త్రవేత్తగా చూడాలని నాన్న కలలు కంటున్నారు. నా ఇన్నేళ్ల శ్రమకు తగ్గ ఫలితం ఇప్పుడిప్పుడే వచ్చింది. డీఆర్‌డీవో లాంటి ప్రతిష్ఠాత్మక సంస్థకు చెందిన శాస్త్రవేత్తలు నా ప్రాజెక్టులను ప్రశంసించి సర్టిఫికెట్ అందజేశారు. సమాజానికి ఉపయోగపడే ప్రయోగాలు భవిష్యత్తులో మరిన్ని చేస్తాను.

- వాసు, విశాఖపట్నం
ఫొటోలు: సాంబశివరావు

డైలీ సుడోకు - 155

			8	9		7		4
7					4			
2		9		6			8	
		6						
	3	1				4	9	
						8		
	1			4		6		2
			7					3
9		2		5	6			

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

నిన్నటి సుడోకు- 154 సమాధానం

[illegible]

నివేదన

గృహస్థ ధర్మం

భారతీయ గృహస్థ ధర్మం చాలా గొప్పది. దాన్ని పావురాల కథ మనకు ఎంతో స్ఫూర్తిదాయకంగా చెప్తుంది. ఒక బోయవాడు వేటకు వెళ్లి చాలా పక్షులను పట్టుకున్నాడు. ఎక్కువ పక్షులను పట్టుకున్న ఆనందంతో ఆ బోయవాడు ఇంటి ముఖం పట్టాడు. కానీ హఠాత్తుగా కుంభవృష్టి మొదలైంది. దారిలో ఉన్న పెద్ద మర్రిచెట్టు నీడన వెళ్లి నిల్చున్నాడు. ఆ చెట్టు తొర్రలో పావురాల జంట ఒకటి నివసిస్తోంది. అందులోని ఆడ పావురం ఆహార నిమిత్తం బయటకు వెళ్లింది. ఒక్క మగపావురం మాత్రమే ఆ గూట్లో ఉంది. ఇంత వర్షంలో తన ఆడపావురం ఎన్ని కష్టాలు పడుతుందోనని మగపావురం ఆందోళన పడుతోంది. అయితే బోయవాడు పట్టుకున్న పక్షుల్లో ఆడపావురం కూడా ఉంది. భర్త ఆందోళనను గ్రహించిన ఆడపావురం మగనికి తనపై ఉన్న ప్రేమకు మురిసిపోయింది. నా జన్మ ధన్యమైందనుకుంది. తాను చెట్టుకింద ఉన్న బోయవాడి వలలోనే చిక్కుకున్నట్టు మగపావురానికి తెలిపింది. చెట్టు కింద ఉన్న బోయవాడు బాగా చలితో, వర్షంతో వణికిపోతున్నాడు. అతడిని చూసి మగపావురం 'నువ్వు మా చెట్టుకింద సేదదీరుతున్నావు. నీవు మా అతిథివి. నిన్న గౌరవించడం మా విధి' అంటూ చెట్టుకింద ఉన్న కొన్ని పుల్లలు ఏరుకొచ్చి మంటను రాజేసింది. ఆ మంటతో చలి తగ్గి బోయవాడు సేదదీరాడు.

మరి కాసేపటికి అతనికి ఆకలి వేయడం మొదలైంది. వెంటనే ఆ బోయవాడు చెట్టు మీద ఉన్న మగపావురంతో 'నాకు బాగా ఆకలిగా ఉంది. మీ గృహస్థ ధర్మం ప్రకారం నా ఆకలి తీర్చవా!' అని అడిగాడు. మా ఆహారం మీరు తినలేరు. కానీ గృహస్థ ధర్మం ప్రకారం నీ ఆకలిని తీర్చడం మా విధి. అలా చేయకపోతే నీ వలలో ఉన్న నా ఇల్లాలు కూడా బాధపడుతుంది. మీరు పక్షులను తింటారు కదా! ఈ మంటల్లో నేను కాలిపోతాను. నన్ను తిను అంటూ మంటల్లో దూకింది. అది చూసి బోయవాడు విస్తుపోతాడు. ఆ పక్షి చూపిన గృహస్థ ధర్మానికి ఆశ్చర్యచకితుడవుతాడు. మగపావురం మంటల్లో దూకడం చూసిన ఆడపావురం భర్త మరణించిన తర్వాత తన జీవితం వ్యర్థమని, ఎలాగూ బోయవాడు ఇంటికి తీసుకెళ్లి తనను చంపుతాడని..... తాను కూడా ఈ మంటల్లోనే పడి మరణించడం మంచిదని తలచి నిప్పుల్లో దూకింది. గృహస్థ ధర్మానికి పక్షులు ఇంత ప్రాధాన్యం ఇవ్వడం.... మానవుడనై ఉండి తన ప్రవర్తన అందుకు భిన్నంగా ఉండడం అతన్ని కలిచివేసింది. అలా అడవిలో బోయవాడు నడిచివెడుతుండగా హఠాత్తుగా దావాగ్ని సంభవించింది. ఆ దావాగ్నిలో పడి బోయవాడు మరణించాడు. ఈ పావురాల కథ మనకు చెపుతున్న నీతి ఏమిటంటే భార్యాభర్తల దాంపత్య, గృహస్థ ధర్మాలతోపాటు అతిథి.. అభ్యాగతులకు సంబంధించిన భారతీయ సంప్రదాయం ఎంతో గొప్పది. ఈనాటి ప్రజలు ఈ నీతిని తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

క్విక్ డిష్

మసాలా స్వీట్‌కార్న్



స్వీట్ కార్న్ కండెలు- 3 (లేతగా ఉన్నవి)
నెయ్యి- 1 టీస్పూన్. **ఉప్పు-** రుచికి తగినంత
గరం మసాలా- పావు టీస్పూన్

తయారీ విధానం

స్వీట్‌కార్న్ గింజలను మరీ మెత్తగా కాకుండా ఉడకబెట్టాలి. తర్వాత ఓ ప్యాన్ తీసుకుని నెయ్యి వేయాలి. అందులో మొక్కజొన్న గింజలను వేసి కలియబెట్టాలి. ఆ తర్వాత గింజలు గట్టిగా ఉన్నాయనుకుంటే అందులో కాసిని నీటిని చిలకరిస్తూ గరిటెతో కలియబెట్టాలి. ఆ తర్వాత ఉప్పు, గరం మసాలా వేసి బాగా మిక్స్ చేయాలి. ఆ తర్వాత పేపర్ కప్పుల్లో వేసుకోవాలి. సాయంకాలం పూట సరదాగా ఈ యమ్మీ స్వీట్‌కార్న్‌ను తింటే ఆ మజాయే వేరు.

మీకు మీరే డాక్టర్

తంగేడుతో తగ్గే వ్యాధులు



- తంగేడు పూలను నీడలో ఎండబెట్టి చూర్ణం చేసి, దానికి సమానంగా ఖండ చక్కెర కలపాలి. ఈ మిశ్రమాన్ని ఒక తులం చొప్పున, రోజూ రెండు పూటలా సేవిస్తే, అతి మూత్ర వ్యాధి తగ్గుతుంది. ఈ సమస్య నివారణకు తంగేడు గింజల చూర్ణాన్ని కూడా వాడవచ్చు.
- తంగేడు వేళ్లను నీడలో ఎండించి చూర్ణం చేసి, ఒకటి రెండు చెంచాల చొప్పున రోజుకు ఒకసారి నీటితో తీసుకుంటే, శరీరంలోని హానికారకమైన 20 రకాల ప్రమేహాలు తగ్గుతాయి. బాగా ముదిరిన కాండపు జిగురు చూర్ణం, మధుమేహ నియంత్రణలో మరింత సమర్థవంతంగా పనిచేస్తుంది.
- తంగేడు ఆకులను నీటిలో ఉడికించి కషాయం చేసి, ఆ కషాయానికి సమంగా చక్కెర కలిపి పానకంలా వండాలి. ఈ పానకాన్ని 30 మి. లీటర్ల మోతాదులో రోజూ మూడు పూటలా తాగితే, చెమటకాయలు తగ్గుతాయి. ఈ ద్రావణం ఎండాకాలం సేవిస్తే శరీరం చలువ చేస్తుంది. అలాగే, తంగేడు ఆకులు ఐదు భాగాలు, మెంతులు ఒక బాగం తీసుకుని మజ్జిగలో మెత్తగా నూరి, తల మీద ఉంచి దాని మీద ఆముదపు ఆకు ఉంచాలి. ఆ పైన ఒక గంట తర్వాత స్నానం చేస్తే సెగలు పొగలుగా అనిపించే శరీరం చల్లబడుతుంది.
- లేత తంగేడు ఇగుళ్లను గుడ్డలో వేసి కడితే, తలనొప్పి, తలపోటు, సాధారణ కంటి సమస్యలూ తగ్గుతాయి.
- ఎండిన తంగేడు పూల కషాయాన్ని రోజుకు ఒక పూట చొప్పున నెలరోజుల పాటు తాగితే, తెల్ల బట్ట సమస్య తొలగిపోతుంది.

చెడు ఎక్కడ లేదో చెప్పండి

\- అర్జున్



కుమార్తె ఐశ్వర్యతో అర్జున్

'లై' చిత్రంలో విలన్‌గా తొలిసారి కనిపించి మెప్పించిన సీనియర్ నటుడు అర్జున్.. ఇప్పుడు తన పెద్ద కుమార్తె ఐశ్వర్య హీరోయిన్‌గా ఒక ద్విభాషా చిత్రాన్ని డైరెక్ట్ చేస్తున్నారు. ఇంకో నాలుగైదు రోజులు షూటింగ్ చేస్తే ఆ సినిమా పూర్తయిపోతుంది. "ఎవరైనా తమ పిల్లల్ని ప్రమోట్ చేయాలని చూస్తుంటారు కదా. నాతో కొంతమంది అన్నారు.. 'మీ అమ్మాయిని ఈ ఇండస్ట్రీలోకి తెచ్చారేంటి?' అని. నేను ఈ ఇండస్ట్రీలో 37 సంవత్సరాలుగా ఉంటున్నా. నాకే నా ఇండస్ట్రీపై నమ్మకం లేకపోతే బయటివాళ్లు సినిమాల్లోకి ఎలా వస్తారు?" అని ఆయన ప్రశ్నిస్తారు. మంచి, చెడు అనేవి ఎక్కడైనా ఉంటాయనేది అందరికీ తెలిసిన సత్యమే. "చెడు ఎక్కడ లేదో చెప్పండి! మీరు దేన్ని ఎంచుకుంటారనేదే ప్రధానం. ఎలాంటి సినిమాని నేను తీస్తున్నానో ఆ సినిమా చూశాక మీకే తెలుస్తుంది! నటిగా మంచి పేరు రావడానికి తగ్గట్లు ఆ పాత్రను ఎలా తీర్చిదిద్దానో, ఆమె చేత ఎలా నటింపజేశానో చూస్తారు. అందర్నీ ఆ సినిమా ఆశ్చర్యపరుస్తుంది" అని చెప్పారు అర్జున్. ఇది ఐశ్వర్యకు రెండో సినిమా. ఇదివరకు ఆమె విశాల్ సరసన 'పట్టత్తు యానై' (2013) సినిమా ద్వారా నాయికగా పరిచయమైంది. ఆ సినిమా తెలుగులో 'ధీరుడు' పేరుతో వచ్చింది కూడా. "అది సరిగా ఆడకపోవడంతో ఆమెకు బ్రేక్ రాలేదు. నేనే కొంత కాలం ఆమెను ఆగమని, మంచి ప్రెజెంటేషన్‌తో ఇప్పుడు 'కాదలిన్ పొన్ వీదిలిన్'తో ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నా. కన్నడంలో ఈ చిత్రం 'ప్రేమ బరహ' పేరుతో వస్తుంది. ఇది వండర్‌ఫుల్ లవ్ స్టోరీ. చందన్‌కుమార్ హీరో. మా రెండో అమ్మాయి అంజన న్యూయార్క్‌లో 'మార్కెంటింగ్ ఇన్ ఫ్యాషన్' కోర్సు చదువుతోంది. తనకు అది ఇంటరెస్ట్" అని అర్జున్ తెలిపారు.

ప్రియాంక.. యంగ్ అండ్ ఫ్రీ!



ఏ పని చేస్తే ఆ పనిలో పర్‌ఫెక్షన్ సాధించడంలో ప్రియాంకా చోప్రాను మించిన తార మరొకరు లేరు. నటిగా, నిర్మాతగా, గాయనిగా రాణించడం ఆమెకే చెల్లింది. ప్రస్తుతం ఆమె తన గాన ప్రతిభను మరోసారి సంగీత ప్రియులకు రుచి చూపించేందుకు సిద్ధమవుతోంది. అంతర్జాతీయంగా పేరుపొందిన డిస్క్ జాకీ విల్ స్పార్క్స్‌తో కలిసి ఆమె రూపొందిస్తోన్న 'యంగ్ అండ్ ఫ్రీ' సింగిల్ త్వరలోనే బయటకు రానుంది. "నా జీవితంలోని అత్యంత అస్థిరమైన కాలంలో ఈ పాటను రాశాను. స్వేచ్ఛ కావాలనే ఆశయం నుంచి ఈ సాహిత్యం పుట్టింది. ఈ క్రేజీ వరల్డ్‌లో మనుగడ సాగించాలంటే యంగ్‌గా, స్వేచ్ఛగా ఉండాలనే మానసిక స్థితి మనందరికీ అవసరం. విల్ స్పార్క్స్ సమకూర్చిన ట్రాక్ నాకు బాగా నచ్చింది. నా రాతలకు భావోద్వేగభరితమైన బాణీలను మేళవించి మంచి పాట రూపొందించాడు. సంగీతం రూపొందించడమంటే నాకెంతో ఇష్టమో ఈ పాట నాకు గుర్తు చేసింది" అని తెలిపింది ప్రియాంక. ప్రస్తుతం ఆమె హాలీవుడ్‌లో 'ఈజ్ నాట్ ఇట్ రొమాంటిక్', 'ఏ కిడ్ లైక్ జేక్' సినిమాల్లో నటిస్తోంది.



లావణ్యా త్రిపాఠీ

గ్లామర్ డోస్ పెంచిందా?

ఉత్తరాది నుంచి ఎక్కువమంది హీరోయిన్లు దిగుమతి కావడంతో తెలుగు పరిశ్రమలో రోజురోజుకీ హీరోయిన్ల మధ్య పోటీ పెరుగుతోంది. దానికి తగ్గట్టే నేటితరం నాయికలు వీలైనంత అందంగా కనిపించడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ మధ్యకాలంలో లావణ్యా త్రిపాఠీ కాస్త గ్లామర్ డోస్ పెంచిందనే వార్త సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఆ విషయాన్నే ఆమె ముందుంచితే ఇలా సమాధానమిచ్చింది. "నేను మోడలింగ్ చేసి వచ్చా. సమయాన్నిబట్టి ఎక్కడ ఎలా ఉండాలో నాకు తెలుసు. అలాగని ఓవర్ ఎక్స్‌పోజ్ చెయ్యను. ఈ మధ్యకాలంలో రెండు అవార్డు ఫంక్షన్‌లలో ఫ్యాషన్ షో, ర్యాంప్ వాక్ ఉండటంలో కాస్త గ్లామర్ డ్రెస్‌లో వెళ్లాల్సి వచ్చింది. అంతే కానీ స్కిన్ షో చెయ్యాలని కాదు. సినిమాల్లో క్యారెక్టర్ డిమాండ్ మేరకు చేసుకుంటూ వెళ్తా కానీ హద్దులు దాటను" అని చెపుకొచ్చింది. ప్రస్తుతం 'యుద్ధం శరణం' సినిమాతోపాటు, వినాయక్ దర్శకత్వంలో సాయిధరమ్ తేజ్ సరసన జత కట్టిందీ డెహ్రాడూన్ సుందరి.



ప్రభాస్, తాప్సీ

కాన్సెప్ట్ కొత్తగా అనిపించింది

- ప్రభాస్

“దెయ్యానికి మనుషులు భయపడతారన్నది మనకు తెలిసిందే. దెయ్యం మనుషులకు భయపడటమన్న కాన్సెప్ట్ వినగానే కొత్తగా అనిపించింది” అని ప్రభాస్ అన్నారు. తాప్సీ కీలక పాత్ర పోషిస్తున్న చిత్రం ‘ఆనందో బ్రహ్మ’. మహి వి.రాఘవ్ దర్శకుడు. విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మాతలు. ఈ నెల 18న విడుదలకు సిద్ధమవుతోన్న ఈ చిత్రం ప్రీ రిలీజ్ కార్యక్రమం సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ప్రభాస్ మాట్లాడుతూ “విజయ్ నాకు మిత్రుడు. ఎప్పుడూ సినిమాల గురించే మాట్లాడతాడు. ‘ఆనందో బ్రహ్మ’ ప్రచార చిత్రాలు బావున్నాయి. ఇందులో తాప్సీ రూపంలో అందమైన దెయ్యాన్ని చూడొచ్చు” అని అన్నారు. “ఏదన్నా సాధించాలంటే తప్పకుండా సాహసం చెయ్యాలి. నా వరకూ ‘ఆనందో బ్రహ్మ’ ఓ సాహసం. కచ్చితంగా మంచి ఫలితాన్నిస్తుందన్న నమ్మకం ఉంది” అని తాప్సీ చెప్పారు. దర్శకుడు మహి మాట్లాడుతూ “శరీరం ఆత్మ కలిస్తే మనుషులు అవుతారు. శరీరం లేని ఆత్మ మనుషుల్ని ఏమీ చెయ్యలేదని చెప్పే ప్రయత్నం చేశాం.” అని తెలిపారు.

జోడీ కుదిరింది

‘బాహుబలి 2’ తర్వాత హీరోగా ప్రభాస్ నటిస్తోన్న చిత్రం ‘సాహో’. సుజిత్ (‘రన్ రాజా రన్’ ఫేమ్) దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రంలో నాయికగా బాలీవుడ్ తార శ్రద్ధా కపూర్ నటించనున్నారు. ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ యు.వి. క్రియేషన్స్ తెలిపింది. “సాహో చిత్రంలో బ్యూటిఫుల్ శ్రద్ధా కపూర్ నాయికగా నటిస్తోందని తెలియజేయడానికి సంతోషంగా ఉంది. ‘సాహో’ కుటుంబంలోనికి ఆమెకు స్వాగతం” అని తన అధికారిక ట్విట్టర్ ఖాతా ద్వారా ప్రకటించింది. భారీ బడ్జెట్‌తో రూపొందుతోన్న ఈ సినిమా షూటింగ్ జూన్‌లోనే మొదలైంది. నాయికతో నిమిత్తం లేని సన్నివేశాల్ని ఇప్పటి వరకూ చిత్రీకరించారు. ఇందులో నాయికగా పలువురి పేర్లు వినిపించాయి. ఎట్టకేలకు శ్రద్ధ ఖరారయ్యారు. తెలుగులోనే కాదు, దక్షిణాదిలోనే ఆమెకు ఇది తొలి చిత్రం. వచ్చే నెలలో ఆమె ‘సాహో’ సెట్స్‌కు రానున్నట్లు సమాచారం. ప్రస్తుతం హిందీలో ఆమె టైటిల్ రోల్ పోషించిన ‘హసీనా పార్కర్’ సినిమా సెప్టెంబర్‌లో విడుదలవుతోంది. ‘సాహో’ షూటింగ్ హైదరాబాద్‌తో పాటు ముంబై, దుబాయ్‌లలో ఎక్కువగా జరగనుంది. బాలీవుడ్ నటుడు నీల్‌నితిన్ ముఖేశ్ విలన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి శంకర్-ఎహసాన్-లాయ్ సంగీతం సమకూరుస్తున్నారు. వచ్చే ఏడాది ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.





స్వాతి, రక్షిత్

ఓ లండన్ బాబు కథ

‘సినిమా జీవితాన్ని పెద్దగా చూపిస్తే, టీవీ చిన్నగా చూపిస్తుంది. కానీ జీవితాన్ని జీవితంగా చూపెట్టేది నాటకం మాత్రమే. ఈ సినిమా టీజర్, సాంగ్ చూస్తుంటే నాకు నాటకాల్లో పనిచేసిన రోజులు గుర్తుకు వచ్చాయి. నిర్మాతగా మారుతిగారు నాకు ఇన్‌స్పిరేషన్. కొత్త కాన్సెప్ట్ సినిమాలు ఆడితేనే కొత్త నటీనటులు, టెక్నీషియన్లు రావడానికి ఆసక్తి చూపిస్తారు. అందుకే ‘లండన్‌బాబులు’ చిత్రం హిట్ కావాలని కోరుకొంటున్నాను’ అన్నారు దర్శకుడు హరీశ్‌శంకర్. ఏవీఎస్ స్టూడియో సమర్పణలో మారుతి టాకీస్ సంస్థ నిర్మించిన ‘లండన్‌బాబులు’ చిత్రంలోని తొలి పాటను మంగళవారం ఆయన విడుదల చేశారు. రక్షిత్, స్వాతి జంటగా రూపొందిన ఈ సినిమాకి చిన్నికృష్ణ దర్శకుడు. తమ్మారెడ్డి భరద్వాజ స్పెషల్ టీజర్‌ను రిలీజ్ చేశారు. మారుతి మాట్లాడుతూ వచ్చే నెల మొదటి వారంలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. తమిళంలో వచ్చిన ‘ఆండవన్ కట్టళై’ సినిమాని స్వీట్ మ్యాజిక్ ప్రసాద్‌గారు చూడమన్నారు. నాకు బాగా నచ్చింది. రక్షిత్‌కు ఇది మంచి సినిమా అవుతుంది. స్వాతికి కథ నచ్చి చేస్తానని చెప్పింది. మాములుగా నేను నిర్మించే సినిమాలకు పేరు వేసుకోవడానికి చాలా ఆలోచిస్తాను. కానీ నాకు బాగా నచ్చడంతో పేరు వేసుకొన్నాను’ అని తెలిపారు.

‘ప్రతిక్షణం’ ఏం జరిగింది?

శ్రీ భాగ్యలక్ష్మీ మూవీ మేకర్స్ పతాకంపై జి.మల్లికార్జున రెడ్డి నిర్మించిన చిత్రం ‘ప్రతిక్షణం’. నాగేంద్రప్రసాద్ దర్శకుడు. మనీశ్‌బాబు, తేజస్విని జంటగా నటించారు. ఈ నెల 18న విడుదల కానుంది. నిర్మాత మాట్లాడుతూ “మా సినిమా చూసే ప్రేక్షకులు థ్రిల్ అవుతారు. తప్పకుండా అందరికీ నచ్చుతుంది” అని చెప్పారు. అత్యధిక థియేటర్లలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్టు తుమ్మలపల్లి రామసత్యనారాయణ చెప్పారు.



మనీశ్‌బాబు, తేజస్విని

టీవీఎస్ రూ.450 కోట్ల పెట్టుబడులు

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 450 కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టనున్నట్లు టీవీఎస్ మోటార్ వెల్లడించింది. ఉత్పత్తి సామర్థ్యాన్ని ఏటా 45 లక్షల యూనిట్లకు పెంచటంతో పాటు ఇతర కార్యకలాపాల కోసం ఈ మొత్తాలను వెచ్చించనున్నట్లు తెలిపింది. అంతేకాకుండా రానున్న పండగల సీజన్‌లో ప్రస్తుత ప్రొడక్ట్ పోర్టుఫోలియోలో కొత్త వేరియెంట్లను విడుదల చేయాలని కంపెనీ భావిస్తోంది. ఉత్పత్తి సామర్థ్యం పెంపు, ఆర్ అండ్ డి కార్యకలాపాల విస్తరణ కోసం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 450 కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టనున్నట్లు టీవీఎస్ మోటార్స్ సిఎఫ్ఒ, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఎస్‌జి మురళి చెప్పారు. అలాగే ప్రస్తుతం కంపెనీ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 40 లక్షల యూనిట్లుగా ఉండగా దీన్ని 45 లక్షలకు పెంచాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. టీవీఎస్ మోటార్స్‌కు కర్ణాటకలోని మైసూర్, తమిళనాడులోని హోసూర్, హిమాచల్ ప్రదేశ్‌లోని నలగార్హ్ వద్ద మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్లు ఉన్నాయి.

తొండి వ్యాపారంతో ముంచుతున్న చైనా



అమెరికాకు లక్షల ఉద్యోగాల గల్లంతు... వేల కోట్ల డాలర్ల నష్టం

- ట్రంప్ ఆరోపణ.. దర్యాప్తునకు ఆదేశాలు
- చూస్తూ కూర్చోమని హెచ్చరించిన చైనా

వాషింగ్టన్ : అమెరికా, చైనా మధ్య ప్రచ్ఛన్న వాణిజ్య యుద్ధం రాజుకుంటున్నది. చైనా దగాకోరు వాణిజ్య విధానాలతో అమెరికాను నిలువు దోపిడీ చేస్తోందనీ, మేధో సంపత్తి హక్కుల చౌర్యంతో లక్షల కోట్ల డాలర్ల మేర తమను ముంచేస్తోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోపించారు. చైనా అక్రమ వాణిజ్య పద్ధతులు, మేధో హక్కుల చౌర్యం వ్యవహారాలపై సమగ్ర దర్యాప్తునకు ట్రంప్ ఆదేశాలు జారీ చేశారు. ట్రంప్ ఆదేశాల మేరకు అమెరికా వాణిజ్య ప్రతినిధి రాబర్ట్ లైట్జర్, చైనా వాణిజ్య విధానాలు, పద్ధతులు, వాటి వల్ల అమెరికాకు వాటిల్లుతున్న నష్టం, అమెరికాకు చెందిన మేధో హక్కులను చైనా కంపెనీలు చౌర్యం చేస్తున్నాయన్న ఆరోపణలపై దర్యాప్తు జరుపుతారు. అవసరాన్ని బట్టి తమ దేశ వాణిజ్య, పారిశ్రామిక రంగాల ప్రయోజనాల రక్షణకు చర్యలను కూడా తీసుకుంటామని లైట్జర్ చెప్పారు. అమెరికా చర్యతో చైనా తీవ్రంగా మండిపడింది. తాము చేతులు ముడుచుకొని కూర్చోమని కూడా హెచ్చరించింది. రెండు దేశాల మధ్య ఇప్పటికే తీవ్ర స్థాయిలో ఉద్రిక్తతలు రగులుతున్న విషయం తెలిసిందే. చైనా ప్రియ నేస్తం ఉత్తర కొరియా రకరకాల విన్యాసాలతో అమెరికాను అదే పనిగా కవ్విస్తోంది. ఈ నేపథ్యంలో ట్రంప్ తాజా చర్య ప్రాధాన్యత సంతరించుకుంది.

ఆర్థిక రంగానికి భారీ నష్టం

చైనా వ్యవహారాలపై దర్యాప్తునకు ఆదేశించడాన్ని ట్రంప్ గట్టిగా సమర్థించుకున్నారు. విదేశాలు తమ మేధో హక్కులను దొంగిలిస్తున్న కారణంగా ఏటా తమ దేశంలో లక్షల సంఖ్యలో ఉద్యోగాలు గల్లంతవుతున్నాయనీ, లక్షల కోట్ల డాలర్ల మేర నష్టపోతున్నామని ట్రంప్ ప్రకటించారు. ఏళ్లుగా ఈ దారుణం జరుగుతున్నా, గత ప్రభుత్వాలు ఏలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన తీవ్రంగా విమర్శించారు. అందుకే తాను, మేధో హక్కుల చౌర్యం, అమెరికా టెక్నాలజీని బలవంతంగా బదిలీ చేయించుకోవడంలో చైనా వినియోగిస్తున్న విధానాలు, పద్ధతులపై సమగ్రవిచారణ జరపాలని ట్రేడ్ రిప్రెజెంటేటివ్‌ను ఆదేశించినట్టుగా ట్రంప్ తెలిపారు. అక్రమ వ్యాపార పద్ధతులు, దుష్టచర్యల వల్ల నష్టపోకుండా అమెరికా కార్మికులను, టెక్నాలజీని, పారిశ్రామిక రంగాన్ని కాపాడాల్సిన బాధ్యత దేశ అధ్యక్షునిగా తనపై ఉందని ట్రంప్ పేర్కొన్నారు. తమ మార్కెట్లోకి ప్రవేశం కల్పించాలంటే అమెరికా కంపెనీలు వాటి అమూల్యమైన టెక్నాలజీని బదిలీ చేయాల్సిందేనని అక్రమంగా, చట్టవ్యతిరేకంగా బలవంత పెట్టే దేశాలను ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు.

ట్రంప్ నిర్ణయంపై చైనా కూడా తీవ్రంగానే స్పందించింది. అమెరికా తీసుకునే చర్యల వల్ల ద్వైపాక్షిక వాణిజ్యం దెబ్బ తినే పక్షంలో తాము చూస్తూ కూర్చోమని హెచ్చరించింది. తమ ప్రయోజనాలను తాము రక్షించుకుంటామని స్పష్టం చేసింది. మేధో హక్కుల విషయంలో తాము అంతర్జాతీయ చట్టాలు, ఒప్పందాలకు కట్టుబడే వ్యవహరిస్తున్నామని తెలిపింది.

ఇదిలా ఉండగా ట్రంప్ ఆదేశించిన దర్యాప్తుతో అమెరికా, చైనా ద్వైపాక్షి వాణిజ్యం వెంటనే దెబ్బతినే అవకాశం లేదని నిపుణులు అంటున్నారు. ముందుగా చైనా అక్రమ వాణిజ్య విధానాలను అనుసరిస్తుందన్న విషయాన్ని ప్రాథమికంగా నిర్ధారించాల్సి ఉంటుంది. ఆ తర్వాతనే దర్యాప్తు చేపట్టే అవకాశం ఉంటుంది. దీనికి కనీసం ఏడాదైనా పడుతుంది. చైనాతో ద్వైపాక్షిక వాణిజ్యంలో 2016లో అమెరికా 35,000 కోట్ల డాలర్ల లోటును చవిచూసింది. అమెరికా ఆర్థిక రంగాన్ని చైనా తన ఎగుమతులతో కొన్నేళ్లుగా ముంచెత్తుతోంది. చైనా దెబ్బకు అమెరికాలో ఉత్పత్తుల రంగం పూర్తిగా కుంటుబడింది.

చైనా అప్పుల కుప్పే : ఐఎంఎఫ్

చైనా అప్పుల భారం ప్రమాదకర స్థాయికి చేరుకుందని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) మరోసారి హెచ్చరించింది. నిర్మాణాత్మక సంస్కరణలతో దీనికి అడ్డుకట్ట వేయకపోతే జిడిపి వృద్ధి రేటు భారీగా పడిపోవడంతో పాటు పుట్టి మునిగే ప్రమాదం ఉందని హెచ్చరించింది. అదే జరిగితే చైనాకు తీవ్ర ఆటుపోట్లు తప్పవని స్పష్టం చేసింది. అప్పుల మీద అప్పులు చేసి ఆర్థిక వ్యవస్థను నడిపించాలనుకుంటే గత ఏడాది జిడిపిలో 235 శాతంగా ఉన్న అప్పుల భారం, 2022 నాటికి 290 శాతానికి చేరుకుంటుందని హెచ్చరించింది. అదేపనిగా అప్పులు చేసి మౌలిక ప్రాజెక్టులు, రియల్టీ రంగాల్లో చైనా పెట్టుబడులు పెడుతూ వస్తోంది.

పిఎస్‌యు బ్యాంకులకు రూ.92 వేల కోట్ల టోపీ

- ఎగ్గొట్టిన విల్‌ఫుల్ డిఫాల్టర్లు



న్యూఢిల్లీ : గడచిన ఆర్థిక సంవత్సరం (2016- 17) ముగిసే నాటికి విల్‌ఫుల్ డిఫాల్టర్ల (ఉద్దేశపూర్వకంగా రుణాలను ఎగ్గొట్టిన వారు) రుణాలు 20 శాతం మేర పెరిగాయని ప్రభుత్వ రంగ బ్యాంకులు వెల్లడించాయి. మార్చి చివరి నాటికి ఉద్దేశపూర్వకంగా రుణాలు ఎగ్గొట్టినవారు సుమారు 9,000 మంది ఉండగా వారు ఎగ్గొట్టిన మొత్తం 92 వేల కోట్ల రూపాయలకు పైగానే ఉందని తెలిపాయి. 2016 మార్చి నాటికి కావాలని ఎగ్గొట్టిన రుణాలు 76,685 కోట్ల రూపాయలుగా ఉండగా 2017 మార్చి నాటికి అవి 20.4 శాతం పెరిగి 92,376 కోట్ల రూపాయలకు చేరుకున్నాయి. వార్షిక ప్రాతిపదికన చేస్తే విల్‌ఫుల్ డిఫాల్టర్ల సంఖ్య 10 శాతం పెరిగింది. 2016 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి 8,167 మంది విల్‌ఫుల్ డిఫాల్టర్లు ఉండగా 2017 మార్చి చివరి నాటికి ఈ సంఖ్య 8,915కు చేరుకుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ రూపొందించిన గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

8,915 విల్‌ఫుల్ డిఫాల్ట్ కేసుల్లో 1,914 మందిపై బ్యాంకులు ఎఫ్ఐఆర్ దాఖలు చేశాయి. వీరు తీసుకున్న రుణాల మొత్తం 32,484 కోట్ల రూపాయలుగా ఉంది. 2016-17 కాలంలో దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బిఐ, దాని అనుబంధ బ్యాంకులు మొత్తం 81,683 కోట్ల రూపాయలను రైటాఫ్ చేయటం గమనార్హం. గడచిన ఐదు ఆర్థిక సంవత్సరాల్లో ఇదే గరిష్ఠ మొత్తం కావటం విశేషం. 2017 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ప్రభుత్వ రంగ బ్యాంకుల మొండి పద్దులు 5.02 లక్షల కోట్ల రూపాయల నుంచి ఏకంగా 6.41 లక్షల కోట్ల రూపాయలకు దూసుకుపోయాయి. అయితే పరిస్థితి చేయిదాటిపోతుండటంతో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బిఐ) కఠిన నిబంధనలు రూపొందించి పక్కాగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకుంటోంది.

జియో ఉచిత ఫోన్‌తో రాబడులు హరీ

- డాట్‌కు వొడాఫోన్ లేఖ



న్యూఢిల్లీ : రిలయన్స్ జియో.. ఎఫెక్టివ్ ఉచిత ఫోన్‌తో టెలికాం రంగం మరింత సంక్షోభంలోకి జారుకుంటుందని వొడాఫోన్ వెల్లడించింది. గత ఏడాది నుంచి ప్రత్యర్థి టెలికాం కంపెనీలను చావుదెబ్బకొడుతున్న ఆర్‌జియో తాజాగా అన్‌లిమిటెడ్ కాలింగ్‌తో ఫీచర్ ఫోన్‌ను తీసుకువస్తున్న సంగతి తెలిసిందే. ఆర్‌జియో ఆఫర్లతో ఇతర ఆపరేటర్ల రాబడులన్నీ హరించుకోయి తీవ్ర ఒత్తిడిలోకి జారుకుంటాయని టెలికాం కమిషన్ మెంబర్ (ఫైనాన్స్) అనురాధ మిత్రాకు రాసిన లేఖలో వొడాఫోన్ వెల్లడించింది. మరోవైపు ప్రభుత్వం విధించిన వివిధ లెవీలు కూడా టెలికాం పరిశ్రమను చావు దెబ్బ కొడుతుందని పేర్కొంది. ఈ లెవీలను తగ్గించటంపై ప్రభుత్వం పునరాలోచించుకోవాలని కోరింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ.. 1,500 రిఫండబుల్ డిపాజిట్‌తో 4జి ఫీచర్ ఫోన్‌ను అందించనున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. మంగళవారం నుంచి ఈ ఫీచర్ ఫోన్.. బీటా టెస్ట్ ప్రారంభం కాగా 24 వ తేదీ నుంచి బుకింగ్‌లు ప్రారంభం కానున్నాయి. జియో దెబ్బకు ఇప్పటికే టెలికాం సర్వీసుల రాబడులు గణనీయంగా తగ్గాయని, జూన్ త్రైమాసికంలో ఇవి మరో 3.41 శాతం క్షీణించాయని వొడాఫోన్ ఆ లేఖలో పేర్కొంది. మరోవైపు వాయిదా వేసిన స్పెక్ట్రమ్ చెల్లింపుల కోసం వసూలు చేస్తున్న వడ్డీ రేటును తగ్గించాలని కోరింది. వడ్డీ రేటు తగ్గిస్తే ఆపరేటర్లపై కొంతమేరకైనా భారం తగ్గుతుందని వొడాఫోన్ పేర్కొంది.

రిలయన్స్‌ఇండస్ట్రీస్‌పై రూ.1,700 కోట్ల జరిమానా

- కేజీ బేసిన్ గ్యాస్ ఉత్పత్తి వివాదం

న్యూఢిల్లీ : కేజీ బేసిన్‌లో నిర్ణీత లక్ష్యానికంటే తక్కువ గ్యాస్ ఉత్పత్తి చేసినందుకు ప్రభుత్వం రిలయన్స్ ఇండస్ట్రీస్, దాని భాగస్వామ్య సంస్థలపై మరోసారి కొరడా ఝుళిపించింది. 2015-16 ఆర్థిక సంవత్సరానికి రూ.1,700 కోట్ల (26.4 కోట్ల డాలర్లు) జరిమానా విధించింది. ఈ బేసిన్‌లోని కేజీ-డి6 ప్రాంతంలోని బావుల నుంచి రిలయన్స్, దాని భాగస్వామ్య పక్షాలైన బ్రిటిష్ పెట్రోలియం, నికో కంపెనీలు రోజూ ఎనిమిది కోట్ల ప్రామాణిక ఘనపు మీటర్ల గ్యాస్ ఉత్పత్తి చేయాలి.

గ్యాస్ ఉత్పత్తి ఆ స్థాయిలో లేకపోవడంతో ఈ జరిమానా విధిస్తున్నట్టు పెట్రోలియం మంత్రిత్వ శాఖ పేర్కొంది. దీంతో గత ఆరేళ్లుగా ఈ పేరుతో రిలయన్స్, దాని అనుబంధ సంస్థలపై ప్రభుత్వం విధించిన జరిమానా మొత్తం 302 కోట్ల డాలర్లకు (ప్రస్తుత మారకం రేటు ప్రకారం సుమారు రూ.19,405 కోట్లు) చేరింది. దీన్ని నేరుగా కాకుండా ఉత్పత్తి పంపకం కాంట్రాక్ట్ (పిఎస్‌సి) కింద మినహాయించుకుంటారు.

కొత్త పారిశ్రామిక విధానం తేవాలి

సంస్కరణలను మరింత పటిష్టం చేయాలి ఇండియా ఇంక్



న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంపై పారిశ్రామిక, వాణిజ్య సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. 2022 నాటికి సురక్షితం, సుసంపన్నం, శక్తివంతమైన భారత్‌ను నిర్మించాలని ప్రధాని తన ప్రసంగంలో పిలుపు ఇచ్చారు. ఈ లక్ష్య సాధన కోసం కొత్త పారిశ్రామిక విధానం తీసుకురావడంతో పాటు ఉద్యోగాల కల్పన, పని చేసే చోట మహిళలకు సాధికారత కోసం చర్యలు తీసుకోవడం వంటి విధానపమైన సంస్కరణలను మరింత పటిష్టం చేయాలని భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ) కోరింది. అవినీతి, నల్లధన కట్టడి కోసం ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రశంసించింది. ద్రవ్యోల్బణం తగ్గి, వడ్డీ రేట్లు దిగివస్తున్న ప్రస్తుత సమయం సంస్థాగతమైన సంస్కరణలను మరింత పటిష్టం చేసేందుకు అత్యంత అనువుగా ఉందని సిఐఐ జాతీయ అధ్యక్షురాలు శోభనా కామినేని తెలిపారు.


'2022 నాటికి అభివృద్ధి కోసం ప్రధాని ప్రకటించిన కార్యక్రమం సవాళ్లతో కూడింది. ఆర్థిక, సామాజిక రంగాల్లో ఇందుకు అవసరమైన మార్పుల కోసం విధానపరమైన గట్టి చర్యలు అవసరం. ఇందుకోసం ప్రభుత్వం ఇప్పటికే కొన్ని గట్టి చర్యలు తీసుకుంది. ఈ అభివృద్ధి కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు మనమందరం చేతులు కలిపి పని చేయాలి' అన్నారు.

ప్రధాని లక్ష్యాలు 'ఇండియా ఎట్75' పేరుతో 2008లో సిఐఐ ప్రారంభించిన ప్రచార కార్యక్రమానికి అనుగుణంగానే ఉన్నాయన్నారు. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు క్లౌడ్ సోర్సింగ్ పద్ధతిలో అభిప్రాయాలను స్వీకరించాలని శోభనా కామినేని కోరారు. అవినీతి, నల్ల ధన కట్టడి కోసం ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఇప్పటికే చెప్పుకోదగ్గ ఫలితాలు ఇస్తున్నట్టు తెలిపారు.

ఫిక్కీ కూడా ప్రధాని మోదీ ప్రసంగంపై హర్షం వ్యక్తం చేసింది. అవినీతి, బంధుప్రీతికి తావు లేకుండా అందరం భారతీయులమనే భావనతో అందరికీ ఆర్థిక అవకాశాలు ఉండే పటిష్ట భారత నిర్మాణాన్ని ప్రధాని తన ప్రసంగంలో చక్కగా వివరించారని పేర్కొంది.

ప్రధాని ఆలోచన అద్భుతం : నారాయణ మూర్తి

ప్రధాని స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంపై ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుల్లో ఒకరైన ఎన్ఆర్ నారాయణ మూర్తి కూడా ప్రశంసించారు. ప్రధాని తన ప్రసంగంలో పేర్కొన్న 'పోటీతో కూడిన సహకార సమాఖ్య' అద్భుతమైన ఆలోచన అన్నారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి మెలిసి పనిచేయాలే తప్ప, నిత్యం విమర్శల్లో మునిగి తేలడం మంచిది కాదన్నారు. మోదీ సర్కార్ తీసుకున్న పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టిని నారాయణ మూర్తి సమర్థించారు. నోట్ల రద్దుతో దాదాపు రూ.1.25 లక్షల కోట్ల నల్ల ధనం బయటపడిన విషయాన్ని గుర్తు చేశారు. జిఎస్‌టితో ముందు ముందు ప్రభుత్వంతో పాటు వ్యాపార, వాణిజ్య వర్గాలూ పెద్ద ఎత్తున ప్రయోజనం పొందబోతున్నట్టు చెప్పారు. డొల్ల కంపెనీలపై వేటు వేయడాన్నీ మూర్తి సమర్థించారు. ఇది దేశ ఆర్థిక వ్యవస్థకు మేలు చేసే చర్య అన్నారు.



సులభతర వ్యాపార, వాణిజ్య విధానాలతో పాటు జిఎస్‌టి వంటి సంస్కరణలు మన ఆర్థిక వ్యవస్థను మరింత పటిష్టం చేస్తాయి. దీనివల్ల పన్నులు చెల్లించే వారి సంఖ్యా పెరుగుతుంది. ఈ చర్యలతో 2022 నాటికి దేశ ఆర్థిక వ్యవస్థ మరింత పారదర్శకంగా, పటిష్ఠంగా అవతరిస్తుంది.

– శోభనా కామినేని, ప్రెసిడెంట్, సిఐఐ



'పోటీతో కూడిన సహకార సమాఖ్య' అనే ప్రధాని నినాదంతో పెట్టుబడులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం రాష్ట్రాలు ఒకదానితో ఒకటి పోటీపడతాయి. తద్వారా మరిన్ని ఉద్యోగాల కల్పన వీలవుతుంది.

– ఎన్ఆర్ నారాయణ మూర్తి, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు

దేశీ మార్కెట్లోకి కొత్తగా 10 ఔషధాలు

- నాట్కో ఫార్మా వెల్లడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : దేశీయ ఫార్ములేషన్స్ విభాగంలోకి 10 కొత్త ఉత్పత్తులను విడుదల చేసేందుకు నాట్కో ఫార్మా సన్నాహాలు చేస్తోంది. అంతే కాకుండా కొత్త ఔషధాల విడుదలతో 20 శాతం వృద్ధిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఇన్వెస్టర్ ప్రెజంటేషన్‌లో నాట్కో వెల్లడించింది. ఈ ఏడాది ఆరంభంలో ప్రారంభించిన కార్డియాలజీ, డయాబెటాలజీ డివిజన్ అంచనాలకు తగ్గట్టుగానే వృద్ధిపథంలో దూసుకుపోతోందని తెలిపింది. మరోవైపు భారత మార్కెట్లోకి తొలిసారిగా థ్రోంబోసిస్ సిండ్రోమ్ చికిత్సలో వినియోగించే అరగట్రోబాన్ ఇంజెక్షన్‌ను విడుదల చేసినట్లు నాట్కో వివరించింది. కాగా దేశీయ అంకాలజీ విభాగంలో నాట్కో అగ్రస్థానంలో కొనసాగుతోందని పేర్కొంది. 2013లో ఇమాటినిబ్‌తో అంకాలజీ విభాగంలోకి అడుగుపెట్టగా ప్రస్తుతం 28 ఉత్పత్తులు, 6 బ్రాండ్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నట్లు తెలిపింది. ఈ విభాగం ఏటా 27 శాతం వృద్ధిని సాధించుకుంటూ వస్తోందని వెల్లడించింది. మరోవైపు కాంపెక్స్ జెనరిక్స్ పోర్టుఫోలియోలోని కొపాగ్జోన్, లాంథానుమ్ కార్బొనేట్, బోసెంటాన్ వంటి కీలక మాలిక్యూల్స్‌కు సమీప భవిష్యత్తులో అనుమతులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు తెలిపింది. ఇప్పటికే లాంథానుమ్ కార్బొనేట్ ఔషధానికి అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ మండలి (యుఎస్ ఎఫ్‌డిఎ) నుంచి తుది అనుమతి లభించిందని తెలిపింది. అమెరికా మార్కెట్లోకి కంపెనీ విడుదల చేస్తున్న తొలి జెనరిక్ ఔషధం ఇదని పేర్కొంది.

2020 నాటికి కొత్త విభాగాల్లోకి..

2020 నాటికి కొత్త విభాగాల్లోకి అడుగు పెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు నాట్కో తెలిపింది. మరోవైపు వర్ధమాన మార్కెట్లలోకి వేగంగా చొచ్చుకుపోయేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు పేర్కొంది. ఇదే సమయంలో అమెరికా మార్కెట్ కోసం ఎంపిక చేసిన కీలక ఔషధాలను విడుదల చేయటంపై ప్రధానంగా దృష్టిని కేంద్రీకరించనున్నట్లు నాట్కో వెల్లడించింది.

ఐవిఆర్‌సిఎల్ ప్రాజెక్టులకు 'టాటా' గుడ్‌బై

హైదరాబాద్ : పీకల్లోతు అప్పుల్లో ఉన్న ఐవిఆర్‌సిఎల్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. తమిళనాడులో కంపెనీ నిర్మించిన మూడు టోల్ వే రోడ్ ప్రాజెక్టుల్లో వాటా తీసుకునే ఒప్పందం నుంచి టాటా గ్రూప్‌కు చెందిన టిఆర్ఐఎల్ రోడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ తప్పుకుంది. ఒప్పందం నుంచి తప్పుకోవడంతో పాటు అడ్వాన్స్‌గా ఇచ్చిన రూ.85 కోట్లను తీసుకునేందుకు బ్యాంక్ హామీనీ వెనక్కి తీసుకుందని ఐవిఆర్‌సిఎల్ తెలిపింది. టాటా గ్రూప్ కంపెనీ ఒప్పందం నుంచి తప్పుకోవడానికి కారణాలు ఏమిటో తెలియలేదు.

మరోవైపు పీకల్లోతు అప్పుల్లో ఉన్న ఐవిఆర్‌సిఎల్ వ్యూహాత్మక రుణ పునర్ వ్యవస్థీకరణ (ఎస్‌డిఆర్) ఇంకా ఒక కొలిక్కి రాలేదు. ఈ ప్రాజెక్టులో పెట్టుబడి పెట్టేందుకు వ్యూహాత్మక పెట్టుబడిదారులెవరూ ముందుకు రాకపోవడమే ఇందుకు కారణంగా కనిపిస్తోంది.

తగ్గించండి మహాప్రభో!



- జిఎస్‌టి రేట్లపై వినతుల వెల్లువ
- 133కు పైగా ఉత్పత్తులపై డిమాండ్లు
- వచ్చే నెల 9న హైదరాబాద్‌లో మండలి భేటీ

న్యూఢిల్లీ : మహిళలకు ప్రీతిపాత్రమైన హెయిర్ బాండ్లు, నెయిల్ పాలిష్‌లపై 28 శాతం! చిన్న పిల్లలు తినే భుజియాలు, నమ్కీన్లు, పొటాటో చిప్స్‌పై 12 శాతం! వాహన డ్రైవింగ్‌కు తప్పనిసరి అయిన హెల్మెట్‌పై 18 శాతం! అందరికీ అవసరమయ్యే దుస్తులు, చెప్పులు, వంట గ్యాస్, స్వీట్లు తదితరాలపైనా జిఎస్‌టి బాదుడు! పుస్తకాలు బరువెక్కాయి. విద్యతో పాటు వైద్యమూ భారమైంది. కేవలం నెల రోజుల్లోనే జిఎస్‌టి ప్రభావంతో చాలా వ్యాపారాలు కుదేలయ్యాయి. ఈ నేపథ్యంలోనే, 'జిఎస్‌టి రేట్లు తగ్గించండి మహాప్రభో' అంటూ జిఎస్‌టి మండలికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దేశవ్యాప్తంగా 1200 ఉత్పత్తులను ఈ మండలి నాలుగు శ్లాబుల్లోకి సర్దిన విషయం తెలిసిందే. వీటిలో ఇప్పుడు ఏకంగా 133కుపైగా ఉత్పత్తులపై జిఎస్‌టి రేట్లను తగ్గించాలంటూ వినతులు వెల్లువెత్తాయి. ఇంకా వస్తున్నాయి. జిఎస్‌టి రేట్ల విషయంలో గణనీయంగానే మార్పులు చేయాలంటూ అటు వ్యాపారులు ఇటు వినియోగదారులతోపాటు ఏకంగా ప్రభుత్వాలు కూడా పదే పదే విజ్ఞప్తులు చేస్తున్నాయి. జిఎస్‌టి అమల్లోకి రాకముందు ప్రారంభించిన ప్రాజెక్టులు, పిలిచిన టెండర్లపై ఇప్పుడు పన్ను విధించడం ఏమిటంటూ తెలంగాణ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు.. ప్రధాని మోదీకి లేఖ రాశారు.

ఐటి రంగం ద్వారా ఎంతోమంది నిపుణులకు ఉద్యోగాలు కల్పిస్తున్నామని, ఐటి ఉత్పత్తులపై 18 శాతం పన్ను వేయడమేమిటని ఆ రంగానికి చెందిన పెద్దలు మండలికి విన్నవించారు. ఐటి ఉత్పత్తులపై పన్నును 18 నుంచి 12 శాతానికి, ఐటి హార్డ్‌వేర్‌పై పన్నును 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించాలని కోరారు. హెల్మెట్లపై పన్ను 18% నుంచి 5 శాతానికి తగ్గించాలని హెల్మెట్ల ఉత్పత్తిదారులు జిఎస్‌టి మండలికి లేఖలు రాశారు. ఇక, వస్త్ర రంగంపై పన్నును 5 శాతం విధించడాన్ని తొలి నుంచీ ఆ రంగం వ్యతిరేకిస్తోంది. సూరత్‌లో ఏకంగా ధర్నాలు, ఆందోళనలు చేశారు. ఈ పన్నును పూర్తిగా ఎత్తేయాలని వస్త్ర రంగం వినతుల మీద వినతులు చేస్తోంది. ఇదే తరహాలో గ్రానైట్ శ్లాబులపై 28 శాతం జిఎస్‌టి వసూలుపై గ్రానైట్ పరిశ్రమలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. దీనిని కనీసం 18 శాతానికి తగ్గించాలని కోరుతున్నారు. అలాగే, ట్రాక్టర్లపై 12 శాతం, విడి భాగాలపై వివిధ రకాలుగా జిఎస్‌టి వసూలుతో వ్యవసాయానికి దెబ్బేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దాంతో ట్రాక్టర్లు, విడి భాగాలపై పన్ను రేట్లను తగ్గించాలని కూడా మండలికి వినతులు వెల్లువెత్తాయి.

చిన్న పిల్లలు తినే నమ్కీన్లు, భుజియాలు, పొటాటో చిప్స్‌పై ఇప్పటి వరకూ 12 శాతంగా ఉన్న జిఎస్‌టిని 5 శాతానికి పరిమితం చేయాలని కూడా వినతులు వచ్చాయి. మరోవైపు మంచినీటి క్యాన్లు, ప్యాకెట్లపై 18 శాతం పన్నును చాలామంది వ్యతిరేకిస్తున్నారు. జిఎస్‌టి అమలుతో వాటి ధరలు ఒక్కసారిగా పెరిగాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాటిపై జిఎస్‌టిని పూర్తిగా ఎత్తేయాలని డిమాండ్ చేస్తున్నారు. వీటితో పాటు హెయిర్ పిన్నులు, శానిటరీ ప్యాడ్స్, ఎల్‌పిజి స్టవ్స్, గొడుగులు, రాత పరికరాలు, వెట్ గ్రైండర్లు, వెయింగ్ మిషన్లు, టెక్స్‌టైల్ మెషినరీ విడిభాగాలు, నమిలే పొగాకు, ప్రింటర్లు, చేనేత కార్పెట్లు తదితరాలపైనా జిఎస్‌టిని తగ్గించాలని వినతులు వస్తున్నాయి. అలాగే, ఆటోమొబైల్ తదితర పరిశ్రమలు కూడా జిఎస్‌టిపై తమ తమ ఆందోళనలను మండలికి విన్నవించాయి. ఈ నేపథ్యంలోనే, జిఎస్‌టి మండలి తదుపరి సమావేశం వచ్చే నెల 9న హైదరాబాద్‌లో జరగనుంది. తమకు వెల్లువెత్తిన వినతులపై మండలి ఈ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.10 — నెక్ (100 గుడ్లు)



హైదరాబాద్	351.00	వరంగల్	353.00
విజయవాడ	357.00	చెన్నై	397.00
గోదావరి	357.00	నమక్కల్	384.00
బెంగళూరు	380.00	చిత్తూరు	390.00
విశాఖపట్నం	360.00	ముంబై	396.00

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	72.00	గోదావరి	73.00
కరీంనగర్	72.00	విజయవాడ	74.00
వరంగల్	72.00	గుంటూరు	74.00
మహబూబ్‌నగర్	72.00	ఒంగోలు	76.00
కర్నూలు	72.00	చిత్తూరు	82.00
విశాఖపట్నం	73.00	నెల్లూరు	82.00

కార్పొరేట్ కాలేజీల్లో కలవరం

- ప్రవేశ పరీక్షల ఫలితాల్లో వెనుకంజ
- యాజమాన్యాల్లో అంతర్మథనం
- దిద్దుబాటు చర్యలపై ఆలోచన
- ఉత్తరాదిలో ప్రవేశానికి ప్రయత్నాలు

హైదరాబాద్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): ఎంసెట్... ఐజీటీ-జేఈఈ.. నీట్.. ఇలా ప్రవేశపరీక్ష ఏదైనా సరే.. వాటి ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల్లోని కార్పొరేట్ కాలేజీల పేరు మారుమోగాల్సిందే. ఫలితాల్లో కొన్నేళ్లుగా ఇదొక ఆచారంగా మారిపోయింది. ఈ ఏడాది సీన్ రివర్సయింది. ప్రవేశపరీక్షలలో కార్పొరేట్ కాలేజీలు చతికిలబడ్డాయి. దీంతో యాజమాన్యాల్లో కలవరం మొదలైంది. ఫలితాలపై అంతర్మథనం కూడా ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో దిద్దుబాటు చర్యలు చేపట్టిన యాజమాన్యాలు.. భవిష్యత్ కార్యాచరణపై దృష్టిపెట్టాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా కొన్ని రోజులుగా విస్తృతంగా సమావేశాలు నిర్వహిస్తున్నాయి. ఫలితాలు వెల్లడైన మర్నాటి నుంచి సమీక్షలు జరుగుతూనే ఉన్నాయి. ఫలితాల్లో వెనుకంజకు కారణమేంటి..? విద్యార్థులా.. అధ్యాపకులా.. యాజమాన్యమా.. ఎవరిది తప్పు? అనే అంశాలతో పాటు భవిష్యత్‌లో తీసుకోవాల్సిన చర్యలపైనా సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. ఈ ఏడాది విడుదలైన ఏ ప్రవేశపరీక్షలోనూ తెలుగు రాష్ట్రాల కార్పొరేట్ కాలేజీలు ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధించలేదు. ఈ విషయాన్ని కాలేజీల యాజమాన్యాలే అంగీకరిస్తున్నాయి. ప్రతి ఏటా జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో టాప్ ర్యాంకులను ఈ కాలేజీల విద్యార్థులే దక్కించుకునేవారు. ఈసారి టాప్-10లో తెలుగువారు ఒక్కరూ లేరు. నీట్ ఫలితాల్లోనూ అదే పరిస్థితి. టాప్-10లో తెలుగు పేర్లు లేవు.

భారీ పెట్టుబడి.. ఉత్తరాదికి పయనం

ఈ ఫలితాలతో.. రాష్ట్రంలోని కొన్ని కార్పొరేట్ కాలేజీలు సరికొత్త నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. భవిష్యత్‌లోనూ హవా కొనసాగాలంటే, ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలకే పరిమితమైన తమ విద్యా వ్యవస్థను ఉత్తరాదికి కూడా విస్తరించాలని నిర్ణయించినట్లు తెలిసింది. అక్కడి విద్యార్థులపై దృష్టి పెట్టాలని భావిస్తున్నట్లు సమాచారం. కేవలం తెలుగు విద్యార్థులపై ఆధారపడితే భవిష్యత్తు కష్టమనే అభిప్రాయాన్ని ఆయా కాలేజీల యాజమాన్యాలు వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇటీవలి ప్రవేశపరీక్షలలో ఉత్తరాది విద్యార్థులు సత్తాచాటారు. టాప్ ర్యాంకులను సులువుగా కైవసం చేసుకుంటున్నారు. అందుకే ఉత్తరాదికి విస్తరించి.. అక్కడి విద్యార్థులను ఆకర్షించి ఉత్తమ ఫలితాలు రాబట్టాలనే ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. ఇందుకోసం కార్పొరేట్ కాలేజీలు సంయుక్తంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఉత్తరాదిలో పాగా వేసేందు కు భారీగా నిధులను కూడా ఖర్చు చేయాలని నిర్ణయించారంటున్నారు. దాదాపుగా రూ.200 కోట్లు వెచ్చించాలని సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు చెబుతున్నారు. ఇటీవల ఉత్తరాదిలోని కోచింగ్ ఇనిస్టిట్యూట్‌లు బలంగా తయారయ్యాయి. విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ ఇస్తూ టాప్ ర్యాంకులను కైవసం చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల విద్యార్థుల్లో కూడా కొంతమంది అటువైపు వెళ్తున్నారు. దానివల్ల ఇక్కడ విద్యార్థుల సంఖ్య తగ్గిపోయే ప్రమాదం ఉండటంతో ముందుజాగ్రత్తగా ఉత్తరాదికి వెళ్లాలని కార్పొరేట్ కాలేజీలు భావిస్తున్నాయి. అక్కడైనా ర్యాంకులు సాధించి పూర్వవైభవాన్ని చాటుకోవాలని భావిస్తున్నట్లు తెలిసింది.

ప్రభుత్వ కాలేజీలు కళ కళ

- లక్ష దాటిన ఇంటర్మీడియట్ అడ్మిషన్లు
- ఫలితమిస్తున్న ఉచిత విద్య, పుస్తకాల పంపిణీ
- మూడేళ్లలోనే గణనీయమైన మార్పు

హైదరాబాద్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు నవశకం మొదలైంది. ఒకప్పుడు విద్యార్థులు లేక విలవిలలాడిన కళాశాలలు.. ఇప్పుడు లక్షకుపైగా అడ్మిషన్లతో కళకళలాడుతున్నాయి. ప్రైవేట్, రెసిడెన్షియల్ కళాశాలలకు దీటుగా ఈ ఏడాది లక్షకుపైగా ప్రవేశాలు సాధించి ఔరా అనిపించాయి. 2017-18 విద్యా సంవత్సరానికి తెలంగాణలోని 407 కాలేజీల్లో ఇప్పటి వరకు జరిగిన అడ్మిషన్ల 1.02లక్షలు కావడం గమనార్హం. గతంలో ఏటా తగ్గుతూ వచ్చిన అడ్మిషన్ల సంఖ్య.. మూడేళ్లలో నలభై వేల మేర పెరగడంపై అధ్యాపక వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

పూర్వ వైభవం దిశగా అడుగులు

తెలంగాణ ఏర్పడే నాటికి మొత్తం 407 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్ల సంఖ్య కేవలం 60 వేలు మాత్రమే. బోధన సిబ్బంది కొరత, సౌకర్యాలు లేమి వెరసి కళాశాలల పరిస్థితి అధ్వానంగా ఉండేది. ఈ పరిస్థితిని మార్చేందుకు తెలంగాణ విద్యాశాఖ చేపట్టిన చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయి. ఈ మేరకు ముందుగా 2015-16 విద్యా సంవత్సరం నుంచి ఉచిత విద్య అందించాలని అధికారులు నిర్ణయించారు. ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేయడంతోపాటు పరీక్ష ఫీజు, ఇతర ఫీజులను ప్రభుత్వమే భరిస్తుందని ప్రకటించారు. దీంతో మూడేళ్లుగా అడ్మిషన్ల సంఖ్య క్రమంగా పెరుగుతూ వచ్చింది. 2014-15లో 60వేలుగా ఉన్న అడ్మిషన్లు 2015-16లో 80వేలు, 2016-17లో 97వేలు, 2017-18లో 1.02లక్షలకు పెరిగాయి.

ప్రైవేట్‌కు దీటుగా...

ప్రైవేట్ జూనియర్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్ల సంఖ్య పెరుగుతుండడంపై హర్షం వ్యక్తమవుతోంది. మరోవైపు అడ్మిషన్ల సంఖ్యను పెంచుకునేందుకు ప్రైవేట్ కళాశాలలు రకరకాల ఆఫర్లతోపాటు ఫీజుల్లో తగ్గింపును అందిస్తున్నాయి. ప్రభుత్వం నూతనంగా రెసిడెన్షియల్ కళాశాలలను ఏర్పాటు చేసి, మోడల్ స్కూళ్లలో సీట్లు పెంచింది. ప్రయోగశాలలు, బోధన సిబ్బందిని పెంచి మెరుగైన సౌకర్యాలు కల్పిస్తోంది. దీంతో ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్ల కోసం విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు.

నమ్మకం పెరుగుతోంది

ప్రభుత్వ కళాశాలలపై విద్యార్థుల్లో నమ్మకం పెరుగుతోంది. ఈ ఏడాది అడ్మిషన్ల సంఖ్య లక్ష దాటినందుకు సంతోషంగా ఉంది. ప్రభుత్వం నుంచి మరింత ప్రోత్సాహం లభిస్తే ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ కళాశాలలను తీర్చిదిద్దుతాం.


– మధుసూదన్‌రెడ్డి, జీజేఎల్ఏ అధ్యక్షుడు

భూసర్వే విత్ 'డీజీపీఎస్'

- ల్యాండ్‌మార్క్ గుర్తించడంలో కచ్చితత్వం
- పనుల్లోనూ వేగం.. రోజుకు 300 ఎకరాల సర్వే
- గొలుసు విధానంతో రోజుకు 6 ఎకరాలే
- భూ వివాదాలకు చెల్లుచీటి
- ప్రపంచంలో ఎక్కడి నుంచైనా భూ వివరాలు



డీజీపీఎస్ కంట్రోలర్



డీజీపీఎస్ రిసీవర్

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 15: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న భూములన్నీ సర్వే చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. మరి.. ఈ పనులు పూర్తయ్యేందుకు ఎంత సమయం పట్టవచ్చు? ఇప్పటి దాకా సర్వేయర్లు సంప్రదాయ పద్ధతి అయిన గొలుసు విధానంతోనే భూములను సర్వే చేస్తున్నారు. ఈ విధానం ద్వారా ఎంపిక చేసుకున్న చోట ఒకరోజులో గరిష్ఠంగా 6 ఎకరాల వరకే సర్వే చేయొచ్చు. అంటే.. రీ సర్వే పనులు పూర్తయ్యేందుకు చాలా కాలమే పడుతుంది. అందునా.. సర్వేలో నూటికి నూరుపాళ్లు పారదర్శకత, కచ్చితత్వం సాధించడం కూడా సవాలే!. అందుకే.. రాష్ట్రవ్యాప్తంగా రీ సర్వే కోసం అధునాతన సాంకేతికతను అధికారులు వాడుకుంటున్నారు. అదే డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం(డీజీపీఎస్). భూ సర్వేలో వేగానికి తోడు పనుల్లో ఎదురయ్యే సవాళ్ల పరంగా 'సర్వరోగ నివారిణి'గా డీజీపీఎస్ వ్యవస్థను భావిస్తున్నారు. ఈ విధానంతో రోజుకు 300 ఎకరాల వరకు సర్వే చేయవచ్చు. ఇందుకు ప్రయోగాత్మకంగా రంగారెడ్డి జిల్లాలోని తుర్కగూడ, ఎర్రకుంట, సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం దౌలాపూర్‌లో డీజీపీఎస్ ద్వారానే భూ సర్వే పనులు జరుగుతున్నాయి.

ఎలా పనిచేస్తుంది?

డీజీపీఎస్... శాటిలైట్‌తో అనుసంధానం చేసి ఉండే రిమోట్ సెన్సింగ్ పరికరం. రిసీవర్, కంట్రోలర్ పరికరాల సమాహారం. అక్షాంశ, రేఖాంశాల ఆధారంగా భూమ్మీద ప్రతి అంగుళాన్ని రిసీవర్ సిగ్నల్స్ ద్వారా డీజీపీఎస్ అందుకుని కంట్రోలర్‌కు చేరవేస్తుంది. దీన్ని రెండు స్టేషన్లుగా తీసుకుని సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామింగ్ చేస్తారు. గ్రామంలో గుర్తించిన సర్వే నంబర్‌లో ప్రతి సెక్షన్ ఆధారంగా పాయింట్ ఇస్తారు. ఇది ప్రత్యేకంగా ఫైళ్లలో అమర్చడానికి సహకరిస్తుంది. సదరు భూ యజమానికి ప్రత్యేకమైన ల్యాండ్ మార్కును ఇస్తారు. రాబోవు రోజుల్లో డిజిటల్ పాస్ బుక్కుల్లో రికార్డు చేయడానికి ఇది ఉపకరిస్తుంది. మాన్యువల్‌గా ఎదురైన ఇబ్బందులను ఇక ముందు తలెత్తకుండా ప్రతీ సెక్షన్ వివరాలను ఆన్‌లైన్ రికార్డుల ద్వారా అప్‌డేట్ చేస్తారు. ఎవరైనా భూ ఆక్రమణకు పాల్పడితే ఇట్టే పసిగట్టవచ్చు. ఒకరి పేరున ఉన్న భూమి.. అక్రమపద్ధతిలో మరొకరి పేరున మ్యుటేషన్ అయినా.. సదరు రైతుకు సమాచారం అందుతుంది. ప్రపంచంలో ఎక్కడ నుంచైనా రైతులు.. గూగుల్ ద్వారా తమ భూమి వివరాలు, మ్యాపులను చూసుకోవచ్చు. అందునా.. డీజీపీఎస్ సర్వే ద్వారా పకడ్బందీగా ఉంటుంది.. అక్రమాలకు ఆస్కారం ఉండదు కాబట్టి భవిష్యత్తులో రైతుల మధ్య భూ వివాదాలూ ఉండవు. కాగా ఈ శాంపిల్ సర్వే ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా భూ సర్వేకు ఎంతమంది సర్వేయర్లు, డీజీపీఎస్ పరికరాలు అవసరపడతాయనే విషయమ్మీద ప్రభుత్వం ఓ అంచనాకు రానుందని సమాచారం

మరుగుదొడ్లు కడితే చాలదు

గొట్టపు నీరు సరఫరా తప్పనిసరి

- 'స్వచ్ఛ భారత్'లో కేంద్రం స్పష్టీకరణ
- ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ మెరుగు

హైదరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): బహిరంగ విసర్జన నిర్మూలన (ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ-ఓడీఎఫ్) గ్రామాలు/పట్టణాల్లో విధిగా గొట్టపు నీటి సరఫరా వ్యవస్థ (పైప్డ్ వాటర్ స్కీం-పీడబ్ల్యూఎస్) ఉండాలని కేంద్రం సూచిస్తోంది. పట్టణాల్లో ఈ వ్యవస్థ ఏర్పాటు చేసినా గ్రామాల్లో లేవు. స్వచ్ఛ భారత్ కార్యాచరణ ప్రకటించిన సమయంలోనే పీడబ్ల్యూఎస్ తప్పనిసరి అని కేంద్రం స్పష్టం చేసింది. మరుగుదొడ్లు నిర్మించి, ఓడీఎఫ్‌గా ప్రకటించుకుంటున్న రాష్ట్రాలు పీడబ్ల్యూఎస్‌ను మాత్రం పట్టించుకోవడం లేదు. దేశవ్యాప్తంగా ఇప్పటికే 2.18 లక్షల ఆవాసాలు ఓడీఎఫ్‌గా గుర్తింపు పొందాయి. తెలంగాణలోని 2200 ఆవాసాలు ఈ జాబితాలో చేరాయి. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ నిర్వహించిన సమీక్షలో 2.18 లక్షల ఆవాసాలను ఓడీఎఫ్‌గా గుర్తించినా 52% ప్రాంతాల్లోనే పీడబ్ల్యూఎస్‌లు ఉన్నాయని తేలింది. ఈ విషయంలో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ కాస్త మెరుగ్గానే ఉంది. ఓడీఎఫ్‌గా ప్రకటించిన 2200 వరకు ఆవాసాల్లో సుమారు 2 వేల చోట్ల పీడబ్ల్యూఎస్‌లు ఉన్నాయి. మరుగుదొడ్లు కట్టుకున్నా.. బోర్లు, బావుల నుంచి తెచ్చుకోవడం కష్టం. దీంతో ప్రతి ఇంటికీ లేదా ఇంటి సమీపం వరకు గొట్టాల ద్వారా నీరు సరఫరా చేయాలన్నది కేంద్రం ఆలోచన. తెలంగాణలో పీడబ్ల్యూఎస్ సమస్యకు త్వరలో తెరపడనుంది. డిసెంబర్ నాటికి మిషన్ భగీరథ పూర్తయితే ప్రతి ఇంటికి గొట్టపు నీటి సరఫరా సాధ్యమవుతుంది.

కిరోసిన్‌కు స్వస్తి!

- ప్రతి కుటుంబానికీ ఎల్‌పీజీ కనెక్షన్

హైదరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): రేషన్ షాపుల ద్వారా కిరోసిన్ పంపిణీకి మంగళం పాడేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. సబ్సిడీ భారాన్ని తగ్గించుకోవడం, అక్రమాలకు అడ్డుకట్ట వేయడం, కిరోసిన్ వినియోగం వల్ల ఏర్పడే ఆరోగ్య సమస్యలను నివారించడం.. కేంద్రం నిర్ణయానికి కారణాలుగా కనిపిస్తున్నాయి. కిరోసిన్ స్వస్తి పలికి.. కార్డులున్నవారికి ఎల్‌పీజీ కనెక్షన్ ఇవ్వాలని నిర్ణయించింది. రాష్ట్రంలో 85లక్షల కార్డుదారులు ఉన్నారు. వీరిలో 46లక్షల మందికే ఎల్‌పీజీ కనెక్షన్లు ఉన్నాయి. మిగిలిన వారిలో 90% కిరోసిన్‌పైనే ఆధారపడ్డారని అధికారులు చెబుతున్నారు. కిరోసిన్ కోటా రద్దు ప్రణాళికలో భాగంగా ఎల్‌పీజీ కనెక్షన్లు పెంచాలని కేంద్రం నిర్ణయించింది. రాష్ట్రంలో 75 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉండగా మరో 15 లక్షల వరకు ఇవ్వాలని నిర్ణయించింది.

ఆశలు చిగురించాయ్!

- కుంతియా తీరుతో రాష్ట్ర కాంగ్రెస్‌లో ఉత్సాహం
- అధిష్ఠానం ఉద్దేశం ఆయన మాటలతో స్పష్టమైందంటున్న నేతలు

హైదరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : చాలా రోజులుగా నిరాశలో మునిగిపోయిన పార్టీ కేడర్‌లో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి రామచంద్ర కుంతియా ఉత్సాహం నింపారని తెలంగాణ కాంగ్రెస్ నేతలు అభిప్రాయపడుతున్నారు. ఇటీవల రాష్ట్రానికి వచ్చిన కుంతియా మూడు రోజుల పాటు సమావేశాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఇంత కాలం తర్వాత పార్టీలో ఏం జరుగుతుందో స్పష్టత వచ్చిందని, పని చేసే వారికి ప్రాధాన్యం లభిస్తుందనే నమ్మకం కలిగిందని పలువురు నేతలు అంటున్నారు. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మండల స్థాయిలో చేస్తానంటున్న పర్యటనల వల్ల తమకు కొంత ప్రాధాన్యం ఏర్పడుతుందని, తమ అభిప్రాయాలకు విలువ చేకూరుతుందని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. 2019 ఎన్నికల వరకు ఎవరి పదవులు వారికి ఉంటాయని కుంతియా స్పష్టం చేయడంతో తమ గుండెలపై భారం తొలగించినట్టైందని అంటున్నారు. పార్టీ పదవుల్లో ఎలాంటి మార్పూ ఉండబోదనీ, తన పదవితో సహా అందరూ 2019 ఎన్నికల వరకు ఎవరి స్థానంలో వారుంటారని కుంతియా స్పష్టం చేశారు. ఇది అధిష్ఠానం ఆదేశమనీ, దీనిపై ఎవరు అనుచిత వ్యాఖ్యలు చేసినా క్రమశిక్షణా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. పార్టీని 2019 ఎన్నికల్లో అధికారంలోకి తేవాలని, దాని కోసం నేతలంతా తమ మధ్య విభేదాలు విడిచి ఐకమత్యంగా పని చేయాలని ఆదివారం జరిగిన సభలో ఆయన పిలుపునిచ్చారు. అనంతరం సోమవారం ఉదయం గాంధీభవన్‌లో యూత్ కాంగ్రెస్ నేతలతో సమావేశం నిర్వహించి వారికి దిశానిర్దేశం చేశారు. ఆ తర్వాత పార్టీకి అత్యంత కీలకమైన అనుబంధ సంఘాల భేటీ నిర్వహించారు. పని చేసే వారికే పదవులుంటాయని, నిర్లక్ష్యంగా ఉంటే ఎంతటి వారినైనా పదవుల్లోంచి తొలగిస్తామని తేల్చిచెప్పారు. నెలరోజుల్లో పార్టీని ప్రక్షాళన చేస్తామ న్నారు. ఇప్పటి వరకు అత్యంత సౌమ్యుడిగా ఉన్న కుంతియా అధిష్ఠానం ఆదేశాల మేరకే ఇంత దూకుడు ప్రదర్శిస్తున్నారని, ఆయన మాటల్లో పార్టీ ఉద్దేశం స్పష్టమవుతోందని నేతలు విశ్లేషిస్తున్నారు. కాగా, వచ్చే ఎన్నికల నాటికి సామాజిక మాధ్యమాన్నే ప్రచార అస్త్రంగా మార్చుకోవాలని టీకాంగ్రెస్ భావిస్తోంది. నవంబర్ నాటికి టీవీ చానల్, దినపత్రిను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. అయితే, ఇప్పటికే ఉన్న ఏదైనా దినపత్రికను కాంగ్రెస్ తరఫున నడపాలని, చానల్‌ను కొత్తగా ప్రారంభించాలని నిర్ణయించినట్లు తెలిసింది.

గ్రామస్థులందరికీ దోమతెరలు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలోని ఖమ్మం, భద్రాద్రి, వరంగల్, మహబూబాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఈ దోమల తీవ్రత ఎక్కువగా ఉందని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించగా సానుకూల నిర్ణయం వెలువడింది. గత ఏడాది ప్రతి వెయ్యి మందిలో ఇద్దరికి మలేరియా సోకిన ప్రాంతాలను గుర్తించి సుమారు 2.62 లక్షల దోమ తెరలను సరఫరా చేశారు. ఈ ఏడాది ప్రతి వెయ్యి మందిలో ఒక్కరికి మలేరియా వచ్చినా... ఆ ప్రాంత వాసులందరికీ తెరలను పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం 4.89 లక్షల దోమ తెరలను సిద్ధం చేశారు. అక్టోబర్‌లోగా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని భావిస్తున్నారు.

సీట్లపై కొట్లాడుదాం!

(మొదటి పేజీ తరవాయి)

కిందట తాను ప్రధాని మోదీని కలిసినప్పుడు, పునర్విభజనపై ఆయన వ్యక్తం చేసిన అభిప్రాయాలను కేసీఆర్ ఈ సందర్భంగా చంద్రబాబుకు వివరించారు. పునర్విభజనను ఇప్పుడు మొదలు పెట్టినా రెండేళ్లలో పూర్తికాదని, అందువల్ల 2024 నాటికి దేశవ్యాప్తంగా జరిగేలా చూద్దామన్నట్లుగా ప్రధాని అభిప్రాయపడ్డారని కేసీఆర్ వివరించారు. అయితే, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షాతో తాను మాట్లాడినప్పుడు ఇటువంటి అభిప్రాయమేదీ తన వద్ద వ్యక్తం చేయలేదని, తమ పార్టీలో అంతర్గతంగా కొంత వ్యతిరేకత ఉందని మాత్రమే ఆయన చెప్పారని చంద్రబాబు వివరించారు. నియోజక వర్గాల పెంపు రెండు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ స్థిరత్వానికి దోహదం చేస్తుందనే కోణంలో మరోసారి కేంద్రం వద్ద ప్రయత్నం చేసి చూద్దామని, రెండు రాష్ట్రాలకైతే ఇప్పుడున్న సమయం సరిపోతుందని చంద్రబాబు అన్నారు. తమవైపు నుంచి చేయాల్సిన ప్రయత్నం చేశామని, ఎన్డీయే భాగస్వామ్యపక్ష నేతగా చంద్రబాబే చొరవ తీసుకోవాలని కేసీఆర్ అన్నారు.

భూసేకరణతో చిక్కులే

భూసేకరణ సమస్యలు కూడా కేసీఆర్, చంద్రబాబు మధ్య ప్రస్తావనకు వచ్చాయి. ఈరోజు తాను పురుషోత్తమపట్నం ప్రాజెక్టును ప్రారంభించి వస్తున్నానని, దానికి భూసేకరణలో ఎన్నో సమస్యలు సృష్టించారని చంద్రబాబు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు భూసేకరణలో కూడా ఇలాంటి చిక్కుముడులే ఎదురవుతున్నాయని, అయినా, ఓపికగా పరిష్కరించుకుంటూ వస్తున్నామని వివరించారు. తెలంగాణలో తమ పరిస్థితి కూడా అలాగే ఉందని కేసీఆర్ వివరించారు. భూసేకరణకు మరింత సులువైన విధానంపై అన్వేషణ జరపాలని, రైతులకు తగిన నష్టపరిహారం ఇస్తూ భూమిని త్వరితంగా సేకరించే మార్గాలను కేంద్రం దృష్టికి తేవాలని వారు అనుకున్నారు. జీఎస్టీ ప్రభావంపై కూడా వారి మధ్య కొంత చర్చ జరిగింది. ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులకు జీఎస్టీని వర్తింపచేయడంపై కేసీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై మరికొంత అధ్యయనం చేయాల్సి ఉందని, ఆ తర్వాత జీఎస్టీ కౌన్సిల్‌లో చర్చిద్దామని చంద్రబాబు సూచించారు.

కృష్ణా జలాలపైనా కేంద్రంపై ఒత్తిడి

కృష్ణా జలాల పరిస్థితి కూడా వారి మధ్య చర్చకు వచ్చింది. వచ్చిన నీళ్లన్నీ ఎగువన కర్ణాటకలో నిల్వ ఉండిపోవడం వల్ల రెండు తెలుగు రాష్ట్రాల్లోని కృష్ణా ఆయకట్టు పరిస్థితి దారుణంగా తయారైందని ముఖ్యమంత్రులు ఆందోళన వ్యక్తం చేశారు. వచ్చిన నీరంతా పైనే ఆగిపోకుండా దామాషా పద్ధతిలో కిందికి విడుదల కావడానికి ఏదైనా మార్గం ఆలోచించాలని కేంద్రాన్ని కోరాలని అభిప్రాయపడ్డారు. రెండు రాష్ట్రాల మధ్య అపరిష్కృత సమస్యలు కూడా ప్రస్తావనకు వచ్చాయి. ప్రత్యేకించి 9, 10 షెడ్యూళ్లలోని సంస్థల మధ్య ఆస్తుల విభజనపై దృష్టి కేంద్రీకరించాలని అనుకున్నారు. గతంలో మాదిరిగా ఉభయ రాష్ట్రాల మంత్రుల కమిటీలతో గవర్నర్ మరికొన్ని సమావేశాలు జరిపితే బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తమయింది. గతంలో ఫలితం కనిపించలేదని, అయినా ప్రయత్నం చేసి చూస్తానని గవర్నర్ వ్యాఖ్యానించారు.

నవ్వుల హోం

ఇటు కేసీఆర్.. అటు చంద్రబాబు! తొలిసారిగా పవన్ కల్యాణ్! మునుపెన్నడూ లేని విధంగా ఏకంగా రెండు గంటలపాటు ఇద్దరు చంద్రులతో నరసింహుడి త్రైపాక్షిక చర్చలు! ఆ తర్వాత విడిగా అర గంట పాటు జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో భేటీ! పక్కపక్కనే కూర్చున్న మంత్రి కేటీఆర్, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి! పవన్ కల్యాణ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

అక్టోబరు నుంచి రాజకీయాల్లోనే: పవన్

ఇద్దరు సీఎంలు వెళ్లిపోయిన తర్వాత పవన్ కల్యాణ్‌తో గవర్నర్ దాదాపు అరగంటపాటు భేటీ అయ్యారు. ఉద్దానం కిడ్నీ బాధితుల సమస్యపై జరిగిన కృషి.. ఇప్పటిదాకా జరిగిన చర్యల గురించి చర్చించారు. అంతకు ముందు చంద్రబాబు పవన్‌తో విడిగా ఐదు నిమిషాలపాటు మాట్లాడారు. ఉద్దానం ప్రాంతంలో మరికొన్ని డయాలసిస్ కేంద్రాలను త్వరలో ప్రారంభిస్తున్నట్లు పవన్‌కు ముఖ్యమంత్రి చెప్పారు. అంతకు ముందు పవన్ కొద్దిసేపు తెలంగాణ కేటీఆర్, దత్తాత్రేయ, లక్ష్మణ్ తదితరులతో పిచ్చాపాటిగా మాట్లాడారు. రెండు ప్రాంతాలవారి పలుకుబడులు, యాసలు, ఇటీవలే విడుదలైన ఫిదా సినిమా తదితర అంశాలు వారిమధ్య చర్చకు వచ్చాయి. పవన్ పక్కనే ఎంపీ సుబ్బిరామిరెడ్డి కూర్చుని జోకులు వేస్తూ నవ్వులు పూయించారు. రాజకీయాల్లో పరిస్థితి, కేసీఆర్ సర్వే తదితర అంశాల చర్చతో ఇద్దరి మధ్య నవ్వులే నవ్వులు. దాదాపు 10 నిమిషాలపాటు వీరిద్దరూ పక్కపక్కనే కూర్చున్నారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి పవన్ కల్యాణ్‌తో చేతులు కలుపుతూ 'ఐయామ్ ఉత్తమ్‌కుమార్. పీసీసీ ప్రెసిడెంట్' అని పరిచయం చేసుకున్నారు. ఆ తర్వాత, మంత్రి కేటీఆర్‌కు పవన్‌ను పరిచయం చేయడానికి గవర్నర్ ప్రయత్నించారు. దాంతో, 'మా మధ్య మంచి స్నేహం ఉంది' అని కేటీఆర్ బదులిచ్చారు. ఈ తర్వాత, అక్టోబరు తర్వాత పూర్తిస్థాయిలో రాజకీయాల్లోకి దిగనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్‌కు గుర్తు చేసిన పవన్ కల్యాణ్, తెలంగాణకు ఇన్‌చార్జిగా శంకర్‌ను నియమిస్తున్నట్లు తెలిపారు. ఆ తర్వాత సీఎం కేసీఆర్ కూడా పవన్ కల్యాణ్‌తో కాసేపు మాట్లాడారు. పవన్ కల్యాణ్‌ను తీసుకొచ్చాను చూశారా? అని ఏపీ మంత్రి కామినేని శ్రీనివాస్‌తో గవర్నర్ ఛలోక్తి విసిరారు. 'మీరు దేనికైనా సమర్థుల'ని కామినేని బదులిచ్చారు.

పవన్ అభిమానికి చెంపదెబ్బ

పవన్ కల్యాణ్‌తో సెల్ఫీ దిగాలని హైదరాబాద్‌కు చెందిన వరప్రసాద్ అనే అభిమాని ప్రయత్నించగా.. నాగసాయి అనే భద్రతాధికారి ఆ అభిమాని చెంప చెళ్లుమనిపించారు. పవన్ అనుమతితోనే సెల్ఫీ దిగడానికి ప్రయత్నించగా తనపై దాడి చేశారని ఆ తర్వాత అభిమాని విచారం వ్యక్తం చేశారు. అయితే, వీఐపీ గ్యాలరీ నుంచి పవన్ బయటికి రావడంతో తొక్కిసలాట వాతావరణం నెలకొంది.

ఉత్తమ్‌తోనే కేటీఆర్

నేరెళ్ల రాజకీయాలు రాష్ట్రంలో హాట్ హాట్‌గా మారడం.. టీపీసీసీ చీఫ్‌ను మంత్రి కేటీఆర్ పలకరించారు. అంతేనా, ఇద్దరూ కలిసి అరగంటపాటు హాట్ హాట్‌గా నేరెళ్ల అంశంపైనే చర్చించుకున్నారు. దళితులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకున్నామని, ఎస్పీపై కూడా విచారణ జరుగుతోందని కేటీఆర్ గుర్తు చేసినట్లు సమాచారం. అలాగే, మిడ్‌మానేరును ఖాళీ చేయడానికే ఇసుకను తరలిస్తున్నామని, అంతే తప్పితే, ఇందులో వేరే రాజకీయాలు ఏమీ లేవని కూడా కేటీఆర్ వివరించినట్లు తెలిసింది. పదేళ్లలో రానంత ఆదాయాన్ని ఈ మూడేళ్లలోనే ఖజానాకు అందించామని, ఇసుక మాఫియాకు తావే లేదని స్పష్టం చేసినట్లు తెలిసింది. అయితే, ఒకే నంబర్‌తో ఆరేడు లారీలు ఏ విధంగా ఇసుకను తరలిస్తున్నాయని ఉత్తమ్ నిలదీసినట్లు తెలిసింది. ప్రాణాలు పోతున్నందుకే లారీలపై దాడులకు పాల్పడ్డారని బదులిచ్చినట్లు సమాచారం.

నియోజకవర్గాల పెంపు లేకపోతే

లాభం మనకే...

- బీజేపీ తెలంగాణ శ్రేణుల విశ్వాసం
- అమిత్‌షా మలివిడత పర్యటన తర్వాత పార్టీలోకి చేరికలు
- 70 అసెంబ్లీ స్థానాల్లో గెలుపే లక్ష్యం

హైదరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ విషయంలో చోటు చేసుకుంటున్న పరిణామాలపై తెలంగాణ బీజేపీ వర్గాలు సంతోషంగా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో నియోజకవర్గాల పెంపు పార్లమెంట్ ద్వారానే జరగాలని, రాజ్యాంగ సవరణ తప్పనిసరని కేంద్రం ఇటీవల స్పష్టంచేసిన విషయం విదితమే. ఈ విషయంలో ఏపీలోని బీజేపీ నేతల వైఖరి ఎలా ఉన్నా.. తెలంగాణ బీజేపీ నేతలు మాత్రం సంతోషంగా ఉన్నారు. ఈ పరిణామం తెలంగాణలో తమ పార్టీ బలోపేతానికి ఎంతో ఉపకరిస్తుందని కమలనాథులు చెబుతున్నారు. నియోజకవర్గాల పెంపు ఉంటుందన్న ఆశతో కాంగ్రెస్, టీడీపీ, వైసీపీ నుంచి టీఆర్ఎస్‌లోకి వలసలు భారీగా పెరిగాయని, నియోజకవర్గాల పెంపు ఉంటే లాభపడేది సీఎం కేసీఆరేనని బీజేపీ భావిస్తోంది. నియోజకవర్గాల పెంపు లేకుంటే టీఆర్ఎస్, కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి నేతలు పెద్దసంఖ్యలో చేరే అవకాశముందని కమలం నేతలు ధీమాగా చెబుతున్నారు. నియోజకవర్గాల పెంపు చేపడితే తెలంగాణలో పార్టీకి తీవ్ర నష్టం తప్పదంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ అధిష్ఠానానికి నివేదించినట్లు సమాచారం. అయితే రాజ్యాంగబద్ధంగా నియోజకవర్గాల పెంపు చేపడితే తాము వ్యతిరేకించబోమని ఆ పార్టీ నేతలు స్పష్టం చేస్తున్నారు. కేవలం వలస నేతలను సంతృప్తిపరిచేందుకే నియోజకవర్గాల పెంపును చేపట్టాలని అధికార పార్టీ కేంద్రం వద్ద చేస్తున్న లాబీయింగ్‌ను వారు ఖండించారు. 2019లోనూ కేంద్రంలో అధికారంలోకి వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని స్పష్టంచేస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికార టీఆర్ఎస్‌తో పాటు కాంగ్రెస్, టీ-టీడీపీ నుంచి చేరికలు పెరుగుతాయని బీజేపీ రాష్ట్ర నాయకత్వం భావిస్తోంది.

ప్రత్యేకంగా అధిష్ఠానం సర్వే

మరోవైపు బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా తెలంగాణలో పార్టీ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించారు. బీజేపీ రాష్ట్ర నాయకత్వం ప్రమేయం లేకుండా నియోజకవర్గాల వారీగా పార్టీ పరిస్థితిపై సమాచారం సేకరిస్తున్నట్లు తెలిసింది. అదే సమయంలో ఇతర పార్టీల్లోని బలమైన నేతలు, అసంతృప్తుల వివరాలు సేకరిస్తున్నట్లు తెలిసింది. ఇందుకు ఆర్ఎస్ఎస్ నెట్‌వర్క్‌ను రంగంలోకి దింపినట్లు పార్టీ రాష్ట్ర నేతల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. ఇప్పటికే పలుపార్టీల ఎంపీ అభ్యర్థులు బీజేపీలో చేరేందుకు మంతనాలు జరుపుతున్నట్లు తెలిసింది. ఏ స్థానాల్లో బలంగా ఉన్నాం... ఎక్కడ వీక్‌గా ఉన్నామన్న విషయంలోనూ బీజేపీ రాష్ట్ర నాయకత్వంతో పాటు అధిష్ఠానం కూడా సర్వే చేయిస్తున్నట్లు సమాచారం. 119 అసెంబ్లీ స్థానాలకు 2019 ఎన్నికల్లో 70సీట్లను గెలుచుకోవటమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు బీజేపీ నేతలు చెబుతున్నారు. ప్రస్తుతం 40-50 స్థానాల్లోనే బీజేపీకి బలమైన అభ్యర్థులున్నారు. మిగతాచోట్ల ఇతరపార్టీల్లోని ప్రజాకర్షణ ఉన్న నేతలను చేర్చుకొని పోటీకి దింపాలన్నది బీజేపీ వ్యూహంగా కనిపిస్తోంది. ఇందుకు 'ఆపరేషన్ తెలంగాణ'ను అధిష్ఠానమే అమిత్ సారథ్యంలో అమలు చేయనున్నట్లు సమాచారం.



సీఎం కేసీఆర్ చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న సీ వీ ఆనంద్ | ప్రవీణ్ కుమార్ | వాకాటి కరుణ | శివప్రసాద్ | అంజనీ కుమార్ | రాజీవ్ రతన్ | సిద్ధయ్య భార్య ధరణి | పెద్ది సుదర్శన్

అవార్డు గ్రహీతలు వీరే

కొలువుల ఏడాది

ఘనంగా పంద్రాగస్టు

- **55 అడుగుల ఎత్తున్న త్రివర్ణ పతాకం ఎగరేసిన కేసీఆర్**

హైదరాబాద్, లంగర్‌హౌజ్, ఆగస్టు 15: గోల్కొండ కోట రాణీమహల్ ప్రాంగణంలో 71వ స్వాతంత్ర్య దినోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ 55 అడుగుల ఎత్తున్న జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి శాల్యూట్ చేశారు. వివిధ రంగాల్లో ప్రతిభ ప్రదర్శించిన నలుగురు ఏఐఎస్‌లతోపాటు పలువురు ఉద్యోగులకు అవార్డులను ప్రదానం



గోల్కొండ కోటపై జాతీయ జెండాకు శాల్యూట్ చేస్తున్న సీఎం కేసీఆర్

చేశారు. సంస్కృత పండితుడు భాష్యం విజయ సారథికి కేసీఆర్ తొలుత పాదాభివందనం చేసి.. పురస్కారాన్ని ప్రదానం చేశారు. అలాగే, ప్రముఖ పాటల రచయిత సుద్దాల అశోక్ తేజ, ప్రముఖ కళాకారుడు జయరాజ్ కూడా సీఎం కేసీఆర్ నుంచి విశిష్ట పురస్కారం అందుకున్నారు. 2016 స్వాతంత్ర్య దినోత్సవ పురస్కారాలను ఐపీఎస్‌లు అంజనీకుమార్, రాజీవ్ రతన్, రిపబ్లిక్ డే-2016 మెడల్‌ను మాజీ ఐపీఎస్ ఎన్.సూర్యనారాయణ, ఐపీఎస్ అధికారి ఎం.శివప్రసాద్, రిపబ్లిక్ డే-2015 ఇండియన్ మెడల్‌ను పలువురికి అందించారు. టి.శరత్‌బాబు, నీలగిరి దివ్య చరణ్‌రావు, టి.సుదర్శన్, వుప్పు తిరుపతి, మదాడి రమణకుమార్, మాదంశెట్టి వెంకట్రావు, పటోళ్ల మధుసూదన్ రెడ్డి, శవలి ప్రేమ్‌రాజ్, సయ్యద్ యూసుపుద్దీన్, గజ్జెల లక్ష్మయ్య, అన్నుదామోదర్ రెడ్డి, సిద్ధా సదానందంలకు సీఎం అందించారు. ఆ తర్వాత, సూర్యాపేట వద్ద దోపిడీ ముఠా కాల్పుల్లో బలైన ఎస్సై డి.సిద్దయ్య భార్యకు కారుణ్య నియామకం, సహాయంపై వెనువెంటనే చర్యలు తీసుకోవాలని డీజీపీని ఆదేశించారు.

(మొదటి పేజీ తరువాయి)

తీవ్ర విఘాతం కలిగించేందుకు ప్రతీప శక్తులు ఎన్ని కుట్రలు చేస్తున్నా.. ప్రజల ఆశీర్వాదంతో వాటన్నింటినీ ఛేదిస్తూ ముందడుగు వేస్తున్నాం. తెలంగాణ ప్రజల సర్వతోముఖాభివృద్ధి కోసం నిరంతరం పాటుపడే మా ఏకాగ్రతను ఎటువంటి క్షుద్ర ప్రయత్నాలతో మరల్చలేరు" అని కేసీఆర్ స్పష్టం చేశారు. భారత జాతీయోద్యమం స్ఫూర్తితో అహింసా మార్గంలో, శాంతియుత పంథాలో పోరాడి రాష్ట్రాన్ని సాధించుకున్నామని, ఆ ఆశయ లక్ష్యసాధన దిశగా రాష్ట్రం పురోగమిస్తోందని, అద్భుత విజయాలు సాధిస్తూ ముందడుగు వేస్తున్నామని చెప్పారు. "సాధారణంగా కొత్తగా ఏర్పడిన రాష్ట్రాలు అంత తొందరగా కుదురుకోవు. కానీ ఈ పరిస్థితిని మన రాష్ట్రం సమర్థంగా అధిగమించింది. 2016-17 ఆర్థిక సంవత్సరంలో 21.7 శాతం ఆదాయ వృద్ధి రేటుతో దేశంలోనే అగ్రభాగాన నిలిచింది. ఇది మనందరికీ గర్వకారణం. రాష్ట్ర ప్రగతికి శుభసూచకం. ప్రభుత్వ పారదర్శక విధానాలు, పటిష్ఠ ఆర్థిక క్రమశిక్షణ ఫలితమిది. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల రూపకల్పనలో ప్రభుత్వం నూతన ఒరవడిని సృష్టించింది" అని వివరించారు. అభివృద్ధి, సంక్షేమం అనే రెండు చక్రాల మీద పరిపాలన సాగుతోందన్నారు. కేవలం ఆర్థిక లక్ష్యాలను సాధించ డ వే ు క ర్త వ్యంగా భావించే యాంత్రిక ధోరణిని విడనాడి.. సమానత్వం, సామాజిక న్యాయం అనే ఉదాత్త లక్ష్యాలను సాధించే దిశగా ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల వేతనాల పెంపునకు ప్రభుత్వం తపన పడుతుంటే కొన్ని ప్రతీప శక్తులు సంకుచితత్వంతో అడ్డుతగులుతున్నాయని మండిపడ్డారు.

జిల్లాల్లో షీ టీమ్స్

మహిళలపై వేధింపులను అరికట్టడంలో షీ టీమ్స్ సమర్థంగా పని చేస్తున్నాయని, ప్రజల విజ్ఞప్తితో వాటిని జిల్లాల్లో విస్తరించాలని నిర్ణయించామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. డ్రగ్స్ వంటి సామాజిక రుగ్మతలను ఆదిలోనే అంతం చేసేందుకు ప్రభుత్వం రాజీ లేని వైఖరిని అవలంబిస్తోందని చెప్పారు. మిషన్ భగీరథ లక్ష్యాన్ని ముద్దాడే దిశగా రేయింబవళ్లు శ్రమిస్తున్నామని చెప్పారు. గురుకులాల్లో ఆంగ్ల మాధ్యమంలో విద్య అందిస్తున్నామని గుర్తు చేశారు. కేసీఆర్ కిట్‌తో ఆస్పత్రుల్లో ప్రసవాలు పెరిగాయని, రెండున్నర నెలల్లోనే 42 వేలమంది కిట్లు అందుకున్నారని చెప్పారు.

నవంబరులో ప్రపంచ పారిశ్రామికవేత్తల సదస్సు

పారిశ్రామిక రంగంలో ప్రభుత్వం ప్రదర్శిస్తున్న చొరవ, స్ఫూర్తికి ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక ప్రశంసలు లభిస్తున్నాయని సీఎం కేసీఆర్ చెప్పారు. టీఎస్ఐపాస్ ఇతర రాష్ట్రాలకు కరదీపికగా మారిందని, ఇప్పటి వరకూ రూ.1,01,700 కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని, 4,118 నూతన పరిశ్రమలకు అనుమతులు ఇచ్చామని, వీటితో 2.90 లక్షల మందికి ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయని ప్రకటించారు. ప్రపంచం దృష్టిని ఆకట్టుకున్న తెలంగాణ ప్రపంచ పారిశ్రామికవేత్తల సదస్సుకు వేదిక కానుందని ప్రకటించారు. నవంబర్ 28 నుంచి 30 వరకు హైదరాబాద్‌లో జరిగే సదస్సుకు ప్రధాని మోదీతో పాటు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కుమార్తె ఇవాంకా హాజరవుతున్నారని చెప్పారు.

చరిత్ర సృష్టించిన తెలంగాణ రైతాంగం

"ఉమ్మడి రాష్ట్రంలో వివక్ష, విద్రోహపూరిత విధానాలతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా ఛిన్నాభిన్నమైంది. దశాబ్దాల జీవన విధ్వంసంతో గ్రామీణ జీవితం సంక్షోభంలో కూరుకుపోయింది. శ్రమించేతత్వం, వృత్తి నైపుణ్యం కలిగిన తెలంగాణ ప్రజానీకాన్ని 'అన్నమో రామచంద్రా' అంటూ దూర దేశాలకు వలస పోవాల్సిన దుర్గతి పట్టించారు. కూలిన బతుకులను నిలబెట్టేందుకు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేసేందుకు నడుం కట్టాం. మిషన్ కాకతీయ అమలు చేశాం. చెరువుల్లో నీటి నిల్వతో ఈ ఏడాది చరిత్రలో ఎన్నడూ లేనంతగా పంటలు పండాయి. దాదాపు 9 6 లక్షల టన్నుల ధాన్యం పండించి తెలంగాణ రైతాంగం నూతన చరిత్రను లిఖించింది" అని తెలిపారు. అందరికీ ఆదర్శంగా నిలిచే పంట సాయం పథకాన్ని వచ్చే ఏడాది ప్రారంభించనున్నామని, రాష్ట్రాన్ని పంట కాలనీలుగా విభజించనున్నామని తెలిపారు.



అవార్డులు అందుకున్న సుద్దాల అశోక్‌తేజ, జయరాజ్

భూముల సర్వేతో కొత్త చరిత్ర

సమగ్ర భూ సర్వేతో తెలంగాణలో కొత్త చరిత్ర సృష్టించబోతున్నామని సీఎం కేసీఆర్ చెప్పారు. 1936లో నిజాం తర్వాత 81 ఏళ్లకు మళ్లీ దీనిని నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయడానికి రైతులే సారథ్యం వహించాలని, వారే కథానాయకులు కావాలని పిలుపునిచ్చారు. "ఇది ఎవరి పనిగానో భావించి ప్రేక్షక పాత్ర వహించవద్దు. స్వచ్ఛందంగా ముందుకొచ్చి రైతు సంఘాలు సర్వేను విజయవంతం చేయాలి. ఆ తర్వాత భూ రికార్డులన్నీ సరి చేస్తాం. కొత్త పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తాం" అని వివరించారు. మానవ వనరులను గుర్తించేందుకు ప్రభుత్వ వ్యవస్థలు ఇప్పటిదాకా అనుసరిస్తున్న సంకుచిత వైఖరితో వృత్తి కులాలకు సహకారం లభించలేదని, గ్రామాల్లోని మానవ వనరుల గుర్తింపునకు సరికొత్త విధానాన్ని అవలంబిస్తున్నామని చెప్పారు.



సీఎం చేతుల మీదుగా అవార్డు స్వీకరిస్తున్న విజయసారథి

ప్రజల అండదండలే తిరుగులేని ఆత్మబలం

- **తెలంగాణ దేశానికే తలమానికం: కేటీఆర్**



సిరిసిల్ల: శ్రామిక జనుల సౌభాగ్యం, సకల జనుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం మొక్కవోని దీక్షతో ముందుకు సాగుతోందని, ప్రజల అండదండలే తమకు తిరుగులేని ఆత్మబలాన్ని, అంకితభావాన్ని పెంపొందిస్తున్నాయని పురపాలక, ఐటీశాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాలకు అట్టడుగు స్థాయి వరకు అభివృద్ధి ఫలాలను చేరవేస్తామన్నారు. మహాత్ముడి అహింసా మార్గం, ప్రజాస్వామ్య పద్ధతిలో సబ్బండ వర్గాలు ఏకమై మహోద్యమాన్ని నిర్మించి తెలంగాణ రాష్ట్రానిన సాధించుకున్నామని చెప్పారు. ప్రజలే కేంద్ర బిందువుగా ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారంగా టీఆర్ఎస్ ప్రభుత్వ సుపరిపాలన సాగిస్తోందని చెప్పారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలలో తెలంగాణ రాష్ట్రం దేశానికి తలమానికంగా నిలుస్తోందని ఆయన అన్నారు.

నీటి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యం: ఈటల



కరీంనగర్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సాగు, తాగు నీటి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యతనిస్తుందని రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం కరీంనగర్ పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి సందర్భంగా ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ అపర భగీరథుడిలా పని చేస్తున్నారని, రాష్ట్రంలో కోటి ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో గోదావరిలో వృథాగా పోతున్న జలాలను మళ్లించి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసేందుకు కంకణం కట్టుకున్నారని చెప్పారు. పునరుజ్జీవనం పథకంతో ఉత్తర తెలంగాణలోని అన్ని జిల్లాలు సస్యశ్యామలమవుతాయని పేర్కొన్నారు. ఎరువులు, విత్తనాల కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామని అన్నారు.

త్యాగాల వల్లే దేశానికి స్వాతంత్ర్యం

- **ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు**



హైదరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఎందరో వీరుల త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం లభించిందని, ఆ ఫలాలు ప్రజలందరికీ అందించడానికి శాయశక్తులా కృషి చేయాలని తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం విద్యుత్తు సౌధలో జాతీయ జెండాను ఆవిష్కరించిన ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రూ.36 వేల కోట్ల వ్యయంతో 5,880 మెగావాట్ల సామర్థ్యం గల విద్యుత్తును అదనంగా పెంచుకున్నామని తెలిపారు. 600 మెగావాట్ల కాకతీయ థర్మల్, 240 మెగావాట్ల జూరాల, 30 మెగావాట్ల సామర్థ్యం గల పులిచింతల ప్రాజెక్టులు నిర్మించుకున్నామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడేనాటికి 6,574 మెగావాట్ల సామర్థ్యం గల విద్యుత్తు ఉండగా.. ప్రస్తుతం 13,095 మెగావాట్లకు చేరుకున్నామని పేర్కొన్నారు. 2018 మే నుంచి వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇస్తామని ప్రకటించారు. కాగా, రాష్ట్రంలో విద్యుత్తు వినియోగాన్ని పర్యవేక్షించడానికి వీలుగా తెలంగాణ విద్యుత్తు శక్తి పేరుతో రూపొందించిన యాప్‌ను ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు ఆవిష్కరించారు. డిస్కంలు, జిల్లాల వారీగా విద్యుత్తు వినియోగం, గతేడాదితో పోల్చితే కరెంట్ వినియోగం ఏ విధంగా ఉంది వంటి అంశాలను మొబైల్ ఫోన్‌లో చూసుకోవడానికి వీలుగా దీన్ని రూపొందించారు.



హజ్ యాత్రికుల బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న సీఎం కేసీఆర్

రాష్ట్రానికి ముఖ్య సేవకుడిని: కేసీఆర్

హైదరాబాద్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి తాను ముఖ్య సేవకుడినని సీఎం కేసీఆర్ అన్నారు. ఆర్థిక నిపుణుల అంచనా ప్రకారం 2024 నాటికి తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ రూ.5 లక్షల కోట్లకు చేరుతుందని, ముస్లిం మైనారిటీలకు కేటాయింపులు రూ.12 వేల కోట్లకు పెరుగుతాయన్నారు. మంగళవారం సాయంత్రం నాంపల్లి హజ్‌హౌస్‌లో హజ్ యాత్రికుల బస్సును కేసీఆర్ జెండా ఊపి ప్రారంభించారు. భవిష్యత్తులో తెలంగాణ ప్రపంచంలోనే ఆదర్శంగా నిలవాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. హైదరాబాద్ రాష్ట్రం మొదటి నుంచి సంపన్న ప్రాంతమని, నిజాం రాజు ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడిగా గుర్తింపు పొందారన్నారు. చైనాతో యుద్ధ సమయంలో భారత్ దివాళా తీసిందని, అప్పటి ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి అభ్యర్థన మేరకు నిజాం రాజు 6 టన్నుల బంగారాన్ని లారీల్లో పంపారని తెలిపారు. ఈ మొత్తం తిరిగి ఇస్తామని శాస్త్రి చెప్పగా "నాకు దేవుడు చాలా ఇచ్చాడు.. ఈ నిధులను దేశాభివృద్ధి, రక్షణకు వినియోగించాలి" అన్నారని, ఆయనకు దేశంపై ఉన్న భక్తి విశ్వాసానికి ఇది నిదర్శనమన్నారు. 1927లో మహాత్మాగాంధీ హైదరాబాద్ వచ్చినప్పుడు ఇక్కడ హిందూ-ముస్లింల ఐక్యమత్యాన్ని చూసి ఆశ్చర్యపోయారన్నారు. ప్రత్యేక తెలంగాణను ఎందుకు కోరుతున్నారని ఉద్యమ సమయంలో ప్రధాని, కేంద్రమంత్రులు ప్రశ్నించగా తెలంగాణ సంస్కృతి-సంప్రదాయాల పరిరక్షణ, ప్రత్యేకతను నిలుపుకునేందుకే అని చెప్పానన్నారు. పవిత్ర మక్కాలో నిజాం నిర్మించిన రుబాత్‌కు కనీసం రంగులు కూడా వేయలేదని, తెలంగాణ ఏర్పడిన తర్వాత మరమ్మతులు చేసి హజ్‌యాత్రకు వెళ్లిన 1300 మందికి అక్కడ ఉచిత వసతి కల్పిస్తున్నామన్నారు.



జెండాను ఆవిష్కరించి వందనం చేస్తున్న ఏసీజే జస్టిస్ రమేశ్ రంగనాథన్

స్వాతంత్ర్యోద్యమంలో లాయర్లలదే కీలక పాత్ర: ఏసీజే

హైదరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర పోరాటంలో న్యాయవాదులే కీలక భూమిక పోషించారని ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని హైకోర్టు ఆవరణలో ఆయన పతాకావిష్కరణ చేశారు. మహాత్మాగాంధీ, తొలి గవర్నర్ జనరల్ రాజగోపాలాచారి, మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, తొలి రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్, భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ తదితరులంతా న్యాయవాదులేనని గుర్తు చేశారు.




మదీనాగూడ చౌరస్తాలో జాతీయ జెండాను ఎగురవేసిన అసదుద్దీన్ ఒవైసీ

దేశమంతా మాఫియాలే: చాడ

హైదరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): దేశమంతా మాఫియాలే ఉన్నాయని, భూదందాలు, ఇసుక, డ్రగ్స్ మాఫియాల వల్ల అవినీతి విచ్చివిడిగా పెరిగిపోతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. మఖ్దూంభవన్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఆయన మాట్లాడారు.

దళితులు, బీసీలపై దాడులు మంచిది కాదు: దత్తాత్రేయ



హైదరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): దళితులు, బీసీలు, ప్రజాస్వామిక వాదులపై దాడులు జరగటం తెలంగాణ సమాజానికి మంచిది కాదని కేంద్ర కార్మిక శాఖ మంత్రి దత్తాత్రేయ ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయిందన్నారు. నిజాంపై పోరాడిన విధంగానే పోరాడి తెలంగాణ విమోచదినాన్ని అధికారికంగా నిర్వహించేలా టీఆర్ఎస్ ప్రభుత్వం మెడలు వంచాలని బీజేపీ కార్యకర్తలు, ప్రజలకు పిలుపునిచ్చారు. మజ్లిస్‌పార్టీని సంతృప్తి పరిచేందుకే కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ విమోచనదినాన్ని అధికారికంగా నిర్వహించటంలేదని దుయ్యబట్టారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ ఆవిష్కరించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించుకోలేని దుస్థితి ఏర్పడిందని లక్ష్మణ్ అన్నారు. టీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో సామాజిక న్యాయం కొరవడిందని, రాష్ట్రం కుటుంబ పాలనలో మగ్గిపోతోందని మండిపడ్డారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు, బీజేఎల్పీ నేత కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హక్కులు కాలరాస్తున్న పాలకులు: ఉత్తమ్



హైదరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోనూ, రాష్ట్రంలోను పాలకులు ప్రజల హక్కులు కాలరాస్తూ దేశాన్ని తిరోగమనంవైపు నడిపిస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో మంగళవారం స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. ఆంగ్లేయుల పాలన కింద బానిస జీవనం గడుపుతున్న దేశ ప్రజలకు కాంగ్రెస్ స్వాతంత్ర్య ఫలాలను అందించిందని చెప్పారు. స్వాతంత్ర్యం కోసం ఎంతో మంది కాంగ్రెస్ నేతలు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారని పేర్కొన్నారు. ప్రస్తుతం మైనారిటీల మీద దాడులు, దళితులపైన నిర్బంధం, బీసీలపై అణచివేత కొనసాగుతోందని ఆరోపించారు. పాలకుల మాటలు వినకపోతే పోలీసులు థర్డ్ డిగ్రీ పేరిట హింసిస్తున్నారని, ఈ విషయాలపై మరో స్వాతంత్ర పోరాటం చేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. కాగా, కాంగ్రెస్ పాలకులు ప్రజల కోసం ఎన్నో చట్టాలు తీసుకువస్తే, నేటి పాలకులు వాటిని తొక్కి పెడుతున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి ఆరోపించారు.

కలిసి పనిచేస్తే అధికారం మనదే: సుజనా

- **బాబు వల్లే హైదరాబాద్ అభివృద్ధి: రమణ**
- **గులాబీ చీడ తొలగించేందుకు మరో ఉద్యమం: రేవంత్**

హైదరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): కలిసి పనిచేస్తే తెలంగాణలో టీడీపీకే రాజ్యాధికారం దక్కుతుందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి సుజనాచౌదరి అన్నారు. మంగళవారం ఎన్టీఆర్ భవన్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎన్టీఆర్ అధికారం చేపట్టాక పటేల్ పట్వారీ వ్యవస్థను రద్దు చేసి బలహీన వర్గాల వారిని రాజ్యాధికారంలోకి తీసుకువచ్చారని చెప్పారు. టీడీపీ ఆవిర్భావానికి ముందు ఒకటి, రెండు వర్గాల చేతుల్లోనే అధికారం ఉండేదని, ఇప్పుడు తెలంగాణలో మళ్లీ అవే పరిస్థితులు కొనసాగుతున్నాయని టీడీపీ-టీఎస్ అధ్యక్షుడు ఎల్.రమణ ఆరోపించారు. చంద్రబాబు కృషితోనే హైదరాబాద్ విశ్వనగరంగా అభివృద్ధి చెందిందని చెప్పారు. అణచివేత, అప్రకటిత ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా, గులాబీ చీడను తొలగించేందుకు తెలంగాణ ఉద్యమ తరహాలో మరో ఉద్యమం అవసరమని రేవంత్ రెడ్డి అన్నారు.



జెండా దిమ్మకు నమస్కరిస్తున్న పవన్‌కల్యాణ్

- **దేశం ఆత్మ ఒక్కటే : పవన్‌కల్యాణ్**

హైదరాబాద్ ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): దేశాన్ని రకరకాలుగా విభజించవచ్చు కాని, దేశం ఆత్మ మాత్రం ఒక్కటేనని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్య దినోత్సవం విలువ తెలియాలంటే మన దేశ చరిత్ర చదవాలని, భగత్‌సింగ్, గాంధీజీ చేసిన త్యాగాలు, అంబేడ్కర్ చేసిన కృషిని గురించి తెలుసుకోవాలన్నారు. ప్రతీ ఒక్క స్వాతంత్ర్య సమరయోధుడి జీవిత చరిత్ర తెలుసుకుంటే మనం ఎంత అదృష్టవంతులమో అనే విషయం అర్థమవుతుందన్నారు.

వైద్యవిద్యలో రెండో దశ సీట్ల కేటాయింపు

- తెలంగాణ హెల్త్ వర్సిటీ వెల్లడి

హైదరాబాద్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వైద్య విద్య సీట్ల భర్తీ ప్రక్రియలో భాగంగా కన్వీనర్ కోటాలో రెండో దశ కౌన్సెలింగ్‌కు సంబంధించిన సీట్లను మంగళవారం కేటాయించారు. సీట్లు పొందిన అభ్యర్థుల వివరాలను తెలంగాణ హెల్త్ వర్సిటీ ప్రకటించింది. వైద్య సీట్లు పొందిన విద్యార్థులు ఆయా కాలేజీల్లో ఈ నెల 19వ తేదీ లోపు చేరాల్సి ఉంటుందని యూనివర్సిటీ అధికారులు వెల్లడించారు. అప్పటికీ ఇంకా ఏమైనా సీట్లు మిగిలితే... వాటి భర్తీ కోసం మాపప్ పద్ధతిలో కౌన్సెలింగ్ నిర్వహించాలని నిర్ణయించారు. కాగా బీ, సీ కేటగిరిల్లో తొలి దశ కౌన్సెలింగ్ తర్వాత మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈ నెల 17, 18 తేదీల్లో ప్రత్యేక వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

రీజియన్ల వారీగా విద్యార్థుల నీట్ ర్యాంకుల కటాఫ్ వివరాలు

విద్యార్థి కేటగిరీ	ఓయూ	ఎస్‌యూ	ఏయూ
ఓసీ(పు)	25,071	19,973	20,886
ఓసీ(మ)	25,277	13,648	21,248
ఎస్సీ(పు)	95,237	18,825	80,163
ఎస్సీ(మ)	95,314	79,325	80,366
ఎస్టీ(పు)	73,659	--	--
ఎస్టీ(మ)	74,540	--	--
బీసీ-ఏ(పు)	81,617	24,654	54,630
బీసీ-ఏ(మ)	81,937	50,452	56,542
బీసీ-బి(పు)	40,073	25,892	37,014
బీసీ-బి(మ)	40,007	--	35,060
బీసీ-సి(పు)	67,783	--	--
బీసీ-సి(మ)	73,931	--	27,995
బీసీ-డి(పు)	40,938	3,437	27,724
బీసీ-డి(మ)	40,595	2,026	30,835
బీసీ-ఇ(పు)	55,626	--	--
బీసీ-ఇ(మ)	57,313	1,662	--

క్రమబద్ధీకరణ సాధ్యం కాదు!

- తిరుపతిరావు కమిటీ నివేదిక స్పష్టం
- నెరవేరని కాంట్రాక్టు లెక్చరర్ల ఆశలు

హైదరాబాద్, అగస్టు 15 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు లెక్చరర్ల ఆశలు అడియాసలయ్యాయి. వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించడం సాధ్యం కాదని తిరుపతిరావు కమిటీ స్పష్టం చేసింది. అయితే ప్రత్యామ్నాయంగా వేతనాలను భారీగా పెంచాలని సూచించింది. ఈ మేరకు కమిటీ తన నివేదికను మరో రెండు రోజుల్లో ప్రభుత్వానికి అందజేయనుంది. యూనివర్సిటీ, డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో దాదాపు 6 వేల మంది కాంట్రాక్టు లెక్చరర్లు పని చేస్తున్నారు. క్రమబద్ధీకరణకు బదులుగా వీరికి నెలకు కనీసం రూ.48 వేల వేతనం ఇవ్వాలని నివేదికలో సిఫారసు చేసినట్లు తెలిసింది. సీనియారిటీకి అనుగుణంగా కూడా ఎక్కువ వేతనం ఇవ్వాలని సూచించింది. తద్వారా వారికి కొంత ఉపశమనంగా ఉంటుందని కమిటీ అభిప్రాయపడినట్లు సమాచారం. గతంలో వేతనాలు పెంచాలని ఆందోళన చేయడంతో కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లకు రూ.37,100, డిగ్రీ లెక్చరర్లకు రూ.40,270గా ప్రభుత్వం నిర్ణయించింది. అయితే యూనివర్సిటీల్లో పని చేసే కాంట్రాక్టు లెక్చరర్లకు మాత్రం వివిధ రకాలుగా వేతనాలు అందుతున్నాయి. వీరిని క్రమబద్ధీకరిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. నిబంధనలు అనుకూలంగా లేకపోవడంతో క్రమబద్ధీకరణ చేసే అవకాశం లేదని వేతనాల పెంపు తర్వాత ప్రభుత్వమే సూత్రప్రాయంగా తేల్చి చెప్పింది. ఈ అంశంపై అధ్యయనానికి ఉన్నత విద్యా మండలి, ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీ నేతృత్వంలో కమిటీని నియమించింది. కాగా, క్రమబద్ధీకరణ సాధ్యం కాని నేపథ్యంలో తగిన ప్రతిఫలం కోరతామని కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం నేతలు కొందరు చెబుతున్నారు. మరికొందరు మాత్రం ఉద్యమం చేయకతప్పదని అంటున్నారు. మరోవైపు క్రమబద్ధీకరణ సాధ్యం కాదని తేలడంతో ఇప్పటికే ప్రకటించినట్లు యూనివర్సిటీల్లో 1061 అధ్యాపక పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలను వేగవంతం చేసింది. 20 రోజుల్లో ముందస్తు ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందని సమాచారం. తర్వాత వారంలోగా నోటిఫికేషన్ జారీ చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ భాస్కర్‌రెడ్డి

ఊర్లో ఒకే గణేషుడు

- చందాల వేధింపుల్లేవు.. శబ్ద కాలుష్యానికీ విరుగుడు
- తీర్మానం చేసిన ఎంసీపల్లి గ్రామస్థులు

శామీర్‌పేట రూరల్, ఆగస్టు 15: గణేశ్ చవితి వచ్చిందంటే, సంబరాల మాట అటుంచి జనాలకు ఎన్నో సమస్యలు! విగ్రహం పెడతామంటూ వచ్చేవారి నుంచి చందాల పేరిట వేధింపుల మొదలు.. నవరాత్రులన్ని రోజులూ మండపాల వద్ద చెవులు దద్దరిల్లిపోయేలా సౌండ్ బాక్సుల హోరు.. నిమజ్జనం ఊరేగింపు సందర్భంగా గల్లీలో చేసే ఆర్భాటాలతో ప్రజలు పడే ఇబ్బందులు అన్నీఇన్నీ కావు!! కర్ణభేరి బద్దలవుతుందా? అనేంతగా శబ్దకాలుష్యానికి తోడు విగ్రహాల నిమజ్జనంతో అటు చెరువులూ కాలుష్యం బారిన పడుతున్నాయి. ఊర్లలో ఒకరికి మరొకరు పోటీగా పదుల సంఖ్యలో విగ్రహాలను పెడుతూ సమస్యలు సృష్టిస్తున్న నేపథ్యంలో మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం మూడుచింతలపల్లి (ఎంసీపల్లి) గ్రామస్థులు కీలకనిర్ణయం తీసుకున్నారు. ఈసారి వినాయక చవితిని పురస్కరించుకొని ఊర్లో ఒక్క గణేషుడినే ప్రతిష్ఠించాలని సర్పంచ్ పద్మ సమక్షంలో ప్రజలు తీర్మానం చేశారు. ప్రతిని శామీర్‌పేట సీఐ భాస్కర్‌రెడ్డికి అందజేశారు. ఊర్లో ఒక్క వినాయకుడినే పెట్టడం గ్రామస్థుల ఐక్యతకు నిదర్శనం అని సీఐ భాస్కర్‌రెడ్డి కొనియాడారు.

2345 పోస్టులకు నోటిఫికేషన్

అటవీశాఖలో 2014, వైద్యవిధాన పరిషత్‌లో 331

- త్వరలో మరిన్ని పోస్టులకు నోటిఫికేషన్
- టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి

హైదరాబాద్, ఆగస్టు15(ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నుంచి మరో భారీ నోటిఫికేషన్ జారీ అయింది. వివిధ కేటగిరీల్లో 2345 పోస్టుల భర్తీకి మంగళవారం నోటిఫికేషన్ ఇచ్చింది. ప్రధానంగా అటవీ శాఖలోనే 2014 పోస్టులు భర్తీ చేయనున్నారు. ఇందులో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పోస్టులు 1857, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పోస్టులు 67, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టులు 90 ఉన్నాయి. మిగతా వాటిలో వైద్య విధాన పరిషత్ పరిధిలోని అసిస్టెంట్ సర్జన్స్, లెక్చరర్స్, ట్యూటర్ పోస్టులు కలిపి 331 ఉన్నాయి. ఈ మేరకు అటవీశాఖ పోస్టులకు ఈ నెల 21 నుంచి సెప్టెంబర్ 12వ తేదీ వరకు, వైద్య ఆరోగ్యశాఖలోని పోస్టులకు ఈ నెల 22 నుంచి సెప్టెంబర్ 15 వరకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని టీఎస్‌పీఎస్సీ పేర్కొంది. కాగా, వైద్య ఆరోగ్యశాఖలో సుమారు 2345 పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, వాటికి త్వరలోనే నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి తెలిపారు. 800 అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ పోస్టులకు నెలాఖరులోగా నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు తెలిపారు. టీఎస్‌పీఎస్సీలో జెండా వందనం తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. గురుకుల టీచర్ పోస్టుల భర్తీ విషయంలో హైకోర్టు తీర్పు అనంతరం రాత పరీక్షకు రీషెడ్యూల్ జారీ చేశామని తెలిపారు. టీఎస్‌పీఎస్సీ సభ్యుల మధ్య ఎలాంటి విభేదాలు లేవని, కలిసికట్టుగా పని చేస్తున్నామని పేర్కొన్నారు. అందరి సహకారంతో గ్రూప్-1 ఇంటర్వ్యూలు విజయవంతంగా నిర్వహించామని, త్వరలోనే ఫలితాలు వెల్లడిస్తామన్నారు.

కేటగిరీల వారీగా పోస్టుల వివరాలు

కేటగిరీ	సంఖ్య
సివిల్ అసిస్టెంట్ సర్జన్స్	205
డెంటల్ అసిస్టెంట్ సర్జన్స్	10
మెడికల్ ఎడ్యుకేషన్‌లో ట్యూటర్స్	65
రేడియోలాజికల్ ఫిజిక్స్, ఫిజిసిస్టులో లెక్చరర్స్	6
ఇన్సూరెన్స్ సర్వీస్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్స్	43
అసిస్టెంట్ ఫిజియోథెరపిస్టు ఇన్ ఇన్సూరెన్స్ సర్వీసెస్	2
ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్	67
ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్స్	90
ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్	1857
మొత్తం	2345

ముందస్తు ఎన్నికలు రావొచ్చు: సుజన

హైదరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): దేశంలో ముందస్తు ఎన్నికలు వచ్చే అవకాశం ఉందని కేంద్ర మంత్రి సుజనాచౌదరి వెల్లడించారు. ఈ దిశగా ప్రధాని మోదీ యోచిస్తున్నారని చెప్పారు. మినీ జమిలి ఎన్నికలు వచ్చే ఏడాది అక్టోబరు ప్రాంతంలో ఉండవచ్చని పేర్కొన్నారు. మంగళవారం ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీ-టీఎస్ ముఖ్య నేతలు.. ముందస్తు ఎన్నికల అంశాన్ని ప్రస్తావించగా.. ఆయన పైవిధంగా వ్యాఖ్యానించినట్లు సమాచారం. నియోజకవర్గాల పునర్విభజన అంశం కూడా ఈ సందర్భంగా ప్రస్తావనకు వచ్చింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా ఈ నెలాఖరులో ఏపీ పర్యటనకు వస్తున్నారని, ఆ తర్వాతే పునర్విభజనపై ఒక నిర్ణయం వెలువడవచ్చని కేంద్ర మంత్రి అభిప్రాయపడ్డారు. ఏ రాజకీ య పార్టీ అయినా తన ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే నిర్ణయాలు తీసుకుంటుందని ఆయన వ్యాఖ్యానించినట్లు టీడీపీ-టీఎస్ నేతలు తెలిపారు.

బోధన సిబ్బంది భర్తీకి వారంలో నోటిఫికేషన్

- జయశంకర్ వర్సిటీ వీసీ ప్రవీణ్‌రావు వెల్లడి

హైదరాబాద్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 242 బోధన సిబ్బంది పోస్టుల భర్తీకి వారం రోజుల్లో నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు వర్సిటీ వీసీ ప్రవీణ్‌రావు వెల్లడించారు. వర్శిటీలో మంగళవారం జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో జాతీయ ఆయన పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న పంట కాలనీలను ఆగ్రో ప్రాసెసింగ్ పరిశ్రమలకు అనుంధానించడంపై తగిన ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు.

రాష్ట్రానికి 16 కేంద్రీయ విద్యాలయాలు: కేంద్రం

హైదరాబాద్, ఆగస్టు15(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా 16 కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి సహాయ మంత్రి ఉపేంద్ర కుశ్వాహ తెలిపారు. ఈ నెల 10వ తేదీన రాజ్యసభ సభ్యుడు ఎంఏ.ఖాన్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు. తెలంగాణలో కొత్తగా ఏర్పడిన 21 జిల్లాల్లో కేంద్రీయ విద్యా సంస్థలు, జవహర్ నవోదయ విద్యాలయాలు ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపిందా? ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం విద్యా సంస్థలు మంజూరు చేస్తుందా? అనే ప్రశ్నకు కేంద్ర మంత్రి స్పందించారు. కేంద్రీయ విద్యాలయ సంఘటన్‌కు తెలంగాణ నుంచి 16 జిల్లాల్లో ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. నిజామాబాద్ టౌన్, భువనగిరి, సిద్దిపేట, సూర్యాపేట, వికారాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల, జోగులాంబ గద్వాల, జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, కొమురంభీం ఆసిఫాబాద్, నాగర్ కర్నూల్, నిర్మల్, వనపర్తి, వరంగల్ రూరల్ జిల్లాల్లో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు అందినట్లు తెలిపారు. అలాగే, 2014 తర్వాత కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో నవోదయ విద్యాలయాలు లేని పక్షంలో చర్యలు చేపడతామని చెప్పారు. అందులో తెలంగాణలో ఏ జిల్లాల్లో నవోదయ విద్యాలయాలు లేవో అక్కడ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో 32 కేంద్రీయ విద్యాలయాలు ఉన్నాయని, 9 జవహర్ నవోదయ విద్యాలయాలు ఉన్నట్లు తెలిపారు.

బస్సు బాడీ యూనిట్‌ను మూసివేయలేదు మరింతగా ఆధునికీకరిస్తున్నాం

- టీఎస్‌ఆర్టీసీ చైర్మన్ సత్యనారాయణ

హైదరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన మియాపూర్‌లోని బస్సు బాడీ యూనిట్‌ను మూసివేయలేదని, దాని సామర్థ్యాన్ని మరింత పెంచడానికి ప్రయత్నిస్తున్నామని సంస్థ చైర్మన్ సోమారపు సత్యనారాయణ స్పష్టం చేశారు. బస్ భవన్‌లో మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పతాకావిష్కరణ అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ బస్ బాడీ యూనిట్‌ను మూసివేశామని వస్తున్న వార్తల్లో నిజం లేదన్నారు. నెలకు 23 బస్సుల బాడీలను తయారు చేసే సామర్థ్యం ఉన్న యూనిట్‌ను 50 బస్సులకు పెంచేందుకు కసరత్తు చేస్తున్నామని వెల్లడించారు. పల్లెవెలుగు, జీహెచ్‌ఎంసీ పరిధిలోని బస్సుల వల్ల నష్టాలు వాటిల్లుతున్నప్పటికీ... ప్రజావసరాలకు అనుగుణంగా నడుపుతున్నామని తెలిపారు. రాష్ట్రంలోని 32 డిపోలు లాభాల బాటలో నడుస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎండీ జీవీ.రమణారావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, ఇతర అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

జూన్ 3న సివిల్స్ ప్రిలిమ్స్

- ఫిబ్రవరి 7న నోటిఫికేషన్ మార్చి 6 వరకు దరఖాస్తులు

న్యూఢిల్లీ, ఆగస్టు 15: సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షను వచ్చే ఏడాది జూన్ 3న నిర్వహించబోతున్నట్టు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ప్రకటించింది. 2018 సివిల్స్ నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 7న విడుదల చేయబోతున్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఆఖరుతేదీ మార్చి 6. ఈ వివరాలను యూపీఎస్సీ తన వెబ్‌సైట్లో ప్రోగ్రామ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌లో పొందుపరిచింది. దాదాపు 980 ఖాళీలను (2017 సివిల్స్ ఫలితాల తర్వాత అంచనా వేసిన ఖాళీలు) భర్తీ చేసే అవకాశముంది. కాగా, 2017 మినహా 2014, 2015, 2016లలో ప్రిలిమినరీ పరీక్షలను యూపీఎస్సీ ఆగస్టులో నిర్వహించింది.

ఇంట్లో, చుట్టుపక్కల గానీ కనిపించొద్దు

- నీవి శవ రాజకీయాలు.. తక్షణం వెళ్లిపో
- డీకే అరుణపై తమ్ముడు రాంమోహన్ ఫైర్
- తండ్రి, సోదరుడి వర్ధంతిలో భగ్గుమన్న రాజకీయ విభేదాలు

ధన్వాడ, ఆగస్టు 15: ఎవరిదైనా వర్ధంతి వచ్చిందంటే ఆ కుటుంబ సభ్యులంతా ఆయన తాలూకు జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటారు. తోబుట్టువులైతే ఆ వ్యక్తి భార్యాపిల్లలకు సాంత్వన వచనాలూ చెబుతారు. దీంతో అక్కడ ఒకింత భావోద్వేగ వాతావరణం కనిపిస్తుంది. గద్వాల ఎమ్మెల్యే డీకే అరుణ కుటుంబ సభ్యుల్లో మాత్రం ఇందుకు పూర్తి భిన్నమైన వాతావరణం నెలకొంది. వర్ధంతి తాలుకు భావోద్వేగ వాతావరణం అటుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యే అరుణ, ఆమె తమ్ముడు, మక్తల్ నియోజకవర్గ టీఆర్ఎస్ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్ రెడ్డి మధ్య రాజకీయ విభేదాలు భగ్గుమన్నాయి. మాజీ ఎమ్మెల్యే, తండ్రి చిట్టెం నర్సిరెడ్డి, తమ్ముడు వెంకటేశ్వర్‌రెడ్డి 12వ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొనేందుకు అనుచరులతో కలిసి డీకే అరుణ మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా ధన్వాడలోని రాంమోహన్‌రెడ్డి ఇంటికి వచ్చారు. తమ్ముడు రాంమోహన్‌రెడ్డి నివాళి అర్పించాకే ఆమె అక్కడికి చేరుకున్నారు. అయితే, అరుణ ఇంట్లో ఉండటాన్ని జీర్ణించుకోలేని రాంమోహన్‌రెడ్డి ఆమెపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "శవ రాజకీయాలు చేసేందుకు వచ్చిన గద్వాల నాయకులు ఎవరూ నా ఇంట్లో గానీ, ఈ చుట్టు పక్కలగానీ ఉండరాదు. భోజనం కూడా చేయరాదు. తక్షణమే ఇక్కడి నుంచి వెళ్లిపోవాలి" అని ఆయన తీవ్రంగా మండిపడ్డారు. దీంతో చిట్టెం నర్సిరెడ్డి ఇంటి వద్ద ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఒకదశలో ఆమెపై దాడిచేస్తారా? అన్నంతగా ఆందోళన నెలకొంది. అయితే, మూడు గంటల పాటు అక్కడే ఉన్న డీకే అరుణ.. చెల్లెలు సురేఖ వచ్చిన తర్వాత భోజనాలు చేయకుండానే ధన్వాడ నుంచి వెళ్లిపోయారు. కాగా రాంమోహన్ రెడ్డి తీరుతో ఇటు కుటుంబ సభ్యులు, అటు కాంగ్రెస్, టీఆర్ఎస్ కార్యకర్తలు కంగుతిన్నారు.



ధన్వాడలో చిట్టెం నర్సిరెడ్డి ఇంట్లో బైటాయించిన గద్వాల ఎమ్మెల్యే డీకే అరుణ

నన్ను కాదు.. అనేటోళ్లను అడగండి

- సీఎం అభ్యర్థి వార్తలపై కోదండరాం

హైదరాబాద్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): 'ప్రతిపక్షాల సీఎం అభ్యర్థిగా కోదండరాం' అని వస్తున్న వార్తలు నిజమేనా..? అని విలేకరులు అడిగిన ప్రశ్నకు "ఆ విషయం అనేటోళ్లను అడగండి.. నన్నెట్ల అడుగుతారు?"అని టీజేఏసీ చైర్మన్ కోదండరాం ఎదురు ప్రశ్నించారు. మంగళవారం టీజేఏసీ సమావేశం అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. రాజకీయ ఐక్య వేదిక ఏర్పాటు చేయాలన్న తెలంగాణ ఇంటి పార్టీ అధ్యక్షుడు చెరుకు సుధాకర్ ప్రతిపాదనపై స్పందిస్తూ.. ఆయన ఆ వ్యాఖ్యలు ఏ సందర్భంలో, ఏ ఉద్దేశంతో చేశారో తెలియదని, అలాంటి ఆలోచన ఉంటే విలేకరులకు తప్పనిసరిగా తెలుపుతామన్నారు. టీజేఏసీ చేపట్టిన అమరుల స్ఫూర్తి యాత్రపై ప్రభుత్వం ఎంత నిర్బంధం విధించినా భయపడే ప్రసక్తే లేదన్నారు. అయిదో విడత యాత్రను ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి విడిపోయిన కొత్త జిల్లాల పరిధిలో చేపడ్తామన్నారు. ధర్నాచౌక్ పరిరక్షణ కమిటీ జంతర్ మంతర్ వద్ద ఈ నెల 21న చేపట్టిన ధర్నా కార్యక్రమానికి టీజేఏసీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని, అందులో తమ కార్యకర్తలు పాల్గొంటారన్నారు. టీఆర్ఎస్ మూడేళ్ల పాలనపై ఈ నెల 22న ఢిల్లీలో సెమినార్ నిర్వహిస్తామని, తెలుగు రాష్ట్రాల్లో దళితులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ తెలంగాణ మాలమహానాడు ఈ నెల 23న ఢిల్లీలో చేపట్టనున్న మహాధర్నాలోనూ టీజేఏసీ పాల్గొంటుందని వెల్లడించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం టీజేఏసీ కార్యాలయంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు.

కొనసాగుతున్న కొలువుల భర్తీ

హైదరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో 1,12,536 ఉద్యోగాలు భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు మంగళవారం ప్రకటించారు. ఇప్పటికే 22,468 ఉద్యోగాలు భర్తీ చేయగా... మిగతా ఖాళీల భర్తీ వివిధ దశల్లో కొనసాగుతోందని వెల్లడించారు.

శాఖలవారీగా ఉద్యోగాల సంఖ్య.. భర్తీచేసిన పోస్టుల వివరాలు

శాఖ	ఉద్యోగాల సంఖ్య	ఇప్పటికే భర్తీ చేసినవి
పోలీసుశాఖ	37,820	10499
విద్యుత్‌శాఖ	12,961	...
టీచర్ పోస్టులు	12,005	...
గురుకుల టీచర్లు	8,511	...
వైద్యఆరోగ్యశాఖ	8,347	....
సింగరేణి	7,485	5515
ఆర్టీసీ	3,950	3950
కొత్త గురుకుల పోస్టులు	3,925	...
రెవెన్యూశాఖ పోస్టులు	2,506	...
వ్యవసాయ, ఉద్యానశాఖ	2,435	1757
అటవీశాఖ	2,033	..
పురపాలకశాఖ	1,952	102
ఉన్నత విద్య	1,678	...
నీటిపారుదలశాఖ	1,058	...
ఆర్థికశాఖ	720	...
మహిళాశిశుసంక్షేమశాఖ	587	...
రోడ్లు భవనాలశాఖ	513	...
ఎక్సైజ్	340	340
రవాణాశాఖ	182	182
పంచాయతీరాజ్	3,528	123
మొత్తం	1,12,536	22,468

ఆస్పత్రుల నిధులు కేసీఆర్ కిట్‌కు

(మొదటి పేజీ తరువాయి)

సివిల్ పనులతో పాటు బెడ్ల కొనుగోలు, వైద్య పరికరాలను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. జిల్లా ఆస్పత్రుల్లోనే కాకుండా ఏరియా ఆస్పత్రుల్లోనూ ఐసీయూ సౌకర్యాలను నెలకొల్పారు. అలాగే అన్ని ఆస్పత్రుల్లో కొత్త బెడ్లను కొనుగోలు చేయడంతో పాటు, వాటిపై వేసేందుకు కొత్త దుప్పట్లను కూడా కొనుగోలు చేస్తున్నారు. ఇందుకోసం రూ.245 కోట్ల బడ్జెట్‌ను కేటాయించారు. అయితే, గత 5 నెలల్లో ఖర్చు చేసిన నిధులు చాలా తక్కువగా ఉన్నాయి. ఉదాహరణకు ఇటీవల కొనుగోలు చేసిన టీచింగ్, హెడ్ క్వార్టర్స్‌లోని ఆస్పత్రుల సర్జికల్ పరికరాలకు సంబంధించిన నిధులు రూ.4.24 కోట్లను ఇప్పటికీ విడుదల చేయలేదు. ఆలాగే వైద్య విద్య డైరెక్టర్ పరిధిలోని ఆస్పత్రుల కోసం కొనుగోలు చేసిన పరికరాలకు రూ.7.81 కోట్ల బిల్లులను ఇప్పటికీ చెల్లించలేదు. ఆస్పత్రుల నిర్మాణాలు, ఇతర అవసరాలకు ఉద్దేశించిన నిధులు కూడా సకాలంలో విడుదల కావడం లేదు. ప్రస్తుతం మహబూబ్‌నగర్ మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు మొదలయ్యాయి. అలాగే పలు పీహెచ్‌సీల ఆధునీకరణ, ఏరియా ఆస్పత్రుల అభివృద్ధికి పనులు మొదలు పెట్టారు. అయితే వీటి బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతోంది. వైద్య పరికరాలు, భవన నిర్మాణాలకు సంబంధించి బడ్జెట్‌లో రూ.245 కోట్లు కేటాయించినా ఇప్పటి వరకు రూ.36.77 కోట్ల బీఆర్‌వోలను మాత్రమే విడుదల చేశారు. బిల్లుల చెల్లింపు ఇంకా తక్కువే.



కాగా, రాష్ట్రంలో మూడు నెలల క్రితం కేసీఆర్ కిట్ల పంపిణీ పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకంలో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీలు చేయించుకునే మహిళలకు రూ.12 వేల నగదుతో పాటు రూ.2 వేలు విలువ చేసే ప్రత్యేక కిట్‌ను కూడా అందిస్తున్నారు. బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడు ఈ పథకం అమల్లో లేకపోవడంతో ప్రత్యేక నిధులు కేటాయించలేదు. ప్రస్తుతం ఇతర అంశాలకు కేటాయించిన నిధులను వీటికి ఉపయోగిస్తున్నట్టు సమాచారం. ఈ పథకం కింద ఇప్పటి వరకు 4.20 లక్షల మంది గర్భిణీలు పేర్లు నమోదు చేసుకున్నారు. పథకం అమల్లోకి వచ్చిన తర్వాత 52 వేల మంది గర్భిణీలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీలు పొందారు. ఇందులో 45 వేల మందికి ఆర్థిక సాయంతో పాటు తల్లి, బిడ్డ రక్షణకు కిట్లు కూడా సరఫరా చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 3 లక్షల మంది గర్భిణీలు ఈ పథకం కింద లబ్ధి పొందుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు ఏర్పాట్లు కూడా చేస్తున్నారు. నెలకు 15 వేల కిట్లు సరఫరా చేసేందుకు వీలుగా ఎప్పటికీ 30-35 వేల కిట్లు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ కిట్లకు బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే గర్భిణీలకు ఆర్థిక సాయాన్ని బ్యాంకు ఖాతాలో డిపాజిట్ చేయడానికి నిధులను సిద్ధంగా ఉంచాల్సి ఉంటుంది. కేసీఆర్ కిట్ల పథకానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తుండడంతో, దీనిని ఇంకా సమర్థంగా అమలు చేయాలనే యోచనలో ప్రభుత్వం ఉంది. దీంతో ఇతర అంశాలకు కేటాయించిన బడ్జెట్‌లోంచి కొంత మొత్తాన్ని కేసీఆర్ కిట్ల పథకానికి మళ్లిస్తున్నారు. దాని ప్రభావం అభివృద్ధి పనులపై పడుతుందనే వాదన ఉంది.

అవినీతిపై ఎందుకు మాట్లాడలేదు?: నాగం

హైదరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సీఎం కేసీఆర్ చేసిన ప్రసంగంలో బంగారు తెలంగాణ, అవినీతిపై యుద్ధం అంశాలను ఎందుకు ప్రస్తావించలేదని బీజేపీ నేత, మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. కాళ్వేశరం నుంచి డిసెంబరుకల్లా నీటిని ఇస్తారు సరే.. మరి పాలమూరు-రంగారెడ్డి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ప్రాజెక్టుల్లో జరుగుతున్న అవినీతిని వెలికి తీసేందుకేనని తాము కోర్టులకు వెళ్తున్నామని స్పష్టం చేశారు.

ప్రొ కబడ్డీలో నేటి మ్యాచ్‌లు

హరియాణా X తమిళ్ తలైవాస్ రాత్రి 8.గం

గుజరాత్ X టైటాన్స్ రాత్రి 9.గం

కౌంటీ క్రికెట్ ఆడనున్న అశ్విన్!

న్యూఢిల్లీ: ఇంగ్లండ్ దేశవాళీ టోర్నీ కౌంటీ క్రికెట్‌లో భారత స్టార్ స్పిన్నర్ అశ్విన్ బరిలోకి దిగనున్నాడు. ఈ సీజన్ చాంపియన్‌షిప్‌లో డివిజన్-2 కౌంటీ జట్టు వర్సెస్టర్‌షైర్‌కు అశ్విన్ ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఆస్ట్రేలియా పేస్ బౌలర్ జాన్ హేస్టింగ్స్ పాదం గాయంతో దూరం కావడంతో అతని స్థానంలో అశ్విన్‌ను తీసుకున్నారు. అశ్విన్ వర్సెస్టర్‌షైర్‌కు ఆడనుండడంపై ఆ జట్టు డైరెక్టర్ స్టీవ్ రోడ్స్ ఆనందం వ్యక్తం చేశాడు.



ధవన్, రాహుల్

ధవన్, రాహుల్‌కు కెరీర్ బెస్ట్

● ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్

దుబాయ్: ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో లోకేష్ రాహుల్, శిఖర్ ధవన్ కెరీర్ ఉత్తమ ర్యాంక్‌లు సాధించారు. రాహుల్ తొలిసారి టాప్-10లో చోటు దక్కించుకున్నాడు. మంగళవారం ప్రకటించిన తాజా బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో రాహుల్ రెండు స్థానాలు మెరుగుపర్చుకుని కెరీర్ ఉత్తమ 9వ ర్యాంక్‌కు చేరాడు. ఇక ఓపెనర్ ధవన్ ఏకంగా పది స్థానాలు ఎగబాకి 28వ ర్యాంక్‌లో నిలిచాడు. శ్రీలంకతో మూడు టెస్ట్‌ల సిరీస్‌లో శిఖర్ 4 ఇన్నింగ్స్‌ల్లో అత్యధికంగా 358 పరుగులతో 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్'గా నిలవగా.. రాహుల్ 142 రన్స్ చేసిన సంగతి తెలిసిందే. బౌలింగ్ విభాగంలో జడేజా 884 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానం నిలబెట్టుకున్నాడు. అశ్విన్ రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. అయితే ఆల్‌రౌండర్ విభాగంలో మాత్రం జడేజా టాప్ ర్యాంక్ నుంచి రెండో స్థానానికి పడిపోయాడు. అశ్విన్ మూడో స్థానంలో ఉన్నాడు. టీమ్ ర్యాంకింగ్స్‌లో భారత్ 125 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానం పదిలం చేసుకుంది. దక్షిణాఫ్రికా (110), ఇంగ్లండ్ (105) రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి.



పంద్రాగస్టు వేడుకల్లో కోహ్లీ అండ్ కో

పల్లెకెలె: శ్రీలంక పర్యటనలో ఉన్న టీమిండియా.. దేశ 70వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. భారత బృందం సమక్షంలో కెప్టెన్ కోహ్లీ జాతీయ పతకాన్ని ఎగురవేశాడు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు విరాట్.. స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు చెప్పాడు. పంద్రాగస్టు అంటే చిన్నతనం నుంచి తనకు ఎంతో ప్రత్యేకమని.. ఇదే రోజు తన తండ్రి జన్మదినం కావడం దాన్ని మరింత ప్రత్యేకంగా మార్చిందని ఓ వీడియో సందేశాన్ని కోహ్లీ ట్విటర్‌లో పోస్టు చేశాడు. భారతీయుడినైనందుకు గర్విస్తున్నానన్నాడు. తన బాల్యంలో ఇదే రోజు కుటుంబ సభ్యులతో కలసి గాలిపటాలు ఎగురవేస్తూ ఎంతో సందడిగా, ఆనందంగా గడిపేవాడినని చిన్ననాటి రోజులను గుర్తు చేసుకున్నాడు. చివరగా జైహింద్ అంటూ ముగించాడు.

అఫ్రీది శుభాకాంక్షలు..: భారత ప్రజలకు పాకిస్థాన్ మాజీ క్రికెటర్ షాహిద్ అఫ్రీది స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు చెప్పాడు. శాంతి స్థాపన కోసం ఇరు దేశాలూ కృషి చేయాలన్నాడు.

భళా.. పాండ్యా: వెంగ్‌సర్కార్

క్యాండీ: శ్రీలంకతో ఆఖరి టెస్ట్‌లో హార్దిక్ ప్రదర్శనను మాజీ కెప్టెన్ వెంగ్‌సర్కార్ ప్రశంసించాడు. తనకు అందిన అవకాశాన్ని పాండ్యా చక్కగా వినియోగించుకున్నాడని అన్నాడు. ఈ సిరీస్ ద్వారా హార్దిక్.. ఆల్‌రౌండర్‌గా వెలుగు చూశాడని చెప్పాడు. ఇకముందు కూడా పాండ్యా ఇదే తరహా ఆటను కొనసాగిస్తాడని భావిస్తున్నాని వెంగ్‌సర్కార్ అన్నాడు.

నిరాశపర్చిన ఆనంద్

సెయింట్ లూయిస్ (యూఎస్ఏ): సెయింట్ లూయిస్ ర్యాపిడ్-బ్లిట్జ్ చెస్ టోర్నీలో మాజీ ప్రపంచ చాంపియన్ విశ్వనాథన్ ఆనంద్‌కు శుభారంభం దక్కలేదు. తొలి రోజైన సోమవారం ఆడిన మూడు గేముల్లో ఆనంద్ రెండింటిలో ఓడి, ఒకటి డ్రా చేసుకుని నిరాశపర్చాడు. తొలిరౌండ్‌లో నల్లపావులతో ఆడిన ఆనంద్ 46 ఎత్తుల్లో హికారు నకముర (అమెరికా) చేతిలో ఓడాడు. రెండో రౌండ్‌లో డోమినిగెజ్ పెరెజ్ (క్యూబా)తో ఆనంద్‌కు డ్రా ఎదురైంది. మూడో రౌండ్‌లో ఆనంద్ ఆర్మేనియా ఆటగాడు అరోనియన్ చేతిలో ఓడాడు. మరో ఆరు రౌండ్లు మిగిలున్న ఈ టోర్నీలో ఆనంద్ ఒక పాయింట్‌తో తొమ్మిదో స్థానంలో కొనసాగుతున్నాడు.

ఒకే ఓవర్లో 30 పరుగులు

● టీ-20లో ఫించ్ బాదుడు

లండన్: ఇంగ్లండ్ దేశవాళీ లీగ్ నాట్‌వెస్ట్ టీ20 బ్లాస్ట్ టోర్నీలో ఆస్ట్రేలియా బ్యాట్స్‌మన్ ఆరోన్ ఫించ్ ధనాధన్ బ్యాటింగ్‌తో అదరగొట్టాడు. సోమవారం రాత్రి ససెక్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సర్రేకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఫించ్ 64 బంతుల్లో 7 ఫోర్లు, 7 సిక్సర్లతో 114 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. డేవిడ్ వీస్ వేసిన 18వ ఓవర్‌లో ఫించ్ ఏకంగా 30 రన్స్ సాధించాడు. సర్రే 20 ఓవర్లలో 193/2 స్కోరు చేయగా.. ఛేదనలో ససెక్స్ ఓవర్లన్నీ ఆడి 7 వికెట్లకు 176 రన్స్ మాత్రమే చేసింది.

మెరిసిన గుర్జంత్, మన్‌దీప్

● భారత్ 2-1తో నెదర్లాండ్స్‌పై గెలుపు

ఆమ్‌స్టర్‌డామ్: యూరప్ పర్యటనలో భారత పురుషుల హాకీ జట్టు ప్రపంచ 4వ ర్యాంకర్ నెదర్లాండ్స్‌కు షాకిచ్చి మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకుంది. సోమవారం రాత్రి జరిగిన ఆఖరి, మూడో మ్యాచ్‌లో భారత్ 2-1తో ఆతిథ్య నెదర్లాండ్స్‌పై గెలిచింది. గుర్జంత్ సింగ్, మన్‌దీప్ సింగ్ చెరో గోల్‌తో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. ఆట నాలుగో నిమిషంలో గుర్జంత్ గోల్ సాధించడంతో భారత్ 1-0తో ఆధిక్యంలో నిలిచింది. మూడో క్వార్టర్‌లోనూ ఇరు జట్లూ గోల్ కోసం తీవ్రంగా ప్రయత్నించాయి. ఇక 51వ నిమిషంలో మన్‌దీప్ మరో ఫీల్డ్ గోల్ చేయడంతో టీమిండియా 2-0తో ముందంజ వేసింది. కానీ, 7 నిమిషాల వ్యవధిలో సాండర్ డి విజ్న్ గోల్‌తో నెదర్లాండ్ 1-2తో నిలిచింది.



భారత ఆటగాళ్ల గోల్ ఆనందం

యువరాజ్ కెరీర్

ఫార్మాట్	మ్యాచ్	ఇన్నింగ్స్	రన్స్	బెస్ట్	సగటు	సెం.	అ.సెం	వికెట్లు
వన్డే	304	278	8701	150	36.55	14	52	111
టీ20	58	51	1177	77*	28.02	0	8	28
టెస్టు	40	62	1900	169	33.92	3	11	9

ఇటీవలి రీ ఎంట్రీ తర్వాత యువరాజ్ వన్డే గణాంకాలు

మ్యాచ్	ఇన్నింగ్స్	రన్స్	బెస్ట్	సగటు	సెం.	అ.సెం
11	10	372	150	41.33	1	1

యువరాజ్ సింగ్.. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో టీమిండియాకు దొరికిన విలువైన ఆణిముత్యం..! సిసలైన పోరాట యోధుడు..! తన ఆల్‌రౌండ్ నైపుణ్యంతో భారత జట్టును రెండుసార్లు విశ్వవిజేతగా నిలబెట్టిన ధీరుడు..! 17 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో భారత్‌కు ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించాడు. అలాగే ఈ దశాబ్దంన్నర కాలంలో టీమ్ విజయాల కోసమే కాకుండా.. జట్టులో స్థానం కోసం కూడా అలుపెరగని పోరాటం చేశాడు. సవాళ్లు ఎదురైన ప్రతిసారీ.. తనను తాను నిరూపించుకుంటూనే ఉన్నాడు. 2019 వన్డే ప్రపంచకప్ ఆడాలని భావిస్తున్న ఈ డ్యాషింగ్ లెఫ్టాండర్ 36 ఏళ్ల వయసులోనూ జట్టులో చోటు కోసం పోరాడుతూనే ఉన్నాడు. కానీ.. క్రమంగా దారులు మూసుకుపోతున్న యువీకి పరిస్థితులు ప్రతికూలంగా మారుతున్నాయి! వయసు మీదపడడం, అతని స్థానాన్ని భర్తీ చేసేందుకు యువకులు సిద్ధంగా ఉండడంతో అతని మరో ప్రపంచకప్ కల కలగానే మిగిలేలా ఉంది. తాజాగా.. శ్రీలంకతో వన్డే, టీ20 సిరీస్‌లకు ఎంపిక చేసిన జట్టులో అతనికి చోటు దక్కకపోవడమే అందుకు చక్కటి ఉదాహరణ..!

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)



ఇక కష్టమే..!

ఫిట్‌నెస్ ప్రధాన సమస్య!

యువరాజ్ వయసు ప్రస్తుతం 36. 2019 ప్రపంచకప్ నాటికి అతని వయసు 38 ఏళ్లకు చేరుతుంది. ఫిట్‌నెస్ కాపాడుకోవడానికి ఇప్పటికే నానా తంటాలు పడుతున్నాడు. రెండేళ్ల తర్వాత ఎంత ఫిట్‌గా ఉంటాడో చెప్పలేం. యువీ పరిస్థితిపై మాజీ సెలెక్టర్ సాబా కరీమ్ మాట్లాడుతూ.. 'యువరాజ్ ఓ పోరాట యోధుడు. అతడు 2019 వన్డే వరల్డ్‌కప్ వరకూ కొనసాగాలంటే ఫామ్‌పై కంటే ఫిట్‌నెస్ పైనే ఎక్కువ దృష్టిపెట్టాలి. 20 ఓవర్ల క్రికెట్‌కు, వన్డే ఫార్మాట్‌కు చాలా తేడా ఉంది. వన్డేలకు ఎక్కువ ఫిట్‌గా ఉండాల'ని చెప్పాడు. మాజీ ఓపెనర్ ఆకాష్ చోప్రా కూడా 'వరల్డ్‌కప్ నేపథ్యంలో యువరాజ్ పాత్ర ఏమిటో సెలెక్టర్లు స్పష్టం చేయనంత వరకూ వారి విధానమేంటో ఎవరికీ అర్థం కాదు. ఎందుకంటే ప్రపంచకప్‌లో 38 ఏళ్లకు పైబడిన ఇద్దరిని ఆడించడం సబబు కాదు. ఒకవేళ యువీ, ధోనీని వరల్డ్‌కప్ వరకూ కొనసాగిస్తే వారిని కీలకమైన 4, 5 స్థానాల్లో ఆడించాలి. భారత్‌కు అదే పెద్ద సమస్య అవుతుంద'ని అన్నాడు.

'ఇక యువరాజ్ పని అయిపోయినట్టే..! అతని కెరీర్ ముగిసినట్టే..! ఫిట్‌నెస్ లేదు.. వయసు కూడా మీదపడుతోంది.. రీ ఎంట్రీనే కష్టం అనుకుంటుంటే 2019 వరల్డ్‌కప్ టీమ్‌లో చోటు ఆశించడం అత్యాసే కదా..!' భారత జట్టులో చోటు కోల్పోయిన ప్రతిసారీ యువీ కెరీర్‌పై సాగే విశ్లేషణలివి. కానీ.. టీమిండియా 'ఫైటర్ మ్యాన్'గా పేరు పొందిన యువరాజ్ విశ్లేషకుల అంచనాలన్నీ తారుమారు చేస్తూ రీ ఎంట్రీ ఇస్తూనే ఉన్నాడు. ఈ ఏడాది ఆరంభంలో కూడా రీ ఎంట్రీ ఇచ్చిన యువీ చక్కని ప్రదర్శన కనబర్చడంతో 2019 ప్రపంచకప్‌లో కచ్చితంగా ఆడతాడనే అందరూ భావించారు. కానీ.. ఇంతలోనే శ్రీలంకతో వన్డే, టీ20 సిరీస్‌లకు ఎంపిక చేసిన జట్ల నుంచి సెలెక్టర్లు అతణ్ని తప్పించడంతో ఇప్పుడు యువీ భవితవ్యంపై చర్చ కొనసాగుతోంది.

విశ్రాంతి మాట నిజమేనా..

శ్రీలంకతో సిరీస్‌కు ఎంపిక చేసిన జట్టు నుంచి యువీని తప్పించడం ఇప్పుడు హాట్ టాపిక్ అయింది. ధోనీని కొనసాగిస్తూ.. యువీని తప్పించడంతో విమర్శలు కూడా చెలరేగాయి. అయితే వెంటనే రంగంలోకి దిగిన చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ యువీకి ఉద్వాసన పలకలేదని అతనికి విశ్రాంతి ఇచ్చామని చెప్పుకొచ్చాడు. యువీకి టీమిండియా ద్వారాలు ఎప్పుడూ తెరిచే ఉంటాయన్నాడు. అయితే ఇక్కడ ఒక్క విషయం గమనించాలి. వెస్టిండీస్‌తో వన్డే సిరీస్ ముగిసిన తర్వాత కోహ్లీ సేన శ్రీలంక వెళ్లింది. అక్కడ ముందుగా మూడు టెస్టుల సిరీస్ ఆడింది. 3-0తో సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. ఈ సిరీస్‌లో పాల్గొన్న అశ్విన్, జడేజాకు పరిమిత ఓవర్ల క్రికెట్ నుంచి విశ్రాంతి ఇస్తున్నట్టు మేనేజ్‌మెంట్ ప్రకటించింది. కానీ.. టెస్టు జట్టులో లేని యువీకి కూడా విశ్రాంతి ఇచ్చామని ఎమ్మెస్కే చెప్పడం ఆశ్చర్యకరం. ఈ మూడు టెస్టులు ఆడని యువరాజ్‌కు చాలినంత విశ్రాంతి దక్కినట్టే కదా. అలాంటపుడు విశ్రాంతి అనే మాటలో నిజం లేదని, విమర్శల నుంచి బయటపడేందుకే ఎమ్మెస్కే ఇలా చెప్పాడనే విషయం స్పష్టమవుతోంది.

ఇక చాన్స్ లేనట్టేనా..!

అద్భుతం జరిగితే తప్ప యువరాజ్ మళ్లీ టీమిండియా జెర్సీ ధరించడం కష్టమే! 304 వన్డేల అనుభవం కలిగిన యువీ చాలా సందర్భాల్లో మ్యాచ్‌లను మలుపు తిప్పి తనసత్తా నిరూపించుకున్నాడు. ఆ క్రమంలోనే 2007 టీ20, 2011 వన్డే వరల్డ్‌కప్ విజయాల్లో కీలకపాత్ర పోషించాడు. అయితే ప్రస్తుత భారత జట్టుకు యువీ అవసరం ఉందా అంటే అవునని కచ్చితంగా చెప్పలేని పరిస్థితి. కోహ్లీ, ధోనీతో కూడిన మిడిలార్డర్ మరీ అంత బలోపేతంగా ఏమీ కనిపించకపోయినా.. యువరాజ్‌పైనే పూర్తిగా ఆధారపడిందని మాత్రం చెప్పలేం. నిలకడలేమే యువీ ప్రధాన సమస్య. పైగా ఫిట్‌నెస్ ప్రాబ్లమ్స్. అతని అనుభవం ఉపయోగపడుతుందన్న మాట వాస్తవమే అయినా 38 ఏళ్ల వయసులోనూ మెరుపులు మెరిపిస్తాడని ఆశించలేం. యువ ఆల్‌రౌండర్లు హార్దిక్ పాండ్యా, కేదార్ జాదవ్‌లను మించిన ప్రదర్శన అతడు చేయగలగాలి. అలాగే బౌలింగ్‌లోనూ జట్టుకు ఉపయోగపడాలి. కానీ ఈ ఏడాది ఆరంభంలో రీ ఎంట్రీ ఇచ్చిన యువీ.. బ్యాటింగ్ తప్ప బౌలింగ్ చేయలేదు. 2019 వరల్డ్‌కప్‌నకు ఇంగ్లండ్ ఆతిథ్యం ఇస్తుంది. ఉపఖండం పిచ్‌లపై అద్భుతంగా రాణించే యువీ పేస్‌కు అనుకూలించే అక్కడి వికెట్లపై ఏ మేరకు ప్రభావం చూపుతాడనేది కూడా కీలకమే! మిడిలార్డర్‌లో యువీ మెరుపులు మెరిపిస్తాడు కాబట్టే అతనికి జట్టులో స్థానం ఉంటుంది. కానీ.. హార్దిక్, మనీష్ పాండే, కేదార్ మిడిలార్డర్‌లో స్థానం కోసం పోటీపడి మరీ రాణిస్తున్నారు. పవర్ హిట్టింగ్‌కు మారుపేరైన యువీ స్థానాన్ని భర్తీ చేయాలంటే హార్దిక్, కేదార్ ఇంకా చాలా నిరూపించుకోవాలి. కాబట్టే వారికి మరిన్ని అవకాశాలు ఇవ్వాలనేది సెలెక్టర్ల ఆలోచన. అయితే పునరాగమనం చేసిన యువీ ఇంతవరకూ తనదైన ముద్ర వేయలేదు. కానీ.. కటక్ వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన వన్డేలో 25/3తో కష్టాల్లో పడిన సమయంలో ధోనీతో కలిసి యువీ ఆడిన ఇన్నింగ్స్ అతనిపై నమ్మకం పెరిగేలా చేసింది. అలాగని ఈ ఒక్క ఇన్నింగ్స్‌తో అతనిపై పూర్తి భరోసా ఉంచలేం. అతడు మళ్లీ జట్టులోకి రావాలంటే పదింతలు మెరుగైన ప్రదర్శన చేయాలి. ఎన్నో రెట్లు శ్రమించాలి. ఒకరకంగా చెప్పాలంటే మిరాకిల్ జరిగితే తప్ప యువీ రీ ఎంట్రీ సాధ్యం కాదని అనిపిస్తోంది..!



కుల్దీప్ యాదవ్

కుల్దీప్‌పై దూరదృష్టితో..!

పల్లెకెలె: భవిష్యత్ ఆశాకిరణం చైనామన్ బౌలర్ కుల్దీప్ యాదవ్ విషయంలో ప్రణాళికా బద్ధంగా వ్యవహరించాలని టీమిండియా మేనేజ్‌మెంట్‌లోని కీలక వ్యక్తులు భావిస్తున్నారు. అశ్విన్, రవీంద్ర జడేజా కౌంటీలకు ఆడనున్న నేపథ్యంలో.. శ్రీలంకతో జరిగే వన్డే సిరీస్‌లో కుల్దీప్ స్పిన్ విభాగానికి ప్రాతినిధ్యం వహించనున్నాడు. 2019 వరల్డ్‌కప్‌ను దృష్టిలో ఉంచుకుని కెప్టెన్ కోహ్లీ, కోచ్ రవిశాస్త్రి, చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్‌లు యువ స్పిన్నర్ కుల్దీప్‌ను ఎంతో జాగ్రత్తగా పరిరక్షించుకోవాలనుకుంటున్నారు. 'స్వల్ప, దీర్ఘకాలిక ప్రయోజనాలపై దృష్టిసారించాం. స్వదేశంలో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లతో వన్డే సిరీస్‌లు ఆడాల్సి ఉంది. అంతేకాకుండా 2019 వరల్డ్‌కప్ టీమ్‌ను తయారు చేసుకోవాల్సిన అవసరం ఉంద'ని ప్రసాద్ మంగళవారమిక్కడ మీడియాతో చెప్పాడు. 'వెస్టిండీస్ టూర్ సందర్భంగానే అవకాశాలను పరిశీలించాలనుకున్నాం. కానీ చాంపియన్స్ ట్రోఫీ తర్వాత పెద్దగా సమయం లేకపోవడంతో అది సాధ్యంకాలేదు. ఇంగ్లండ్‌లో ఆడిన జట్టునే విండీస్‌కూ పంపామ'ని ఎమ్మెస్కే తెలిపాడు. వచ్చే ఏడాది దక్షిణాఫ్రికా సిరీస్‌తో మొదలుకుని ఇంగ్లండ్, ఆస్ట్రేలియా పర్యటనల్లో భారత్ కఠిన సవాళ్లను ఎదుర్కోనుంది. దీంతో అన్ని ఫార్మాట్లకూ టీమ్‌ను సిద్ధం చేసుకోవాల్సిన అవసరం ఉందని ప్రసాద్ చెప్పాడు.

శ్రీలంక వన్డే కెప్టెన్‌గా తరంగ

● భారత్‌తో సిరీస్‌కు లంక జట్టు ప్రకటన



పల్లెకెలె: భారత్‌తో ఐదు వన్డేల సిరీస్‌లో శ్రీలంక జట్టుకు సీనియర్ బ్యాట్స్‌మన్ ఉపుల్ తరంగ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఆదివారం మొదలయ్యే ఈ వన్డే సిరీస్‌లో పాల్గొనే 15 మంది సభ్యులతో కూడిన టీమ్‌ను శ్రీలంక క్రికెట్ మంగళవారం ప్రకటించింది. ఇటీవల జింబాబ్వేతో వన్డే సిరీస్‌లో ఏంజెలో మాథ్యూస్ నేతృత్వంలోని లంక 2-3తో సిరీస్ కోల్పోయింది. దీంతో మాథ్యూస్‌ను కెప్టెన్సీ నుంచి తప్పించిన లంక బోర్డు తరంగకు ఆ బాధ్యతలు అప్పగించింది. కాగా.. మాథ్యూస్ వన్డే జట్టులో చోటు నిలబెట్టుకోగా.. వెటరన్ పేసర్ లసిత్ మలింగ రీ ఎంట్రీ ఇచ్చాడు. చమర కపుగెదెర, తిసార పెరీర కూడా వన్డే టీమ్‌లోకొచ్చారు. టెస్టు కెప్టెన్ దినేష్ చాందిమల్‌కు విశ్రాంతినిచ్చారు.

'ఫార్చ్యూన్' గుజరాత్..!

● బెంగళూరు బుల్స్‌పై గెలుపు
● పుణెరి చేతిలో బెంగాల్ చిత్తు

అహ్మదాబాద్: సొంతగడ్డపై చెలరేగుతున్న గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్ వరుసగా నాలుగో విజయం సాధించింది. ప్రొ కబడ్డీ లీగ్‌లో మంగళవారం ఉత్కంఠ భరితంగా జరిగిన మ్యాచ్‌లో అదృష్టం కలిసిరావడంతో గుజరాత్ 27-24తో బెంగళూరు బుల్స్‌పై నెగ్గింది. మ్యాచ్‌లో ఎక్కువ శాతం ఆధిక్యంలో కొనసాగిన బెంగళూరు.. ఒత్తిడికి గురై గెలవాల్సిన మ్యాచ్‌ను చేజార్చుకుంది. ఆరంభంలో బెంగళూరు ఆధిపత్యం ప్రదర్శించింది. ఫస్టాఫ్ ముగిసే సమయానికి బెంగళూరు 14-9తో ఆధిక్యంలో నిలిచింది. సెకండాఫ్ ఆరంభంలో సుఖేష్‌ను బెంగళూరు డిఫెన్స్ పట్టేయడంతో 19-10తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఈ దశలో మ్యాచ్ మలుపు తిరిగింది. గుజరాత్ రైడర్లు రెచ్చిపోయి వరుసగా పాయింట్లు సాధించగా.. బెంగళూరు డీలా పడింది. సెకండాఫ్ 11 నిమిషాలు ముగిసే సరికి 21-21తో గుజరాత్ స్కోరు సమం చేసింది. స్కోరు 24-24తో ఉన్న దశలో వరుసగా మూడు పాయింట్లు సాధించిన ఫార్చ్యూన్స్ మ్యాచ్‌లో విజయం సాధించింది. కాగా, ఇంటర్ జోనల్ చాలెంజ్‌లో పుణెరి పల్టన్ 34-17తో బెంగాల్‌ను చిత్తు చేసింది. డిఫెన్స్‌లో రాణించిన నర్వాల్ 4 పాయింట్లు సాధించాడు.



రోహిత్‌ను టాకిల్ చేస్తున్న గుజరాత్ ఆటగాళ్లు

మోదీ మాట...



- స్వాతంత్ర్య సంగ్రామంలో 'భారత్ ఛోడో' (క్విట్ ఇండియా) నినాదం ప్రజల్లో ఎంతో ప్రేరణ ఇచ్చింది. ఇప్పుడు దాని స్థానంలో 'భారత్ జోడో' (భారత్‌ను కలిపేయ్) నినాదంతో అందరినీ కలుపుకొని పోవాలి.
- 1942లో క్విట్ ఇండియా నినాదంతో ఐదేళ్లలో స్వాతంత్ర్యాన్ని పొందగలిగాం. ఇప్పుడు... 'భారత్ జోడో' నినాదంతో 2022కు దేశాన్ని ప్రగతి శిఖరాగ్రంలో నిలుపుదాం.
- ఈ ఏడాది ఎంతో ప్రత్యేకం..ఎందుకంటే క్విట్ ఇండియా ఉద్యమానికి 75 ఏళ్లు నిండాయి... చంపారణ్ సత్యాగ్రహానికి వందేళ్లు, గణేశ్ ఉత్సవాలకు 125 ఏళ్లు నిండాయి.
- ప్రపంచ దేశాల్లో భారతదేశం ప్రతిష్ఠ పెరుగుతోంది...ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడేందుకు భారత్‌కు సహకరించేందుకు మిగతా దేశాలన్నీ ముందుకొస్తున్నాయి.
- "ఆ మోహనుడిది సుదర్శన చక్రం. ఈ మోహనుడి (మోహన్ దాస్ కరమ్‌చంద్ గాంధీ)ది చరఖా! ఈ రెండు చక్రాల ఘన వారసత్వం మనది" అని చమత్కరించారు. (కృష్ణాష్టమి సందర్భంగా పిల్లలు చిన్నారులు కృష్ణుడి వేషంలో వచ్చారు. వీరిని చూసి మోదీ మురిసిపోయారు)
- ఈ శతాబ్ది తొలిరోజున పుట్టిన వారికి 2018 జనవరి 1తో 18ఏళ్లు నిండుతాయి. వారంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలి,



సురాజ్యం మన జన్మహక్కు!

(మొదటి పేజీ తరువాయి)

సూత్రీకరించారు. "కులతత్వం, మతతత్వం విషంతో సమానం. మతం పేరిట హింసకు పాల్పడటం ఎంతమాత్రం ఆమోద యోగ్యం కాదు" అని అన్నారు. పంద్రాగస్టు సందర్భంగా మంగళవారం ఎర్రకోటపై మోదీ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. కశ్మీర్‌లో కొనసాగుతున్న హింస నేపథ్యంలో... ఆ సమస్యను తన ప్రసంగంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. గుప్పెడుమంది వేర్పాటువాదులు కశ్మీర్‌లో అలజడి సృష్టించేందుకు రకరకాల ఎత్తులు వేస్తున్నారని, వాటిని తిప్పికొట్టి కశ్మీర్‌ను తిరిగి స్వర్గసీమగా మార్చేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. అదే సమయంలో ఉగ్రవాదులపై మెతక వైఖరి ప్రదర్శించే ప్రసక్తే ఉండదని తేల్చి చెప్పారు. దేశ భద్రతకు తాము అత్యంత ప్రాధాన్యం ఇస్తామని, పీవోకేలో జరిపిన సర్జికల్ స్ట్రైక్స్ ఇందుకు నిదర్శనమని మోదీ పేర్కొన్నారు. నవ భారత నిర్మాణానికి చిత్త శుద్ధితో కృషి చేస్తామని, 'చల్తా హై' ధోరణికి తావే లేదని తేల్చి చెప్పారు. 'బదల్ సక్తా హై' (మార్చగలం) అనేదే తమ నినాదమని ఉద్ఘాటించారు. దేశంలో 20 అంతర్జాతీయ స్థాయి విశ్వవిద్యాలయాలను స్థాపించాలని నిర్ణయించామన్నారు. తొమ్మిదికోట్ల మంది రైతులకు భూసార పరీక్ష కార్డులు అందించామని, 2.5 కోట్ల పేద మహిళలకు వంట గ్యాస్ కనెక్షన్లు ఇచ్చామని చెప్పారు.

దోచుకున్నోళ్లకు నిద్ర కరువే...

మూడేళ్ల తమ పాలనలో తీసుకొచ్చిన ఆర్థిక సంస్కరణల గురించి ప్రధాని మోదీ సవివరంగా ప్రస్తావించారు. "ఏళ్లతరబడి జనం సొమ్ము దోచుకున్న వారికి మనశ్శాంతి లేకుండా చేశాం" అని సగర్వంగా ప్రకటించారు. ఈ దోపిడీకి బాధ్యులైన వారు దేశానికి జవాబు చెప్పి తీరాలన్నారు.



ఎర్రకోట నుంచి ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

పెద్దనోట్ల రద్దుతో... అప్పటిదాకా 'లెక్కల్లోకి రాని' సుమారు 3 లక్షల కోట్లు బ్యాంకింగ్ వ్యవస్థలోకి వచ్చాయన్నారు. 1.75 లక్షల కోట్ల డిపాజిట్లకు సంబంధించి... 18 లక్షల మందిపై కన్నేసి ఉంచామని తెలిపారు. వీరిలో 4.5 లక్షల మంది మాత్రమే తాము చేసిన 'తప్పు' సవరించుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారన్నారు. మూడేళ్లలో 1.25 లక్షల కోట్ల నల్లధనాన్ని వెలికి తీశామని చెప్పారు. నల్లధనంపై తమ యుద్ధం కొనసాగుతుందన్నారు. బయోమెట్రిక్ గుర్తింపు, ఆధార్‌తో అనుసంధానం వంటి సాంకేతిక చర్యల ద్వారా... నల్లధనాన్ని కట్టడి చేస్తామన్నారు. డొల్ల కంపెనీల డొక్క చీల్చుతున్నామని కూడా మోదీ ప్రకటించారు. ఏకంగా 1.75 లక్షల షెల్ కంపెనీలు మూతపడ్డాయని తెలిపారు. "ఒకే ఒక్క చిరునామాతో ఏకంగా 400 షెల్ కంపెనీలు ఏర్పాటయ్యాయి. నల్లధనాన్ని మార్చడం, పన్ను ఎగవేతదారులకు సహకరించడమే వీటి పని" అని తెలిపారు. 800 కోట్ల బినామీ ఆస్తులను స్వాధీనం చేసుకున్నామని ప్రకటించారు. జీఎస్టీ ఫలితాలు లభిస్తున్నాయని... చెక్‌పోస్టులు ఎత్తివేయడంతో వస్తువుల రవాణాలో వేగం 30 శాతం పెరిగిందని చెప్పారు. దీని వల్ల 3 కోట్ల రూపాయలతోపాటు, వెలకట్టలేనంత సమయం కూడా ఆదా అవుతోందని చెప్పారు. సహకార స్ఫూర్తికి తాము కట్టుబడి ఉన్నామని చెప్పారు. కేంద్రం, రాష్ట్రాలు కలిసి సమష్టిగా నిర్ణయాలు తీసుకుంటున్నాయన్నారు. ఉత్తరప్రదేశ్‌లో ఘోరఖ్‌పూర్ ఆస్పత్రిలో జరిగిన చిన్నారుల మరణం గురించి నేరుగా ప్రస్తావించకుండా... "కొన్నాళ్ల క్రితం ఒక ఆస్పత్రిలో అన్నెంపున్నెం ఎరుగని పసివాళ్లు మరణించారు. ఇది విషాదకరం" అని తెలిపారు.

విశేషాలు

మాట నిలబెట్టుకున్న ప్రధాని

మోదీ ఎప్పట్లాగానే తన 'మార్కు' కుర్తా, చుడీదార్, పైజామా ధరించి... రాజస్థానీ పాగా పెట్టుకుని వచ్చారు. ప్రధానిగా ఎర్రకోటపై మోదీకి ఇది నాలుగో ప్రసంగం. ఈసారి ఆయన అతి తక్కువగా... 56 నిమిషాలు మాత్రమే మాట్లాడారు. ఎర్రకోటపై ప్రధాని మరీ సుదీర్ఘంగా మాట్లాడుతున్నారంటూ లేఖలు వచ్చినందున... ఈసారి నిడివి తగ్గిస్తున్నట్లు ప్రధాని మన్‌కీ బాత్‌లో ఇప్పటికే చెప్పారు. మంగళవారం ఆ మాట నిలబెట్టుకున్నారు. మోదీ 2016లో అత్యధికంగా 96 నిమిషాలు ప్రసంగించి 1947లో నెహ్రూ పేరిట ఉన్న రికార్డు (72 నిమిషాలను)ను చెరిపేశారు. మోదీకంటే ముందు పదేళ్ల పాటు పంద్రాగస్టు ప్రసంగాలు చేసిన మన్మోహన్ 32 నుంచి 45 నిమిషాలు మాత్రమే మాట్లాడేవారు. రెండుసార్లు మాత్రమే 50నిమిషాలు ప్రసంగించారు.

పిల్లల మోదీ

ఎర్రకోట వద్దకు వచ్చిన ప్రధానికి చిన్నారులు ఉత్సాహంగా స్వాగతం పలికారు. కృష్ణాష్టమి సందర్భంగా పిల్లలు చిన్నారులు కృష్ణుడి వేషంలో వచ్చారు. వారిని చూసి మోదీ మురిసిపోయారు. ప్రసంగం ముగిసిన తర్వాత... భద్రతా నిబంధనలను పక్కనపెట్టి పిల్లల్లోకి వెళ్లిపోయారు. మోదీ తమ వద్దకు వచ్చి మాట్లాడటంతో చిన్నారులు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. ఢిల్లీలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు హిందీలో 'భారత్' అనే అక్షరాల రూపంలో ఆసీనులయ్యారు. కార్యక్రమం ముగిసిన తర్వాత తిరిగి ఇళ్లకు వెళ్లే క్రమంలో జరిగిన హడావుడితో పలువురు చిన్నారులు తమ బూట్లు, టోపీలు పోగొట్టుకున్నారు. 'షూ లేకుంటే బడికి రానివ్వరు. కొత్తబూట్లు అడిగితే నాన్న తిడతారు' అని ఓ చిన్నారి ఏడ్చేసింది.



చైనాకు పరోక్ష హెచ్చరిక

డోక్లాంలో తిష్ఠవేసిన చైనాకు ప్రధాని తన ప్రసంగంలో పరోక్ష హెచ్చరికలు జారీ చేశారు. దేశభద్రత తమ ప్రథమ ప్రాధాన్యమని.. సముద్రంలో అయినా సరిహద్దుల్లో అయినా.. ఆన్‌లైన్‌లో అయినా, ఆకాశంలో అయినా.. ఎలాంటి భద్రతాపరమైన సమస్య ఎదురైనా దీటుగా ఎదుర్కొనే శక్తిసామర్థ్యాలు భారత్‌కు ఉన్నాయన్నారు. యూనిఫాం ధరించిన ప్రతీ ఒక్కరు అవసరమైనప్పుడు సత్తా చాటారని, త్యాగాలకు వెరవలేదన్నారు.

ముస్లిం మహిళలకు అండగా యావద్దేశం

ట్రిపుల్ తలాక్ కారణంగా దయనీయ జీవితం గడుపుతున్న ముస్లిం మహిళలు మొదలుపెట్టిన ఉద్యమంతో దేశవ్యాప్తంగా ఆ ఆచారానికి వ్యతిరేకమైన వాతావరణం ఏర్పడిందని.. వారికి తాను నమస్కరిస్తున్నానని ప్రధాని అన్నారు. " ట్రిపుల్ తలాక్ పోరాటంలో వారు విజయం సాధిస్తారు. ఎందుకంటే యావద్దేశం వారికి అండగా ఉంది" అని మోదీ అన్నారు.

చౌకగా మోకీళ్ల మార్పిడి

మోకీళ్ల నొప్పులతో నడవలేని పరిస్థితి ఉన్నా... ఖర్చుకు వెరసి శస్త్రచికిత్స జోలికి వెళ్లలేని వృద్ధులకు ప్రధాని శుభవార్త వినిపించారు. "హృద్రోగులకు ఉపయోగించే కరొనరీ స్టెంట్ల ధరలను 85 శాతం తగ్గించాం. అలాగే, మోకీళ్ల మార్పిడి చికిత్స వ్యయాన్నీ తగ్గిస్తాం. ఇలాంటి వైద్య సేవలు పేదలు, మధ్య తరగతికి అందుబాటులోకి వచ్చేలా కృషి చేస్తూనే ఉంటాం" అని తెలిపారు. మూత్రపిండాల వ్యాధిగ్రస్తులకు ప్రాణావసరమైన డయాలిసిస్ కేంద్రాలు ప్రస్తుతం రాష్ట్ర రాజధానుల్లో మాత్రమే ఉన్నాయని... దేశంలోని ప్రతి జిల్లా కేంద్రంలో వీటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు.



తప్పుకోండి.. నా భర్త వస్తున్నారు!

విమానాశ్రయంలో ఆర్మీ మేజర్‌కు భార్య 'సర్‌ప్రైజ్'

న్యూఢిల్లీ, ఆగస్టు 15: శివేశ్ తివారీ.. ఆర్మీలో మేజర్. జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ 42వ బెటాలియన్‌లో పని చేస్తున్నారు. ముగ్గురు ఉగ్రవాదులను హతమార్చారు. రెండుసార్లు మృత్యువుతో పోరాడి గెలిచారు. ఆయన ధైర్య సాహసాలకు సేనా పతకం వరించింది. సెలవుపై ఇంటికి వస్తున్న ఆయనకు సర్‌ప్రైజ్ ఇవ్వాలని భార్య నిర్ణయించారు. 'అతని కళ్లు గోధుమ రంగులో ఉంటాయి. బూట్లు నల్లగా ఉంటాయి. అందరూ పక్కకు తప్పుకోండి. నా భర్త వస్తున్నారు' అంటూ విమానాశ్రయంలో ప్లకార్డుతో సందడి చేశారు. యువత రంగ్ దే బసంతి డ్యాన్స్ చేస్తూ స్వాగతం పలికారు.

కీర్తి చక్ర ప్రమోద్ జ్ఞాపకాల్లో..

అదే చోట జెండా ఆవిష్కరించిన భార్య, కుమార్తె

శ్రీనగర్, ఆగస్టు 15: కీర్తి చక్ర ప్రమోద్ కుమార్.. ఉగ్రవాదులతో పోరులో అసువులు బాసి సరిగ్గా ఏడాది అయింది. స్వాతంత్ర్య దినోత్సవం రోజున.. జెండా ఎగురవేసి శాల్యూట్ చేసిన కొన్ని గంటలకే.. ప్రమోద్ వీరమరణం పొందారు. ఆయన చివరి జ్ఞాపకంగా నిలిచిన ఇక్కడ కరణ్ నగర్‌లోని సీఆర్‌పీఎఫ్ 49వ బెటాలియన్ క్యాంప్‌లోనే ఆయన ఆరేళ్ల కుమార్తె ఆర్నా, భార్య నేహా త్రిపాఠి మువ్వన్నెల పతాకాన్ని ఆవిష్కరించారు. అమరవీరుల స్మారక చిహ్నంపై పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. భారత ప్రభుత్వం సోమవారం ప్రమోద్ కుమార్‌కు కీర్తి చక్ర పతకం ప్రకటించింది.





స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా మువ్వన్నెల దుస్తుల్లో సెల్ఫీ తీసుకుంటున్న అంజుమన్ ఇస్లాం కాలేజీ విద్యార్థినులు

మదర్సాలలో స్వాతంత్ర్య వేడుకలు

- వీడియో తీయాలని యోగి సర్కారు ఆదేశాలు

లఖ్‌నవు, ఆగస్టు 15: మదర్సాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించాలని, జాతీయ గీతం పాడాలని, ఈ వేడుకలను వీడియో తీయాలన్న యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వ ఆదేశాలకు మిశ్రమ స్పందన కనిపించింది. రాష్ట్రంలోని కొన్ని మదర్సాల్లో మంగళవారం స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించగా.. మరికొన్ని దూరంగా ఉన్నాయి. మధ్యప్రదేశ్ సర్కారు కూడా ఇదే ఆదేశాలు జారీ చేసింది. ముస్లింలు దేశభక్తులు కాదన్నట్లు అనుమానించడం తగదని మత పెద్ద ముఫ్తీ ముకరం అన్నారు.

మాట తడబడి.. మధ్యలోనే కూలబడి..

- వేడుకల్లో ఒడిసా సీఎంకు అస్వస్థత

భువనేశ్వర్, ఆగస్టు 15: చూస్తుంటే నలతగా ఉన్నట్లు కనిపిస్తున్నా.. ఓపికంతా కూడదీసుకుని నిలబడ్డారు.. మువ్వన్నెల పతాకాన్ని ఎగురవేశారు.. ప్రసంగం మొదలుపెట్టాక ఇబ్బందిపడ్డారు. మాట తడబడింది. ఇక ఆయన వల్ల కాలేదు. మధ్యలోనే నిష్క్రమించారు. ఒడిసా సీఎం నవీన్ పట్నాయక్(71) స్వాతంత్ర్య వేడుకల్లో అస్వస్థతకు గురయ్యారు. భువనేశ్వర్‌లోని మహాత్మాగాంధీ మార్గ్‌లో జెండా ఆవిష్కరణ తర్వాత 15 నిమిషాల పాటు ప్రసంగించిన ఆయన.. నిలబడలేక మధ్యలోనే ముగించారు.

కేరళలో స్వాతంత్ర్య వేడుకల్లో మోహన్ భగవత్

పాలక్కడ్ (కేరళ), ఆగస్టు 15: స్వాతంత్ర్య వేడుకల్లో జాతీయ జెండా ఆవిష్కరించకుండా ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌ను నిలువరించాలన్న కేరళ ప్రభుత్వ ప్రయత్నం ఫలించలేదు. ప్రభుత్వ ఆదేశాలను తోసిరాజంటూ భగవత్ మంగళవారం ఇక్కడ ఒక పాఠశాలలో మువ్వన్నెల పతాకాన్ని ఆవిష్కరించారు.



అహ్మదాబాద్‌లోని ఓ వంతెనపై 300 మీటర్ల జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న దృశ్యం

విభజనవాదులపై ఐక్య పోరాటం

ప్రజలకు సోనియా పిలుపు

న్యూఢిల్లీ, భోపాల్, ఆగస్టు 15: వేర్పాటువాదం, ఉగ్రవాదంతో పాటు సమాజాన్ని విభజించి విద్వేష భావాలను వ్యాపింపచేస్తున్న శక్తులపై ఐక్యంగా పోరాడాలని ప్రజలకు కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ పిలుపునిచ్చారు. స్వతంత్ర భారతీయులుగా ఉన్నందుకు మనం గర్వపడాలని స్వాతంత్ర్యదిన సందేశంలో పేర్కొన్నారు. అదేసమయంలో దేశ ప్రాథమిక సూత్రాలను పరిరక్షించుకోవడానికి ఐక్యమవ్వాలని సూచించారు. కాగా, అదుపు తప్పి ప్రవర్తిస్తున్న కుమారులను రాజకీయ నాయకులు ఇళ్లకే పరిమితం చేయాలని, మహిళల సంచారంపై ఆంక్షలు విధించడం సరికాదని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అన్నారు. మహిళల పట్ల నేరాలకు పాల్పడిన వారికి వెంటనే శిక్షలు పడేలా చూడాలని, రాజకీయ నేతల పిల్లలు ఇలాంటి నేరాలకు పాల్పడితే చట్టం నిర్దేశించిన దాని కంటే రెట్టింపు శిక్షలు పడాలన్నారు. మహిళలు రాత్రి వేళల్లో బయటకు రాకూడదనే వాళ్ల చెంపను చెల్లుమనిపించాలని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. చండీగఢ్‌లో బీజేపీ నేత కుమారుని ఉదంతం నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.



రాష్ట్రపతి ఇచ్చిన ఎట్‌హోం విందులో సోనియాకు అభివాదం చేస్తున్న మోదీ



వరదలు ముంచినా ఉప్పొంగిన దేశభక్తి

గువహటి, ఆగస్టు 15: వరదలతో అల్లాడుతూ వాన నీటిలో మునిగిపోయిన ఈశాన్య రాష్ట్రాల్లోనూ భారత స్వాతంత్ర్య శోభ వెల్లివిరిసింది. ఎంత పెద్ద వరదలొచ్చినా, వాన నీరొచ్చి ముంచేసినా తమ దేశభక్తి పైపైకి ఉప్పొంగుతూనే ఉంటుందని విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలు చాటారు. సగర్వంగా జెండా వందనం చేశారు. మెడలోతు నీళ్లున్నా చిన్నారులు జెండా పండుగకు వచ్చి పతాకానికి శాల్యూట్ చేశారు. స్కూలు భవనం మొత్తం వరదనీటిలో మునిగిపోయినా ఆ స్కూల్ పైకెక్కి మరీ టీచర్, విద్యార్థులు జెండా ఆవిష్కరణ చేశారు. చుట్టూ దారులన్నీ నీటితో మునిగిపోయినా పడవలనే ఆసరాగా చేసుకుని సంబరాలు చేసుకున్నారు. ఇవీ ఈశాన్య రాష్ట్రం అసోంలో కనిపించిన స్వాతంత్ర్య దినోత్సవ దృశ్యాలు. ఇవేకాదు, అక్కడ చాలా చోట్ల ఇలాంటి పరిస్థితులు కోకొల్లలుగా కనిపించాయి.

కుల, మతాలకు అతీతంగా భారతీయులుగా గర్విద్దాం

- అందరికీ లక్ష్యాలను చేరుకునే స్వేచ్ఛ: సీజే ఖేహర్



న్యూఢిల్లీ, ఆగస్టు 15: కుల, మత విశ్వాసాలకు అతీతంగా భారతీయులుగా మనం గర్విద్దామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఖేహర్ అన్నారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవాల్లో ఆయన ప్రసంగిస్తూ... 'మీరు క్రైస్తవులు, బౌద్ధులు, హిందువులు, జోరాస్ట్రియన్లు, ముస్లింలు లేదా జైనులు.. ఎవరైనా కావొచ్చు. మీ విశ్వాసాల ఆధారంగా గర్వపడండి. అదే సమయంలో భారతీయులుగా ఉన్నందుకు, రాజ్యాంగం మనకు కల్పించిన హక్కులను బట్టి గర్వపడదాం. భారత పౌరునిగా ఉంటున్నప్పుడు మీరెవరి కంటేనూ తక్కువా కాదు... ఎక్కువా కాదు. భారత ప్రధాన న్యాయమూర్తి తొలుత భారత పౌరుడు కాదు. కానీ, భారత పౌరుడు అయినప్పుడు ఇతరులతోపాటే సమాన అవకాశాలు కలిగి ఉన్నారు. ఇదీ స్వాతంత్ర్య. ఆశలు, లక్ష్యాలను చేరుకొనేందుకు అందరికీ స్వేచ్ఛ ఉంది' అని అన్నారు. తాను కెన్యా పౌరునిగా జన్మించినట్లు జస్టిస్ ఖేహర్ చెప్పారు. కేంద్రం మంత్రి రవిశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ రాజ్యాంగంలో తొలుత 'లౌకిక' అనే పదం లేకపోయినా వారసత్వ ఆధారంగా లౌకిక దేశంగా మారడం స్వాతంత్ర్య భారత్ సాధించిన ప్రధాన విజయాల్లో ఒకటిగా అభివర్ణించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.